www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జాబిల్లిపై 'బ్లూ ఘోస్ట్'

చంద్రుడిపై దిగిన రెండో ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర 2

జనవరి 15న ప్రయోగించిన అమెరికన్ ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'ఫైర్ ఫ్లై ఏరోస్పేస్'

15 రోజులపాటు చంద్రుడిపై పరిశోధనలు

గురువారం దిగనున్న మరో ల్యాండర్.. ఎథెనా!

మరో 3 నెలల్లో జపనీస్ ల్యాండర్ కూడా..


చంద్రుడిపై దిగిన బ్లూ ఘోస్ట్. చిత్రంలో జాబిల్లి ఉపరితలాన్ని, దూరంగా భూమినీ చూడొచ్చు

సోమవారం | 3-3-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 317 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: చవితి సా.6.02 తదుపరి పంచమి, నక్షత్రం: రేవతి ఉ.6.39, అశ్విని తె.4.29, వర్జ్యం: రా.12.51-2.18, అమృతఘడియలు: రా.9.56-11.24, దుర్ముహూర్తం: మ.12.50-1.37, మ.3.11-3.58, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.35, సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి గ్రాండ్ రిపోర్ట్

రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. గత ఏడాది నీటి వనరులతో పోల్చుకుంటే ప్రస్తుత పరిస్థితి కాస్త నయమనిపిస్తున్నా.. మరికొద్ది రోజుల్లో ప్రారంభంకానున్న వేసవి నేపథ్యంలో జల వనరుల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం నీటి లభ్యత బాగానే ఉంది. కానీ, ఇదే సమయంలో మరికొన్ని జిల్లాల్లో జలాశయాలు అడుగంటి కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని వేసవిలో నీటి కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.


హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌లో అడుగంటుతున్న నీటి నిల్వ

జలాశయాలకు వేసవి గండం!

గత ఏడాది కంటే కాస్త నయం

కానీ, వేసవితో ముందు ముందు కష్టం

సాగర్, శ్రీశైలంలో తగ్గిన నీటిమట్టం

ప్రస్తుతం శ్రీశైలంలో 76 టీఎంసీలు

నాగార్జునసాగర్‌లో 169 టీఎంసీల నిల్వ

రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ఆశాజనకం

మరికొన్ని జిల్లాల్లో వట్టిపోతున్న వైనం

రిజర్వాయర్లలో తగ్గుతున్న నీరు

మరికొద్ది రోజుల్లో వేసవి సెగలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే ఎండలు మండుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నీటి వనరుల లభ్యత, సాగు, తాగునీటి అవసరాలపై జలవనరుల శాఖ దృష్టి పెట్టింది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం జలవనరుల పరిస్థితి బాగానే ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, మరికొద్ది రోజుల్లో వేసవి తీవ్రత పెరిగితే జలాశయాల్లో నీరు అడుగంటే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలు తీర్చడంపై జలవనరుల శాఖ స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకునే ప్రక్రియ ప్రారంభించింది.

సమగ్ర కథనం 11లో...

ఈసారి భగభగలే

మే వరకూ ఎండల తీవ్రత

సాధారణం కంటే ఎక్కువ

దేశంలో అనేక ప్రాంతాల్లోనూ

ఐదింట నాలుగొంతుల ప్రాంతాల్లో వడగాడ్పులు

తెలుగు రాష్ట్రాల్లోనూ సెగలే

రూ.255 కోట్లతో బీసీ మహిళలకు స్వయం ఉపాధి

లక్ష మందికి కుట్టు శిక్షణ



అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ప్రారంభం

శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో స్వయం ఉపాధి పథకాల ద్వారా బీసీల అభివృద్ధికి కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 8 నెలల్లోనే మిగతా సంక్షేమ శాఖల కంటే ముందుగా స్వయం ఉపాధి పథకాలను ప్రారంభించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్న విషయం తెలిసిందే. తాజాగా బీసీ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

మిగతా 12వ పేజీలో...

'వైపీఎస్' సునీల్‌పై వేటు!

సీఐడీ మాజీ చీఫ్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



ఆ ఐదేళ్లలో ఆరు సార్లు విదేశీ పర్యటనలు

ఒక దేశానికి వెళ్లేందుకు పర్మిషన్ పొంది వేరే దేశానికి వెళ్లిన సీనియర్ ఐపీఎస్

అనుమతి లేకుండానే కొన్నిసార్లు పయనం

అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘన

నిర్ధారించిన సిసోడియా కమిటీ

విదేశాల్లో వ్యాపారాలు, బినామీలు, బంధువులు ఉన్నట్లు అనుమానాలు

విదేశాల నుంచి నిధులు తీసుకొచ్చి ఆన్‌లైన్లో పంచారని ఫిర్యాదులు

దీంతో త్వరలో ఈడీ కూడా రంగంలోకి!

జార్జియా వెళ్తానంటూ అనుమతి తీసుకుంటారు.. దుబాయ్ వెళ్తారు.. అమెరికా వెళ్లేందుకు అనుమతి పొందుతారు.. ఇంగ్లండ్‌లో పర్యటిస్తారు.. రెండ్రోజులు సెలవులు వస్తే అనుమతి తీసుకోకుండా.. చెప్పాపెట్టకుండా స్వీడన్ చెక్కేస్తారు.. ఇవన్నీ ఎవరో అంతర్జాతీయ డాన్ చేసే విన్యాసాలనుకుంటే పొరపాటు.. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి, 'వైపీఎస్' ప్రముఖుడు పీవీ సునీల్‌కుమార్ లీలలివి. ఫలితంగా రాష్ట్రప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. 12

'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు నేడే

ఒక ఉపాధ్యాయ, 2 గ్రాడ్యుయేట్ స్థానాలకు గత నెల 27న పోలింగ్

నేటి ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం 12

మొదటి ప్రాధాన్య ఓటుతో నెగ్గకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ

తదుపరి ప్రాధాన్య ఓటు మేరకు విజేతను ప్రకటించనున్న అధికారులు

ప్రక్రియ పూర్తికి సుదీర్ఘ సమయం.. షిఫ్టుల వారీగా లెక్కింపు సిబ్బంది సిద్ధం



సెబీ మాజీ చీఫ్ మాధవి పురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి



మరో ముగ్గురు సెబీ డైరెక్టర్లు, బీఎస్ఈ ఎండీ, సీఈఓపై కూడా.. 2

30 రోజుల్లో కేసు స్థాయీ నివేదిక సమర్పించాలి

ఏసీబీకి ముంబైలోని ప్రత్యేక కోర్టు ఆదేశం



కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెకు పోకిరీల వేధింపులు

అనుచితంగా ప్రవర్తిస్తూ వీడియోలు తీసిన దుండగులు 2

గత నెల 28న మహారాష్ట్రలోని సంత్ ముక్తాయ్ యాత్రలో ఘటన

ఠాణాలో మంత్రి ఫిర్యాదు.. 2 గంటలు కూర్చోబెట్టిన పోలీసులు

అమ్మాయి విషయం కావడంతో పునరాలోచించుకోవాలని సూచన

కేంద్ర మంత్రి కుమార్తెకే రక్షణ లేకపోతే ఎలా అని రక్షా ఖడ్సే ఆవేదన

స్నానానికీ పనికిరాని 'గంగ'!

బిహార్‌లో అనేకచోట్ల కలుషితం 2

అధిక స్థాయిలో కోలిఫాం బ్యాక్టీరియా



రాజధానికి రయ్.. రయ్!

వినుకొండ-గుంటూరు ఎన్‌హెచ్ విస్తరణ వేగవంతం

రూ.2,605 కోట్ల అంచనాలతో పనులకు ఆమోదం

భూసేకరణకు మూడు జిల్లాల్లో జేసీల నియామకం

నెల రోజుల్లో టెండర్లు.. 6 నెలల్లో భూ సేకరణే లక్ష్యం

1,500 కోట్లతో నిజాంపట్నం-గుంటూరు హైవే 12

వారం, పది రోజుల్లో ఆమోదం లభించే అవకాశం

శ్రీశైలం అభయారణ్యంలో 2

ఎలివేటెడ్ కారిడార్

కేంద్రం అనుమతి.. రూ.7,700 కోట్ల వ్యయం

ఉమ్మడిగా ఎదుర్కొందాం

తరానికొకసారి వచ్చే సమస్య ఇది

శాంతిచర్చల్లో ఉక్రెయిన్‌ను బలంగా ఉంచాలంటే మన సాయం అవసరం

అమెరికా పాత్రనూ విస్మరించలేం

యూకే ప్రధాని కీర్ స్టార్మర్

ఈయూ దేశాల భేటీ తర్వాత వ్యాఖ్యలు

అమెరికాతో సంబంధం లేకుండా యూరప్ దేశాలు బలోపేతం కావాలి

యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా

ఉక్రెయిన్‌కు యూకే రుణం రూ.24,855 కోట్లు!

ఆయుధాల తయారీకి ఊతం

జెలెన్‌స్కీకి కీర్ స్టార్మర్ సాదర స్వాగతం

అన్నివిధాలా అండగా ఉంటామని హామీ


లండన్‌లో జరిగిన యూరప్ దేశాల భేటీలో మేక్రాన్, స్టార్మర్, జెలెన్‌స్కీ

లండన్, మార్చి 2: ఉక్రెయిన్ విషయంలో అమెరికాను నమ్మరాని మిత్రుడిగా తాను భావించట్లేదని.. ఆ దేశం తమకు ఎప్పటికీ ముఖ్యమైన మిత్రుడేనని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. కానీ, శాంతి చర్చల సమయంలో ఉక్రెయిన్‌ను బలమైన స్థానంలో ఉంచాలంటే యూరప్ నుంచి ఆ దేశానికి ఆర్థిక సాయం అందాల్సిందేనని ఆయన

మిగతా 2వ పేజీలో...

అక్రమ వలసలకు కళ్లెం వేశా! 2

ఫిబ్రవరిలో 8,326 కేసులే

దేశ చరిత్రలోనే అతి తక్కువ

ఇకపై ఇంగ్లిష్ అధికార భాష

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ఇంగ్లిష్‌కు పట్టం.. వైవిధ్యానికి గొడ్డలిపెట్టంటూ నిరసనలు

అడవిలో 'కిమ్' రాజ్యం!

అటవీ శాఖలో ముఖ్య అధికారి అక్రమాలు

రిటైర్మెంట్‌తో బాగోతం బట్టబయలు

గత ప్రభుత్వంలో అవకతవకలకు వంత

సీమ వైసీపీ సీనియర్ నేతకు అండ

సొంతానికి మూడు ప్రభుత్వ లగ్జరీ కార్లు

శాఖలో ఎందరో అక్రమార్కులకు అండ

కూటమి సర్కారులోనూ అడ్డగోలు బదిలీలు

ఇప్పుడు రీ ఎంప్లాయిమెంట్‌కు యత్నాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఏదైనా ఆ అధికారి ఇట్టే ప్రభుత్వ పెద్దల మెప్పు పొందుతారు. ఏ హోదాలో ఉన్నా.. ఏ పోస్టులో పని చేసినా నియంత 'కిమ్'లా వ్యవహరిస్తారన్న ప్రచారం ఉంది. తన సర్వీస్‌లో మాతృశాఖలో కన్నా ఇతర శాఖల్లోనే ఎక్కువ కాలం పని చేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ కీలక నేతలతో అంటకాగారన్న విమర్శలు ఉన్నాయి. అటవీశాఖలో ముఖ్య అధికారిగా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఇన్నాళ్లూ ఆయన చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. పాత సంబంధాలతో ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రీ ఎంప్లాయిమెంట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమైన శాఖలో పని చేసిన ఈ అధికారిని గత వైసీపీ ప్రభుత్వం మొదట్లో

మిగతా 2వ పేజీలో...

ఒక డాలరుకు 10 లక్షల రియాల్స్!

- దారుణంగా దిగజారిన ఇరాన్ కరెన్సీ విలువ
- ఆర్థిక మంత్రిని తొలగించిన పార్లమెంటు

టెహ్రాన్, మార్చి 2: ఇరాన్ కరెన్సీ అయిన 'రియాల్' విలువ దారుణంగా పడిపోవడంతో, ఇందుకు బాధ్యుడిని చేస్తూ దేశ ఆర్థిక మంత్రిని పార్లమెంటు తొలగించింది. ఆర్థిక మంత్రి అబ్దోల్ నస్సెర్ హెమ్మతిని అభిశంసిస్తూ ఆదివారం తీర్మానం చేసింది. ఒక అమెరికా డాలరు పొందడానికి 9,30,000 రియాల్స్ చెల్లించాల్సి వచ్చేలా కరెన్సీ విలువ పతనమయింది. 2015లో డాలరుతో మారకం విలువ 32,000 రియాల్స్‌గా ఉండేది. గత ఏడాది జులైలో అధ్యక్షుడిగా మసౌద్ పెజెష్కియాన్ బాధ్యతలు చేపట్టేనాటికి దాని విలువ 5,84,000 రియాల్స్‌కు పడిపోయింది. గత ఆరు నెలలుగా ఆర్థిక వ్యవహారాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రియాల్ విలువ దారుణంగా దిగజారింది. ఇప్పుడు ఒక్క డాలరు కోసం దాదాపు 10 లక్షల రియాల్స్ చెల్లించాల్సిన పరిస్థితి రావడంతో పార్లమెంటు ఆర్థిక మంత్రిపై చర్యలు తీసుకొంది. 2015లో అణు ఒప్పందం నుంచి అమెరికా తప్పుకోవడం, పశ్చిమ దేశాలు ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించడంతో పరిస్థితులు ఘోరంగా మారాయి. ఆంక్షల యుద్ధంలో చిక్కుకున్నామని, అందరూ సహకరించాలని అధ్యక్షుడు పెజెష్కియన్ కోరినప్పటికీ పార్లమెంటు మాత్రం ఆర్థిక మంత్రిని తొలగించింది. కాగా, ప్రపంచంలో అతి తక్కువ విలువ ఉన్న కరెన్సీల్లో ఇరాన్ రియాల్ మూడో స్థానంలో ఉందని అమెరికాలోని జాన్ హాప్కిన్స్ వర్సిటీ ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ స్టీవ్ హంకే తెలిపారు.


అక్రమ వలసలకు కళ్లెం వేశా: డొనాల్డ్ ట్రంప్

- ఇంగ్లిష్‌ను అధికార భాషగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్, మార్చి 2: రెండోసారి తాను అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత.. దేశంలోకి వచ్చే అక్రమ వలసదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించానని డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'అధ్యక్ష పదవిలో.. గడిచిన ఫిబ్రవరితో ఒక పూర్తి నెల పూర్తయ్యింది. ఆ నెలలో అమెరికా-మెక్సికో సరిహద్దు వద్ద 8,326 మంది మాత్రమే అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించటానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. ఇది దేశ చరిత్రలోనే అతి తక్కువ. వారందరినీ మన దేశం నుంచి బయటకు పంపించాం. అవసరమైతే కొందరి మీద క్రిమినల్ కేసులు కూడా పెట్టాం' అని పేర్కొన్నారు. మరోవైపు, ఇంగ్లిష్‌ను అమెరికా అధికార భాషగా ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఆదేశాల మీద సంతకం చేశారు. దీనిపై నిరసన వ్యక్తమవుతోంది. 'యునైటెడ్ లాటిన్ అమెరికన్ సిటిజన్స్ లీగ్' అనే సంస్థ.. అమెరికా వ్యవస్థాపకులు రాజ్యాంగంలో ఏ ఒక్క భాషకూ పట్టం కట్టకుండా, భావప్రకటన స్వేచ్ఛకు తొట్టతొలి ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేసింది. ఆలోచనలు, సంస్కృతి, వ్యక్తీకరణల్లో వైవిధ్యం వర్ధిల్లితేనే దేశం సుదృఢంగా ఉంటుందని వారు భావించారని, ఇంగ్లిష్‌ను అధికారభాషగా ప్రకటించటం ఆ ఆశయాలకు గొడ్డలిపెట్టని పేర్కొంది.

లోకం తీరు



డూప్లికేట్ ఎపిక్ నంబర్లు ఉంటే..

నకిలీ ఓటర్లు ఉన్నట్లు కాదు!

- వేర్వేరు రాష్ట్రాల్లో ఒకే విధమైన సంఖ్యలు కొన్ని ఉండొచ్చు.. మమత ఆరోపణలపై ఈసీ
- ఇకపై యూనిక్ నంబర్లు ఇస్తామని వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బెంగాల్ ఓటర్ల జాబితాల్లో హరియాణా, గుజరాత్‌లకు చెందిన నకిలీ ఓటర్లను బీజేపీ చేర్చుతోందని.. ఇందుకు ఎన్నికల కమిషన్ (ఈసీ) సహకరిస్తోందని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ చేసిన ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఓటరు కార్డు(ఎపిక్) నంబర్లు ఒకేలా ఉన్నంత మాత్రాన నకిలీ లేదా డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు కాదని ఆదివారం స్పష్టం చేసింది. మమత పేరు ప్రస్తావించకుండా.. రెండు రాష్ట్రాల ఓటర్లకు ఒకేరకమైన ఎపిక్ నంబర్లు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాలు, సోషల్ మీడియా పోస్టులను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపింది. 'కొందరు ఓటర్ల ఎపిక్ నంబర్లు ఒకే విధంగా ఉన్నా.. రాష్ట్రాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాలు వేర్వేరుగా ఉంటాయి. ఎపిక్ నంబర్‌తో సంబంధం లేకుండా.. తమ సొంత రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతంలోని నియోజకవర్గంలో, పోలింగ్ కేంద్రంలో ఓట్లు నమోదుచేసుకున్న ఏ ఓటరైనా ఓటేయవచ్చు' అని తేల్చిచెప్పింది. ఈసీకి సంబంధించిన ఎలక్టొరల్ రోల్ మేనేజ్‌మెంట్ (ఎరోనెట్) ప్లాట్‌ఫాంకు ఓటర్ల సమాచారం పంపేముందు రెండు విభిన్న రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు ఒకేవిధమైన అల్ఫాన్యూమరిక్ సిరీస్‌ను ఉపయోగించడం వల్ల తాజా సమస్య తలెత్తినట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో రిజిస్టర్డ్ ఓటర్లందరికీ ఇకపై యూనిక్ ఎపిక్ నంబర్లు కేటాయించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియకు సహకరించేందుకు ఎరోనెట్ 2.0 ప్లాట్‌ఫాంను ఆధునికీకరిస్తామని తెలిపింది. మమత ఆరోపణలను బెంగాల్ ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) కూడా తోసిపుచ్చారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం.. ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల జాబితాల నవీకరణలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), రిటర్నింగ్ అధికారులు(ఈఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు(ఏఈఆర్వోలు), జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవోలు), రాష్ట్రాల సీఈవోలు పాలుపంచుకుంటారని.. రాజకీయ పార్టీలు నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీల పాత్ర పోషిస్తారని ఆదివారం ఓ ప్రకటనలో గుర్తుచేశారు. ఓటర్ల నమోదు, జాబితాలపై ఏవైనా అభ్యంతరాలుంటే వీరి ముందు ఉంచాలని.. వాటిపై తక్షణమే దృష్టి సారిస్తున్నామని.. దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. మమత చెప్పిన మరో అబద్ధం బట్టబయలైందని బీజేపీ ఐటీ ఇన్‌చార్జి, బెంగాల్ బీజేపీ సహ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఉమ్మడిగా ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. అందుకే.. ఉక్రెయిన్‌కు తాము చేసే ఆర్థిక సాయంలో 2 బిలియన్ డాలర్లతో (దాదాపు రూ.17,500 కోట్లు) 5000 ఎయిర్ డిఫెన్స్ మిస్సైళ్ల కొనుగోళ్లకు వీలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఉక్రెయిన్ విషయంలో యూరప్ ఇతోధికంగా కష్టపడాలని.. ఖండంలో శాంతి సాధనకు కృషి చేయాలని, ఈ శ్రమ ఫలించాలంటే అమెరికా అండ అవసరమని పేర్కొన్నారు. ఇటీవల శ్వేతసౌధంలో ట్రంప్-జెలెన్‌స్కీ మధ్య జరిగిన వాగ్వాదం గురించి ప్రస్తావించిన ఆయన.. చర్చలు ఆ విధంగా చెడిపోవాలని ఎవ్వరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ఆ ఘటన నేపథ్యంలో.. ఆదివారం ఇక్కడ లండన్‌లోని 200 ఏళ్ల పురాతన లాంకస్టర్ హౌస్‌లో యూరప్ దేశాల అధినేతలు స్టార్మర్ నేతృత్వంలో సమావేశమై చర్చించారు. వారితోపాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, కెనడా ప్రధాని ట్రూడో, టర్కీ విదేశాంగ మంత్రి, నాటో చీఫ్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఉక్రెయిన్‌కు అమెరికా అండ లేదన్న కఠోర వాస్తవాన్ని అంగీకరించాల్సిందేనని.. ఎప్పుడో తరానికి ఒకసారి వచ్చే ఇలాంటి సందర్భాలను ప్రపంచ దేశాల నాయకులంతా కలిసి ఎదుర్కోవాలని ఈ భేటీ సందర్భంగా వ్యాఖ్యానించిన స్టార్మర్.. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాత్రం అమెరికాను తమకు అత్యంత ముఖ్యమైన మిత్రుడుగా పేర్కొనడం గమనార్హం. "అమెరికా యూకేకు ఎన్నో ఎన్నో దశాబ్దాలుగా మిత్ర దేశం. ఇకపైనా అలాగే కొనసాగుతుంది. మా రెండు దేశాలు ఉన్నంత సన్నిహితంగా మరే ఇతర దేశాలూ లేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు.. తాను ఉక్రెయిన్‌లో శాంతి దిశగా రచిస్తున్న ప్రణాళికల్లో అమెరికా అండ కూడా ముఖ్యమేనని ప్రకటించారు. అలాగే.. యుద్ధం ముగించడానికి చేసుకునే ఒప్పందంలో రష్యా కూడా భాగం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. అంతకుముందు.. 'సెక్యూరింగ్ అవర్ ఫ్యూచర్' పేరిట నిర్వహించిన సమావేశంలో స్టార్మర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉక్రెయిన్ విషయంలో సానుకూల ఫలితాన్ని రాబట్టడం ఇక్కడున్న ప్రతిదేశానికి, ఇతరులకు సైతం ముఖ్యమైన విషయమే" అని ఆయన స్పష్టం చేశారు. "యూరోపియన్ భద్రతను రక్షించుకునేందుకు, మనందరి సమష్టి భవిష్యత్తునూ కాపాడుకునేందుకు.. అందరం కలిసి దీన్ని ఎదుర్కోవాలి" అని పిలుపునిచ్చారు.



యూరోపియన్ యూనియన్ దేశాధినేతలతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

అమెరికాతో సంబంధం లేకుండా

తాజా పరిస్థితుల నేపథ్యంలో యూరప్ దేశాలు ఆయుధపరంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ఈ భేటీలో అభిప్రాయపడ్డారు. 2022 నుంచి రష్యా ఆక్రమించుకున్న ఏ భూభాగాన్నీ రష్యాలో భాగంగా యూరోపియన్ యూనియన్ అంగీకరించకూడదని పేర్కొన్నారు. అమెరికాపై ఎంతమాత్రం ఆధారపడకుండా యూరోపియన్ యూనియన్ పూర్తిస్థాయిలో ఒక ఆర్మీని ఏర్పరచుకోవాలనే ప్రతిపాదనను ఉర్సులా చాలాకాలంగా చేస్తున్నారు. ఇక.. ఈ సమావేశం అనంతరం జెలెన్‌స్కీ కింగ్ చార్లెస్‌తో భేటీ అయ్యారు.

ఉక్రెయిన్‌కు యూకే రూ.24,855 కోట్ల రుణం

లండన్, మార్చి 2: యుద్ధం దెబ్బకు అసలే అతలాకుతలమైన ఉక్రెయిన్‌కు సాయం చేయడానికి అమెరికా ససేమిరా అంటున్నా.. యూరప్ దేశాలు అండగా నిలుస్తున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌కు 2.26 బిలియన్ పౌండ్ల (దాదాపు రూ.24,855 కోట్లు) రుణం ఇవ్వడానికి యూకే సిద్ధమైంది. ఈమేరకు రుణ ఒప్పందంపై ఇరు దేశాల ఆర్థిక మంత్రులూ సంతకాలు చేశారు. ఈ రుణానికి సంబంధించి తొలి విడత నిధులు ఉక్రెయిన్‌కు వచ్చేవారం అందుతాయి. ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇస్తామని జీ7 దేశాలు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అందులో ఇది బ్రిటన్ వాటా. తమదేశంలో స్తంభింపజేసిన రష్యా ఆస్తుల నుంచి యూకే ఈ మొత్తాన్ని ఇస్తోంది. ఆ డబ్బును ఆయుధాల తయారీకి వినియోగించనున్నట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. కాగా.. అమెరికాలో అధ్యక్ష, ఉపాధ్యక్షుల తీరుతో తీవ్ర అవమాన భారాన్ని ఎదుర్కొన్న జెలెన్‌స్కీకి.. యూకేలో అందుకు భిన్నంగా సాదర స్వాగతం లభించింది. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ లండన్‌లోని 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ఉన్న తన నివాసం వద్దకు చేరుకున్న జెలెన్‌స్కీని ఆత్మీయ ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. "ఎంతకాలమైనా సరే మేం మీకు మద్దతుగా నిలుస్తాం" అని హామీ ఇచ్చారు. దీనికి జెలెన్‌స్కీ ఎంతగానో హర్షం వ్యక్తం చేశారు. "మీలాంటి స్నేహితులున్నందుకు ఉక్రెయిన్ సంతోషంగా ఉంది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ మాకు అండగా నిలిచిన యూకే ప్రజలకు నా కృతజ్ఞతలు." అని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆహ్వానం.. విద్యార్థులకు తిరస్కారం

మారిన కెనడా వలస విధానం

న్యూఢిల్లీ, మార్చి 2: కెనడాలో ఉద్యోగం, నివాసం కోరుకుంటున్న భారతీయ ఉపాధ్యాయులకు శుభవార్త. ఐఆర్‌సీసీ(కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వం)లో తాజాగా మార్పులు అలాంటివారికి శాశ్వత నివాసం కల్పించనున్నాయి. విద్యా వ్యవస్థలో ఖాళీల భర్తీ కోసం మరింత మంది టీచర్లు, సహాయక సిబ్బందిని దేశంలోకి రప్పించాలని కెనడా భావిస్తోంది. నిపుణులను దేశంలోకి ఆహ్వానించే ప్రాధాన్యతా వృత్తుల జాబితాను గత గురువారం నవీకరించింది. ఇందులో కొత్తగా టీచర్లు, సహాయక సిబ్బంది, వంటవారిని చేర్చింది. రవాణా రంగాన్ని మొత్తంగా, స్టెమ్ సంబంధిత పలు ఉద్యోగాలను జాబితా నుంచి తొలగించింది. కెనడా విద్యారంగంలో ప్రీ ప్రైమరీ, ప్రాథమిక, సెకండరీ టీచర్లు, సహాయకులు, చిన్నారులకు బోధించేవారు, ప్రత్యేక అవసరాలు గలవారి ఇన్‌స్ట్రక్టర్లను చేర్చారు. అలాగే, మరిన్ని సామాజిక సేవలు, వివిధ టెక్నాలజిస్టులు, టెక్నీషియన్ ఉద్యోగాలతో ఆరోగ్య రంగాన్ని విస్తరించారు. స్టెమ్ కేటగిరీ నుంచి ఆర్కిటెక్టులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డేటా సైంటిస్టులు, కంప్యూటర్ సిస్టమ్స్ మేనేజర్లు తదితరులను తొలగించి బీమా ఏజెంట్లు, బ్రోకర్లను చేర్చారు. వాణిజ్య కేటగిరిలో వంటవారిని చేర్చారు. రవాణా రంగాన్ని ప్రాధాన్యతా ఎంపికల నుంచి తొలగించారు. అంటే ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టం కింద ఇకపై ట్రక్ డ్రైవర్లు, భారీ పరికరాల ఆపరేటర్లు, విమానయాన పైలట్లను తీసుకోబోరు. మరోవైపు, కెనడాలో ఉన్న 4.23 లక్షల మంది భారతీయుల్లో ఇప్పటికే వేలాదిమంది ముఖ్యంగా విద్యార్థులు నూతన నిబంధనల పట్ల గందరగోళానికి గురవుతున్నారు. డాక్యుమెంటేషన్‌లో స్వల్ప లోపాలతో విద్యాభ్యాసం మధ్యలోనే అనేకమంది విద్యార్థుల స్టడీ పర్మిట్లు రద్దవుతున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కన్సల్టెన్సీలు చెబుతున్నాయి.

కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెకు వేధింపులు

- స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన మంత్రి

ముంబై, ఫిబ్రవరి 2: కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే కుమార్తెను పోకిరీలు వేధించారు. దీనిపై రక్షా ఖడ్సే స్వయంగా ముక్తాయ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేంద్ర మంత్రినైన తన కుమార్తెకే రక్షణ లేకపోతే సామాన్యులకు ఎలా అని ఆమె వాపోయారు. మహారాష్ట్ర జల్‌గావ్ జిల్లాలోని ముక్తాయ్‌నగర్‌లో గత నెల 28న మహాశివరాత్రి సందర్భంగా సంత్‌ముక్తాయ్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో పాల్గొంటానని కుమార్తె కోరడంతో గుజరాత్ పర్యటనలో ఉన్న తాను సెక్యూరిటీనిచ్చి పంపినట్లు రక్షా ఖడ్సే తెలిపారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా ఆకతాయిలు లెక్కచేయలేదు. రక్షా ఖడ్సే కుమార్తెను, ఆమె స్నేహితులను ఏడుగురు పోకిరీలు వెంబడించి వేధించారు. అనుచితంగా ప్రవర్తిస్తూ ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ యువకులే గత నెల 24న కూడా తనను వేధించారని కుమార్తె చెప్పడంతో కేంద్ర మంత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు 2 గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టిన పోలీసులు.. అమ్మాయిల విషయం కావడంతో కేసు పెట్టే విషయంలో పునరాలోచించుకోవాలని సూచించినట్లు రక్షా ఖడ్సే మామ ఏక్‌నాథ్ ఖడ్సే తెలిపారు. నిందితులపై గతంలోనూ అనేక ఫిర్యాదులు వచ్చినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఎట్టకేలకు పోలీసులు నిందితులపై పోక్సో, ఐటీ చట్టాల కింద కేసు నమోదు చేసి సోహమ్ అనే ఆకతాయిని అరెస్ట్ చేశారు.



రక్షా ఖడ్సే

అభయారణ్యంలో శ్రీశైలానికి సాఫీగా ప్రయాణం

- ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతి.. 30 అడుగుల ఎత్తులో నిర్మాణం

న్యూఢిల్లీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-శ్రీశైలం రహదారికి మహర్దశ పట్టనుంది. 125 కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ జాతీయ రహదారిలో.. అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా వెళ్లే 62 కిలోమీటర్ల దూరం(కల్వకుర్తి-శ్రీశైలం) కేవలం రెండు లేన్ల ఘాట్లతో ఇరుకుగా ఉంటూ.. వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో మలుపుల కారణంగా.. వన్య ప్రాణులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ సమస్యకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో పరిష్కారం లభించనుంది. ఈ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. 62 కిలోమీటర్ల మేర.. అభయారణ్యంలో 30 అడుగుల ఎత్తులో నిర్మితమయ్యే ఈ రహదారికి రూ.7,700 కోట్లు ఖర్చవుతుందని అంచనా. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బ్రాహ్మణపల్లి నుంచి మన్ననూరు, కుంచోనిమూల, దుర్వాసుల చెరువు ఫరహాబాద్, వటువర్లపల్లి, దోమలపెంట గిరిజన గ్రామాల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ వెళ్తుంది.

సెబీ మాజీ చీఫ్ మాధవిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఏసీబీకి ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశం

ముంబై, మార్చి 2: పదవీ విరమణ పొందిన రోజు నుంచే సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బుచ్‌కు కొత్త కష్టాలు మొదలయ్యాయి. స్టాక్ మార్కెట్ కుంభకోణానికి సంబంధించిన ఒక కేసులో ఆమెతోపాటు ప్రస్తుతం సెబీ డైరెక్టర్లుగా ఉన్న అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్షణిలపైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ముంబై వర్లీ ప్రాంతంలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు.. ఏసీబీని ఆదేశించింది. వీరితో పాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి, మాజీ చైర్మన్, పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్‌పైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించింది. న్యాయమూర్తి శశికాంత్ ఏకనాథ్ రావు బంగర్ శనివారం ఈ ఆదేశాలు జారీ చేశారు. తమ పర్యవేక్షణలో జరిగే ఈ కేసు దర్యాప్తును నెల రోజుల్లో స్థాయి నివేదిక సమర్పించాలని కూడా ఆదేశించారు. సపన్ శ్రీవాస్తవ అనే జర్నలిస్టు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 1994లో ఒక కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా తన షేర్లను లిస్ట్ చేసి, ఆ తర్వాత పెద్దఎత్తున అక్రమంగా తన షేర్ల ధర పెంచుకుని మదుపరుల నెత్తిన టోపీ పెట్టిందని ఆయన ఆరోపించారు. దీనిపై సెబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. 'ఈ కేసులో నిందితులు నిబంధనలు తుంగలో తొక్కి కుమ్మక్కయ్యారు. అందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి' అన్న జడ్జి.. ఎఫ్ఐఆర్‌ల నమోదుకు ఆదేశించారు.

స్నానానికి పనికిరాని గంగ నీరు!

- బిహార్‌లో అనేక చోట్ల కలుషితం
- రాష్ట్ర ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి

పట్నా, మార్చి 2: కాలుష్యం కారణంగా బిహార్‌లోని అనేక చోట్ల గంగా నది నీరు స్నానానికి పనికి రాదని రాష్ట్ర అసెంబ్లీలో ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2024-25 వెల్లడించింది. నీటిలో అధిక స్థాయిలో బ్యాక్టీరియాలు (టోటల్ కోలిఫాం, ఫీకల్ కోలిఫాం) ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు బిహార్ కాలుష్య నియంత్రణ మండలి(బీఎస్‌పీసీబీ) రాష్ట్రంలోని 34 చోట్ల పక్షం రోజులకోసారి చేసిన గంగా నది నీటి నాణ్యత పరిశీలనలో వెల్లడైందని అధికారులు తెలిపారు. గంగా నది, దాని ఉపనదుల ఒడ్డున ఉండే పట్టణాల నుంచి మురుగునీరు, ఇళ్ల నుంచి వచ్చి కలిసే వ్యర్థ నీటి కారణంగా బ్యాక్టీరియా అధిక మొత్తంలో చేరిందని సర్వే పేర్కొంది. ఇదే సమయంలో గంగా, దాని ఉపనదుల్లో పీహెచ్, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్, బయో-కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ) వంటి ఇతర పారామితులు పరిమితి స్థాయిలో ఉన్నాయని, ఈ నీరు జల జీవరాశులకు, చేపల పెంపకానికి, వ్యవసాయానికి సరిపోతుందని తెలిపింది. బీఎస్‌పీసీబీ చైర్మన్ శుక్లా మాట్లాడుతూ.. మలంలో ఈ ఫీకల్ కోలిఫాం బ్యాక్టీరియా ఉంటుందని చెప్పారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా గంగా నదిలో చాలా చోట్ల ఫీకల్ కోలిఫాం పరివిుతి మించిపోయిందని, దీంతో ఆ నీరు స్నానానికి పనికిరాదని పేర్కొన్నారు. నదిలోకి వచ్చే నీటి శుద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అడవిలో 'కిమ్' రాజ్యం!!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు లేని విభాగానికి మార్చింది. తర్వాత అదే ప్రభుత్వం నాలుగైదు కీలకమైన శాఖలకు కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. చివరిలో అటవీ శాఖకు మార్చింది. ఆ సమయంలో రాయలసీమకు చెందిన వైసీపీ సీనియర్ నేత అటవీ ప్రాంతంలో చేసిన అక్రమాలకు ఆయన దన్నుగా నిలిచారన్న విమర్శలున్నాయి. వైసీపీ హయాంలో అడవులను ధ్వంసం చేసినా ఏమీ తెలియనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అందుకు కారణం.. గతంలో మంత్రిగా పని చేసిన వైసీపీ నేత సదరు అధికారిని లూప్ లైన్ నుంచి కీలక పోస్టుల్లోకి తెచ్చారన్న ప్రచారం ఉంది. ప్రభుత్వం మారినా ఆయన ముఖ్య అధికారిగా కొనసాగారు. సర్వీస్ చివరలో మార్చడం ఎందుకులే అని కూటమి కొనసాగించింది. యూనిఫామ్ డిపార్ట్‌మెంట్‌గా ఉన్నందున కింది స్థాయి ఉద్యోగులు ఆయన అసంబద్ధ నిర్ణయాలపై ఎవరికీ చెప్పుకోలేకపోయారు.

అద్దె పెంపునకు నజరానా

రాష్ట్ర విభజన నేపథ్యంలో అటవీశాఖ ప్రధాన కార్యాలయాన్ని గుంటూరులోని సొంత భవనంలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో 2022 డిసెంబరులో రెండేళ్ల కాల వ్యవధితో మంగళగిరిలోని అద్దె భవనంలోకి మార్చారు. సాధారణంగా అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి మారతారు. కానీ అటవీ అధికారులు సొంత భవనం నుంచి అద్దె భవనంలోకి మారడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల భూములుండి, ఇతర శాఖలకు, సంస్థలకు స్థలాలిచ్చే అటవీ శాఖకు సొంత జాగా లేనట్లు సొంత భవనాన్ని నిర్మించలేకపోయింది. ఆఫీస్ అద్దె నెలకు రూ.20 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకుని, రెండేళ్లకు దాదాపు రూ.5 కోట్లు చెల్లించింది. చ.అడుగుకు మొదట రూ.29.5గా నిర్ణయించారు. ఆ ఒప్పందం ముగిశాక మరో రెండేళ్లకు లీజు పొడిగించి, చదరపు అడుగుకు రూ.31 చేశారు. ఆఫీస్‌లో ఫర్నీచర్, వసతులు, ఇతర సదుపాయాలకు రూ.14 నుంచి రూ.18కి పెంచారు. ఆఫీస్ నిర్వహణ చార్జీల పాత రేటును మాత్రం రూ.6గానే ఉంచారు. దీంతో భవనం అద్దె చదరపు అడుగుకు రూ.49.5 నుంచి రూ.55కు పెంచినట్లైంది. మొత్తంగా ఆ భవనానికి ఏడాదికి రూ.27లక్షలకు పైగా అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ అనుమతి లేకుండా అద్దె పెంపుదలకు ప్రతిఫలంగా అద్దె భవన యజమానికి చెందిన విలాసవంతమైన 169 నంబరు విల్లాలోకి(రెయిన్‌ట్రీ పార్క్ పక్కనే) తన నివాసాన్ని మార్చుకున్నారని అటవీ శాఖ వర్గాలు చెప్తున్నాయి. విల్లాలో రెండేళ్లు ఉచితంగా ఉండేలా ప్రైవేటుగా ఒప్పందం చేసుకుని, ప్రభుత్వం నుంచి అద్దె తీసుకుని సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. విల్లాలో చేరినప్పుడు ఫర్నీచర్ వంటి సౌకర్యాల ఏర్పాటు ఖర్చు కింది స్థాయి ఉద్యోగులపై మోపారని, నగరవనంలో పని చేసే సిబ్బందిని సొంత పనులకు వినియోగించుకున్నారని తెలిసింది. ఇక ఖరీదైన మూడు ప్రభుత్వ వాహనాలను విశేష అధికారంతో సొంత పనులకు వాడుకున్నట్లు సమాచారం.

పులిగోర్ల కథ ఏమిటో?

గతేడాది తిరుపతి జూ పార్కులో మాయమైన పులి గోర్లు ఎవరికి చేరాయనే విషయంపై ఆరా తీసిన దాఖలా లేదు. పులికి మత్తు ఇచ్చి, గోళ్లు పీకి.. మనిషికి పళ్లు ఊడినట్లు పులి గోళ్లు ఊడిపోయినట్లు ఫైల్ క్లోజ్ చేశారని సమాచారం. మత్తు ఎక్కువై అనారోగ్యంతో పులి చనిపోయిన విషయాన్ని కూడా అధికారులు దాచిపెట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలోనూ ముఖ్య అధికారిగా పనిచేసిన సదరు వ్యక్తిపై ఆరోపణలు ఉన్నాయి.

సదరు అధికారి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసేటప్పుడు ఇచ్చే బొకేల ఖర్చు, ఉద్యోగ విరమణ, రీ ఎంప్లాయిమెంట్ పార్టీల ఖర్చు కూడా క్షేత్ర స్థాయి ఉద్యోగులపైనే వేశారన్న విమర్శ ఉంది.

బదిలీలపై ఆక్షేపణలు

కూటమి ప్రభుత్వం వచ్చాక మంత్రికి తెలియకుండా తనకు అనుకూలమైన వారికి ఆ అధికారి కీలక పోస్టులు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం చేయాల్సిన బదిలీలూ ఆయనే చేయడంతో కొందరు కోర్టును ఆశ్రయించారు. మరికొందరు ఈ అధికారికి భయపడి వేసిన పోస్టుల్లోనే చేరారు. ఏకపక్ష బదిలీలను కోర్టు రద్దు చేసిందని చెప్తున్నారు. అటవీ శాఖలో కీలకమైన తిరుపతి, కర్నూలు, గుంటూరు సర్కిల్స్ ఖాళీగా ఉంచారు. తిరుపతి, గుంటూరు డీఎఫ్‌వోలకు సర్కిల్స్‌లో అదనపు బాధ్యతలు అప్పగించగా, కర్నూలు సర్కిల్‌ను అనంతపురం కన్జర్వేటర్‌కు అప్పగించారు. నంద్యాలలో అక్కడి డీఎఫ్‌వోకే సర్కిల్ పోస్ట్ ఇచ్చారు. ప్రధాన కార్యాలయంలో ఒక్కో సబ్జెక్ట్‌ను ఒక్కో అధికారి పర్యవేక్షిస్తుంటారు. కానీ పలువురికి ప్రాధాన్యం ఉన్న సబ్జెక్టులు తీసేసి, వాటిపై మరికొందరికి పూర్తి అదనపు బాధ్యతలిచ్చారు. పీసీసీఎఫ్ స్థాయి అధికారులకు ఏ మాత్రం ప్రాధాన్యం లేని సబ్జెక్టులు ఇచ్చారన్న విమర్శ ఉంది. ఏసీఎఫ్, డీసీఎఫ్‌లకు ప్రభుత్వం ఇచ్చిన పోస్టు కాకుండా, ఇతర బాధ్యతలు అప్పగించారు. 15 ఏళ్లకు పైగా ఇండిపెండెంట్ డివిజన్లు చేసిన కొందరు సీనియర్ ఏసీఎఫ్‌లకు సబ్ డీఎఫ్‌వోలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఓ మహిళాధికారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్న విమర్శలొచ్చాయి. అధికార పార్టీ నేతల సిఫారసులను పక్కన పెట్టి.. సంబంధిత మంత్రి, సీఎంవో ఆదేశాలంటూ ఇష్టానుసారంగా బదిలీలు చేశారన్న విమర్శలున్నాయి.

ఎందరో అక్రమార్కులు

అటవీశాఖలో కొందరు అక్రమార్కులకు సదరు అధికారి అండగా నిలిచారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల అల్లూరి జిల్లాలో రూ.రెండు కోట్ల విలువైన టేకు చెట్లను అక్రమంగా నరికించి, ఎకో టూరిజం నిధుల్ని స్వాహా చేసిన అధికారిని తిరుపతిలో కీలక పోస్టులో నియమించారని చెప్తున్నారు. కొల్లేరులో అక్రమ చేపల చెరువుల్ని ఖాళీ చేయించకుండానే ఐదు వేల ఎకరాల్లో చేపల చెరువుల్ని ధ్వంసం చేసినట్లు సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసినట్లు సమాచారం. ఇందుకోసం ముడుపులు పుచ్చుకుని అక్రమణదారులకు ఊతమిచ్చారన్న ఆరోపణలున్నాయి.

డిప్యూటీ సీఎం చొరవ చూపినా..

రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ఏనుగుల గుంపుల దాడులతో తరచూ అనేకమంది మృత్యువాత పడుతున్నారు. ప్రజల ఆస్తులు ధ్వంసమౌతున్నాయి. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బెంగళూరు వెళ్లి, కర్ణాటక సీఎంతో చర్చించి కుంకీ ఏనుగులను రప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ తీసుకురావడంలో అటవీ అధికారుల వైఫల్యం పై సీఎం, డిప్యూటీ సీఎం అసహనం వ్యక్తం చేశారు.

చందమామపై 'బ్లూ ఘోస్ట్'

- చంద్రుడిపై దిగిన రెండో ప్రైవేటు ల్యాండర్‌గా చరిత్ర
- జనవరి 15న ప్రయోగించిన అమెరికన్ ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ 'ఫైర్ ఫ్లై ఏరోస్పేస్'



న్యూయార్క్, మార్చి 2: చందమామపై దాదాపు ఏడాది వ్యవధిలోనే రెండో ప్రైవేటు ల్యాండర్ దిగింది! అమెరికాకు చెందిన ఫైర్ ఫ్లై ఏరోస్పేస్ అనే ప్రైవేటు అంతరిక్ష సంస్థకు చెందిన 'బ్లూ ఘోస్ట్' ల్యాండర్.. నాసాకు చెందిన 10 శాస్త్ర, సాంకేతిక పరికరాలతో ఆదివారం విజయవంతంగా ల్యాండయింది. దాదాపు 6.6 అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పున ఉండే ఈ ల్యాండర్‌ను జనవరి 15న కేప్‌కెనవరాల్ (ఫ్లోరిడా)లోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించారు. చందమామపై నిర్దీత ల్యాండింగ్ సైట్‌కు 328 అడుగుల పరిధిలోనే ఇది ల్యాండ్ అయినట్టు ఫైర్‌ఫ్లై సంస్థ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. చంద్రుడిపై దిగిన అరగంట తర్వాత.. బ్లూ ఘోస్ట్ అక్కడి చిత్రాలు తీసి భూమికి పంపడం ప్రారంభించింది. బ్లూఘోస్ట్ ద్వారా చంద్రుడిపైకి 10 పరికరాలను పంపడానికి నాసా 101 మిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.883.45 కోట్లు).. ఆ పరికరాల తయారీకి 44 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.385 కోట్లు) ఖర్చు చేసింది. ఆ పరికరాలతో చందమామపై బ్లూ ఘోస్ట్ రెండువారాలపాటు (చంద్రుడిపై 15 రోజులు పగలు ఉంటుంది) పరిశోధనలు చేయనుంది. కాగా.. అమెరికాకే చెందిన 'ఇంట్యూటివ్ మెషీన్స్' అనే ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థ ప్రయోగించిన మరో ల్యాండర్ 'ఏథెనా'.. నిర్దీత షెడ్యూలు ప్రకారం గురువారం చంద్రుడిపై ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, అది చంద్రుడి దక్షిణ ధ్రువానికి 100 మైళ్ల పరిధిలో ల్యాండ్ కానుంది. ఆ సంస్థ గత ఏడాది ఫిబ్రవరి 22న.. 'ఒడిసస్' అనే ల్యాండర్‌ను చందమామపై దించి, ఆ ఘనత సాధించిన తొలి ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థగా చరిత్ర సృష్టించింది. అయితే, ల్యాండింగ్ సమయంలో ఒడిసస్ రేంజింగ్ లేజర్ల పనితీరు దెబ్బతిని, దాని కాళ్లలో ఒకటి విరిగి, సమతౌల్యం తప్పి కిందపడిపోయింది. అయినప్పటికీ బలహీనంగానైనా సంకేతాలను భూమికి పంపింది. దాంతో పోలిస్తే బ్లూఘోస్ట్ ఎలాంటి సమస్యలూ లేకుండా చక్కగా ల్యాండయింది. అందుకే.. సాంకేతికంగా దీన్నే చంద్రుడిపై సజావుగా ల్యాండయిన తొలి ప్రైవేటు ల్యాండర్‌గా భావించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక, ఈ రెండు ల్యాండర్లతోపాటు.. జపాన్‌కు చెందిన 'ఐస్పేస్' అనే కంపెనీ బ్లూఘోస్ట్‌తోపాటు కేప్ కెనవరాల్ నుంచి జనవరి 15న ఒక ల్యాండర్‌ను ప్రయోగించింది. అది కొంచెం సుదీర్ఘకాలంపాటు ప్రయాణించి మరో మూడు నెలల తర్వాత చందమామపై దిగనుంది. 2023లో ఆ సంస్థ చంద్రుడిపైకి పంపిన తొలి ల్యాండర్ క్రాష్ అయింది. ఇది ఆ సంస్థ ప్రయోగించిన రెండో ల్యాండర్.

బెజవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం

- ఇక విజయవాడ వేదికగా కూడా సేవా కార్యక్రమాలు
- 6న శంకుస్థాపన చేయనున్న నారా భువనేశ్వరి





ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనం నమూనా

విజయవాడ, మార్చి 2, (ఆంధ్ర జ్యోతి): బెజవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ ఏర్పాటు కానుంది. 16వ జాతీయ రహదారి వెంబడి ఎల్ఈపీఎల్ మాల్ పక్కన, సాయిబాబా టెంపుల్ రోడ్డు జంక్షన్‌లో జీప్లస్5 విధానంలో అధునాతనంగా ఈ భవనం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభంకానున్నాయి. దాదాపు 600 గజాల స్థలాన్ని కొద్దికాలం కిందట ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ కొనుగోలు చేసింది. ఇప్పటికే హైదరాబాద్ నుంచి ట్రస్టు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇకపై, ఆంధ్రప్రదేశ్‌లో కూడా సేవా కార్యక్రమాలను చేపట్టడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. భవనం పూర్తయితే ట్రస్ట్ కార్యకలాపాలన్నీ ఇక్కడి నుంచే జరుగుతాయి. ముఖ్యంగా విద్య, వైద్య సంబంధిత కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతాయి. హైదరాబాద్ మెమోరియల్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న కొంతమంది ఇక్కడికి బదిలీ కానున్నారు. అవసరాన్ని బట్టి స్థానికంగా కూడా నియమాకాలు ఉంటాయి. కాగా, భవన నిర్మాణానికి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 6న శంకుస్థాపన చేయనున్నారు.

ఉన్నత విద్యామండళ్ల చైర్మన్ల భేటీ

- రెండు తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారంపై చర్చ

అమరావతి/విజయవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నత విద్యా మండళ్ల చైర్మన్లు కె.మధుమూర్తి, వి.బాలకిష్టారెడ్డి ఆదివారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో భేటీ అయ్యారు. ఉన్నత విద్యారంగంలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారం పెంపొందించుకోవడం, విద్యారంగంలో అవకాశాలు మెరుగుదల, పరిశోధన, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడం లాంటి అంశాలపై చర్చించారు. ప్రధానంగా విద్యారంగంలో ఉత్తమ పాలసీల రూపకల్పన, పరస్పర భాగస్వామ్యం, రెండు రాష్ట్రాల్లో ఉన్నత విద్య నాణ్యత పెంచేందుకు ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై చర్చించినట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ సమస్యలు పరిష్కరిస్తాం

ఏపీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాల విడుదలకు త్వరలోనే పరిష్కారమార్గం చూపుతామని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి హామీ ఇచ్చారు. విభజన చట్టంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అంశాన్ని ఉభయ రాష్ట్రాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగా జోషి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డితో భేటీ అయి.. ఆయా సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో ఎదురవుతున్న సమస్యలపై ఇరువురు చర్చించారు. పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో రాష్ట్రంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విధివిధానాలు మారాయని, గడిచిన ఏడాదిగా దాదాపు 30 వేలకు పైగా విద్యార్థులు ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు లేక నష్టపోతున్నారని జోషి వివరించారు. దీనిపై బాలకృష్టారెడ్డి సానుకూలంగా స్పందించారు.





జైళ్ల శాఖ..

'కోస్తాంధ్ర'లో కోల్డ్‌వార్

ఉన్నతాధికారి x సిబ్బంది.. విశాఖ, రాజమహేంద్రవరం

కేంద్ర కారాగారాల్లో గందరగోళం.. వరుస వివాదాలు.. సస్పెన్షన్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జైళ్ల శాఖ కోస్తాంధ్ర రేంజ్‌లో కోల్డ్ వార్ నడుస్తోంది. ఓ ఉన్నతాధికారి, గార్డింగ్ సిబ్బంది కేంద్ర బిందువులుగా రగిలిన వివాదం కొనసాగుతూనే ఉంది. వాట్సాప్ గ్రూపుల్లో ఉన్నతాధికారిపై ధిక్కార స్వరం.. జైలులో విషయాలు ఉద్దేశపూర్వకంగా బయటకు వెల్లడించడం.. సిబ్బంది సస్పెన్షన్ల వరకూ వెళ్లడం.. ఇలా వివాదం తీవ్రమవుతోంది. దీనంతటికీ మూల కారణం విధుల షిఫ్టుల్లో మార్పు చేయడమేనని తెలుస్తోంది. ప్రధానంగా రాజమహేంద్రవరం, విశాఖ కేంద్ర కారాగారాల్లో ఈ రగడ ముదిరి పాకాన పడింది. జైళ్ల శాఖలో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం జిల్లా వరకూ కోస్తాంధ్ర ప్రాంతంలోకి వస్తాయి. దీనికి రాజమహేంద్రవరంలో ప్రధాన కార్యాలయం ఉంది. ఎంఆర్ రవికిరణ్ ఈ రేంజ్ డీఐజీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన పరిధిలో రాజమహేంద్రవరం, విశాఖపట్నం కేంద్ర కారాగారాలు ఉన్నాయి. ఇటీవల విశాఖ కేంద్ర కారాగారంలో ఓ ఖైదీ ఉరి వేసుకున్నాడు. సాధారణంగా జైలుకు రిమాండ్/శిక్ష పడిన ఖైదీ వచ్చిన తర్వాత మూడు రోజులు క్వారంటైన్‌లో అంటే ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతారు. తర్వాత వైద్యుడి అనుమతితో బ్యారక్‌లో వేస్తారు. కానీ విశాఖలో సదరు ఖైదీని ఒక్క రోజు కూడా కాకుండానే బ్యారక్‌కు మార్చారు. దీంతో ఆ ఖైదీ మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురై ఉరి వేసుకున్నట్టు చెబుతున్నారు. విచారణలో రాత్రి వేళల్లో గార్డింగ్ సిబ్బంది లోపలికి వెళ్లడం, భోజనాల క్యారేజీల్లో గంజాయి, సిగరెట్లు తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. గార్డింగ్ స్టాఫ్ రోజుకు 8 గంటల కంటే ఎక్కువ సమయం విధుల్లో ఉన్నందున వారికి ఒక పూట భోజనం జైలులో పెట్టాలని, ఆ ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని 1975లో నాటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ఇటీవల 3 షిఫ్టుల విధానంలో రోజుకు 6 గంటలే పనిచేసినా స్టాఫ్ మెస్‌లో భోజనం లెక్క రాశారు. స్టాఫ్ మెస్‌లో భోజనాల నివిఎత్తం రాసిన సొమ్ము ఎవరి జేబులోకి వెళ్లిందో? జైలులో ఇలా గందరగోళ పరిస్థితులు ఉన్నాయి.

వరుస వివాదాలు...

విశాఖ సెంట్రల్ జైలులో నిబంధనల ఉల్లంఘనలపై ఉన్నతాధికారులు ప్రశ్నలు లేవనెత్తగా.. గార్డింగ్ స్టాఫ్ కొరత వల్ల పర్యవేక్షణ కష్టంగా మారిందనే సమాధానం వచ్చింది. వార్డర్, హెడ్ వార్డర్లను గార్డింగ్ స్టాఫ్‌గా పిలుస్తారు. ఖైదీల పర్యవేక్షణలో వీరు కీలకపాత్ర పోషిస్తారు. హెడ్ ఆఫీస్ ఆదేశాలను అనుసరించి.. స్టాఫ్ కొరత ఉన్నప్పుడు మూడు షిఫ్టుల డ్యూటీ బదులు రెండు షిఫ్టుల డ్యూటీలు ఎందుకు వేయలేదనే ప్రశ్న ఉత్పన్నమైంది. పర్యవసానంగా సూపరింటెండెంట్, అడిషనల్ సూపరింటెండెంట్‌ను మొదట బదిలీ చేసి తర్వాత విధుల నుంచి తాత్కాలికంగా తప్పించారు. ఏడుగురు సిబ్బందిపై చార్జ్ ఫ్రేమ్ చేశారు. నెల్లూరు అడిషనల్ సూపరింటెండెంట్ మహేశ్‌కి విశాఖ కారాగార బాధ్యతలు అప్పగించారు. ఆయన వచ్చిన వెంటనే రెండు షిఫ్టులు అమలు చేయడం మొదలు పెట్టారు. అప్పటి వరకూ నిబంధనల ఉల్లంఘనల దృష్ట్యా ముందుజాగ్రత్తలో భాగంగా గార్డింగ్ స్టాఫ్‌ను వస్త్రాలు తీయించి అధికారులు తనిఖీలు చేశారు. ఈ ఘటన రచ్చరచ్చ అయ్యింది. నిబంధనల ప్రకారమే తాము అలా చేశామని అధికారులు చెబుతున్నారు. కాగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి 54 రోజులు సెలవుపై వెళ్లగా ఆ బాధ్యతలు డీఐజీ రవికిరణ్ నిర్వర్తించారు. ఆ సమయంలో ఇక్కడ కూడా రెండు షిఫ్టుల విధానం తీసుకొచ్చారు. దీంతో ముసలం పెద్దదైంది. డీఐజీ ఇంట్లో ఏసీ రిపేర్ కోసం ఒక ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీని పంపించారు. దానిని వీడియో తీసి ప్రచారం చేసిన ఒక హెడ్ వార్డర్‌ను సస్పెన్షన్ చేశారు. మరోవైపు.. విశాఖ, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాల్లో గార్డింగ్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ కారణంతోనే రెండు షిఫ్టుల విధానం అమల్లోకి తెచ్చామని చెబుతున్నారు.



వెనిగళ్ల సూర్యకుమారికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

వెనిగళ్ల సూర్యకుమారికి ఘన నివాళి

విజయవాడ(కృష్ణలంక), మార్చి 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ వెనిగళ్ల నరేంద్రబాబు మాతృమూర్తి వెనిగళ్ల సూర్యకుమారి దశదిన కర్మను ఆదివారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి పి.నారాయణ, నగర ప్రముఖులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు, గోసలైట్స్ సిబ్బంది తదితరులు సూర్యకుమారి చిత్రపటానికి అంజలి ఘటించారు. ఆమె ప్రేమాభిమానాలు, మంచితనాన్ని కొనియాడుతూ ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నరేంద్రబాబు కుటుంబానికి సంతాపం తెలియజేశారు. గుంటూరు జిల్లా దోనేపూడి గ్రామంలో 1941, అక్టోబరు 10న వీరమాచనేని సత్యనారాయణ చౌదరి, మంగమ్మ దంపతులకు సూర్యకుమారి జన్మించారు. పీయూసీ ఉత్తీర్ణులైన ఆమె 1957 మే 19న వెనిగళ్ల పార్థసారథిని వివాహమాడారు. మంచికి మారుపేరుగా నిలిచి, అందరి హృదయాల్లో సుస్థిర నివాసం ఏర్పరచుకున్న వెనిగళ్ల సూర్యకుమారి చిరస్మరణీయులని ప్రముఖులు నివాళులర్పించారు.

అక్కాచెల్లెళ్లను మింగేసిన అతివేగం!

- ముగ్గురు అక్కాచెల్లెళ్లు సహా పసికందు దుర్మరణం
- అదే కుటుంబంలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన ఆటో

కూడేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మూణ్నెల్ల క్రితం కాన్పు కోసం వచ్చిన చెల్లెలు పండంటి బిడ్డను ప్రసవించింది. నామకరణం కూడా పూర్తయింది. బిడ్డతో సహా చెల్లెల్ని తిరిగి ఆమె అత్తవారింటికి సాగనంపడానికి ఆమె ఇద్దరు అక్కలు, వారి పిల్లలు ఆటోలో సంతోషంగా బయలుదేరారు. అయితే మృత్యువు కారు రూపంలో వచ్చి ముగ్గురు అక్కాచెల్లెళ్లు సహా పసికందును బలితీసుకుంది. అనంతపురం జిల్లా కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఈ ఘోరం జరిగింది. మృతుల్లో సరస్వతి (34), నీలావతి(45), యోగేశ్వరమ్మ (40) సొంత అక్కచెల్లెళ్లు. సరస్వతి కుమార్తె మూడు నెలల వయసున్న విద్యశ్రీ కూడా మృతిచెందింది. ఆటో డ్రైవర్ లోకేశ్, మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. కూడేరు పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బసవరాజు, పార్వతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు పుష్పావతి, నీలావతి, యోగేశ్వరమ్మ, సరస్వతి సంతానం. నాలుగో కుమార్తె సరస్వతికి జిల్లాలోని ఉరవకొండ మండలం రాయంపల్లికి చెందిన సతీష్‌కుమార్‌తో వివాహమైంది. ఆమె మూడు నెలల క్రితం కాన్పు నిమిత్తం పుట్టింటికి వచ్చి బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడా పాప(విద్యశ్రీ)కు మూడు నెలలు. ఆదివారం తిరిగి అత్తవారి గ్రామానికి సరస్వతి బయల్దేరింది. ఆమె వెంట నీలావతి, యోగేశ్వరమ్మ, వారి పిల్లలు అచ్యుత్‌కుమార్, జ్ఞానేశ్వరి కూడా రాయంపల్లికి చెందిన లోకేశ్ ఆటోలో బయల్దేరారు. కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపంలోకి రాగానే ఉరవకొండ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో బాలింత సరస్వతి అక్కడికక్కడే మృతిచెందింది. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి విద్యశ్రీ, నీలావతి, యోగేశ్వరమ్మ మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన లోకేశ్, అచ్యుత్‌కుమార్, జ్ఞానేశ్వరి చికిత్స పొందుతున్నారు. కారులో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు ఉండగా, వారిలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజు తెలిపారు.

చదువుల తల్లి.. ఇక లేదు!



శ్రీలేఖ

కర్నూలు హాస్పిటల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో చురుగ్గా ఉండే ఓ విద్యార్థిని అర్థాంతరంగా కన్నుమూసింది. కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం పోలకల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండ్రోజుల క్రితం చెట్టువిరిగి పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన 8వ తరగతి విద్యార్థిని శ్రీలేఖ(14) కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూసింది. పోలకల్ హైస్కూల్లో గత నెల 28న సైన్స్ డే వేడుకల సమయంలో ఆవరణలోని చెట్టు కూలడంతో శ్రీలేఖకు తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం తెల్లవారుజామున కార్డియాక్ అరెస్టుతో మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు.



రాస్తున్న క్రమంలోనే నవల రూపం దాల్చుతుంది



ఓల్గా ఒక ఫెమినిస్ట్ ఆల్కెమీ. ఆమె పేరే సంకెళ్లు తెగుతున్న సంగీతమై మధుర మంజులంగా మనని ఆవహిస్తుంది. ఓల్గా నామవాచకం కాదు, సర్వనామం. ఆమె కోరుకున్న స్వేచ్ఛ ఆమెకు మాత్రమే పరిమితమైంది కాదు, స్త్రీలందరికీ సంబంధించింది. వేల సంవత్సరాలుగా అంగీకృతమైపోయిన స్త్రీల అణచివేతనీ, దోపిడీనీ, బానిసత్వపు పద్ధతులనీ ప్రతిఘటించి ఎదుర్కొనే చైతన్యాన్ని ఇస్తూ, స్త్రీలకు తమ చరిత్రను తాము అర్థం చేసుకునే సదవకాశాన్ని కలిగించిందామె సాహిత్యం. స్త్రీలను బుద్ధిజీవులుగా నిలబెట్టడమే ఆమె సాహిత్యోద్యమం సాధించిన విజయం. ఓల్గా రాసిన తొమ్మిది నవలలూ మనందరి హృదయాల మీద ముద్రించుకుపోయినవే. ఇది 'నవలా శిల్పం' శీర్షికన ఆమెతో చేసి సంభాషణ.

ఇంటర్వ్యూ ■ **వి. ప్రతిమ**

మీరు నాన్‌ఫిక్షన్, ఫిక్షన్ రెండూ విస్తృతంగా రాశారు. వ్యాస ప్రక్రియలో ఒక భావజాలాన్ని, ఒక సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయడం సులువే. కానీ నవలా ప్రక్రియలో మీరు నమ్మిన సిద్ధాంతాన్ని అర్థం చేయించడం, ఆ భావాలని ఒప్పుదలగా పంచడం కష్టం కాలేదా?

నేను ఒక సిద్ధాంతాన్ని, భావజాలాన్ని నవలల్లో రాశానని, లేదా వాటిని చెప్పటం కోసం నవలలు రాశాననీ అందరూ అనుకుంటారు, అంటారు. చివరకు నేనూ నిజమే అనుకునేంతగా ఆ మాట స్థిరపడింది. దీని గురించి విపులంగా ఆలోచిస్తే– సిద్ధాంతం గానీ, భావజాలం గానీ ఎలా పుడతాయి? సిద్ధాంత కర్తలు ఒక సిద్ధాంత నిర్మాణాన్ని ఎలా చేస్తారు. సమాజంలో మానవుల బాధలను, వేదనలను, దుఃఖాన్ని, వాటికి కారణమైన దోపిడిని, అణచివేతను అర్థం చేసుకునే ప్రయత్నం చేసేటపుడు, వారు కనుగొన్న కారణాలను ఒక పద్ధతిలో చెప్పినప్పుడు అది సిద్ధాంతమవుతుంది గదా! అంటే సామాజిక మానవ జీవితం గురించిన లోతైన అవగాహనే సిద్ధాంతం. ఆ జీవితం గురించి ఒక చిన్న పరిధిలో, కొందరు వ్యక్తులను మాత్రమే తీసుకుని, వాస్తవికతతో పాటు కాల్పనికతనూ కొంత జోడించి, సూటిగా, రసవంతంగా రాస్తే అది సాహిత్యమవుతుంది. వాస్తవికత, కాల్పనికతల మేళవింపు ఎంత చిక్కగా, అందంగా రాయగలిగాడనేదే రచయిత వ్యక్తిగత శైలి, శిల్పం అవుతుంది. సిద్ధాంతంపై గట్టి పట్టు ఉండటం వల్ల మానవ జీవితాన్ని అర్థం చేసుకునే వీలు కలిగి రాయాలనుకున్న విషయంపై స్పష్టత వచ్చి, రచయిత శైలి మెరుగుపడుతుంది. అందువల్ల ఎలాంటి వ్యాసాలు రాసినా నవలలు రాయటానికి ఏ ఇబ్బందీ రాదు. వ్యాసాలు రాయటం వల్ల నవలల్లో ఒక సరళత, సూటిదనం వస్తుంది. రెండింటికీ మంచే జరుగుతుంది. కొ.కు., చలం వీళ్ళంతా ఈ మార్గం వేశారు.

> **స్త్రీలు గృహిణి పాత్రలో ఉంటూ, అది అనుమతించిన మేరకే సామాజిక జీవితంలోకి రావాలని చాలామంది అనుకుంటారు. కుటుంబాలు నిలబడవు అంటారు. స్త్రీల జీవితాలను తొక్కేస్తూ కుటుంబాలు నిలబడాలా? కుటుంబం నిలబడటానికి, పడిపోవటానికి స్త్రీలు మాత్రమే కారణమా? ఇలా అనేక విషయాల మీద కథలు, నవలలు రాయటానికి నాకు 'స్వేచ్ఛ' నవల మీద జరిగిన దాడి ఉపయోగపడింది.**

ఒక నవలకు మీ మనసులో మొదటి విత్తు పడటం, రాయటానికి ఉపక్రమించటం... ఈ రెండు దశల మధ్య మీ ఆలోచనా ప్రయాణం ఎలా ఉంటుంది?

నవల కోసం ఇతివృత్తం అనుకున్న తర్వాత చాలా రోజులు రాయకుండా ఉంటాను. దాని గురించి ఆలోచన కూడా సబ్ కాన్షస్ మైండ్‌లో జరుగుతుంది. పనిగట్టుకుని ఆలోచించను. నోట్స్ రాసుకోను. కొన్నాళ్ళ తర్వాత ఆ నవల రాసుకుంటూ వెళ్తాను. రాస్తున్న క్రమంలోనే నవల రూపం దాల్చుతుంది. మొదటి నవలలు, అంటే 'గులాబీలు' (1992) వరకూ, ఫెయిర్ చేసేటపుడు చిన్న చిన్న మార్పులు జరిగేవి. ఆ తర్వాత ఒకే సారి ఫెయిర్ రాయటం మొదలైంది. రాసి కుటుంబరావుకి చదవమని ఇవ్వటం, అతను బాగుందనటం, అంతే– ఆ తర్వాత ఇక దానిని మళ్ళీ చదివే పని పెట్టుకోను. అచ్చయిన తర్వాత కూడా చదవను. ఇక ఆ రచన నాది కాదు. పాఠకులది. దానితో నా రిలేషన్ పూర్తవుతుంది. దానిని గౌరవించుకుంటాను. అదే సమయంలో దానితో కొంత దూరాన్ని పాటిస్తాను. మళ్ళీ మళ్ళీ దానితో జోక్యం చేసుకోను.

మీ మొదటి నవల రాసే క్రమంలో రచనా పరంగా ఎదుర్కొన్న సవాళ్ళూ, ఇబ్బందులు?

మొదటి నవల 'సహజ'. నలుగురు స్నేహితురాళ్ళ కథ. పెళ్ళికి ముందు వారి జీవితాలలో, పెళ్ళయ్యాక వారి జీవితాలలో ఎలాంటి మార్పు వచ్చింది, ఆ మార్పు వల్ల ఊపిరాడని ఇద్దరు స్త్రీలు తమ జీవితాలను మార్చుకోవటానికి ఎలా సాహసించారు. ఆ సాహసానికి వారిని ప్రేరేపించిన స్నేహితురాలి జీవితం ఎందుకు, ఎలా భిన్నంగా ఉంది? – ఈ విషయాన్ని చాలా తక్కువ పేజీలలో రాయాలి. 'చతుర' మాస పత్రికలో ఒక నవలంతా వచ్చేది. దానికి పేజీల పరిమితి ఉండేది. అందువల్ల ఇన్ని విషయాలను సూటిగా, స్పష్టంగా, అర్థవంతంగా, చదివించే గుణం ఉండేలా రాయటం ఒక సవాలే. ఈ పరిమితులున్నాయి, ఈ లక్ష్యం ఉంది అనేది బాగా అర్థం చేసుకున్న తర్వాత అది కష్టం కాలేదు. సులువగానే రాసేశాను. పైగా నా గురువులని చెప్పుకోగలిగిన చలం, కొ.కు.లు రాసినవి కూడా చిన్న నవలలే. చెప్పినవి లోతైన విషయాలు. విపరీతమైన రీడబిలిటీ. వారి బాటలో ప్రయాణం చేశాను.

నవలా శిల్పం

ఓల్గా

మీరు నాలుగు దశాబ్దాల క్రితమే రాసిన 'మానవి' నవలలో అస్తిత్వవాదాల వెలుతురు లోంచి స్త్రీల జీవితాలని– ముఖ్యంగా వైవాహిక, కుటుంబ వ్యవస్థలను– లోతులకు వెళ్లి విశ్లేషించారు. పితృస్వామ్య నియంత్రణల కుట్రని ఏ క్రమంలో అర్థం చేసుకుని, ఏ పరికరాలను ఉపయోగించి 'మానవి' నవల రచనకు మొగ్గారు?

పితృస్వామ్యం కేవలం కుట్ర కాదు. అది ఒక సామాజిక వ్యవస్థ. అది ఎప్పటికప్పుడు రూపం మార్చుకుని స్త్రీలను నియంత్రిస్తుంది. ఒకప్పటి భూస్వామ్య పితృస్వామ్యం, ఇప్పటి పితృస్వామ్యం రెండింటి రూపాలు వేరు. సారాంశం మాత్రం అణచివేతే. పితృస్వామ్యం దానికి అవసరమైన ఆధిపత్య హింసా రూపాలను ఎప్పటికప్పుడు తయారు చేసుకుంటుంది. దీనితో పోరాటం వర్గపోరాటం కంటే కష్టం. శత్రువులు మనవాళ్ళే, ఆయుధాలు చేతిలోంచి సులువుగా జారిపోతాయి. ఐతే స్త్రీలు తమ జీవితాలు తమ చేతుల్లోకి తీసుకోవాలి. తప్పయినా, ఒప్పయినా తమ నిర్ణయాలకు తామే బాధ్యత వహించాలి. ఈ పనులు చేయాలంటే సమాజం విధించిన పాత్రల నుండి (భార్య, తల్లి, కూతురు మొదలైనవి) బైటపడి ముందు మనిషిగా, మానవిగా మారాలి. దాని కోసం స్త్రీలు తమ జీవిత పోరాటాలను చేయాలి అనేది అర్థం చేయించటం కోసం 'మానవి' నవల రాశాను.

మీ నవలల్లో 'స్వేచ్ఛ' తెలుగు నేలపై స్త్రీవాదానికి సంబంధించి అత్యంత మౌలికమైన రచన. ఆ నవల తీవ్ర వివాదాలకు, దాడులకు కారణమైంది. అప్పటి స్థితి నేపథ్యంలో ఆ నవల గురించి కొత్త తరం పాఠకుల కోసం చెప్పగలరా?

'స్వేచ్ఛ' నవల 1987 ఫిబ్రవరిలో విడుదలయింది. మార్చి నుంచీ నా వ్యక్తిగత జీవితం మీద దాడి, నా వ్యక్తిగత జీవితానికి, నా రచనకు ముడిపెట్టి ఇంకోవైపు దాడి మొదలైంది. ఆ నవలలో నేను ప్రతిపాదించిన లేక చర్చకు పెట్టిన గృహిణీత్వానికి, పౌరసత్వానికి మధ్య ఉన్న వైరుధ్యం, దాని పరిష్కారానికి జరిగే ఘర్షణ, ఆ ఘర్షణకు కావలసిన స్వేచ్ఛాకాంక్ష, స్వేచ్ఛ– వీటిని ఒక మామూలు మధ్యతరగతి యువతి జీవితంలో చూపే ప్రయత్నం చేశాను. అలాగే వివాహంలో బందీ కావటం, దాని వల్ల జీవితాశయాలకు దూరమవటం కంటే సహజీవనం మెరుగేమోననే ప్రతిపాదన చేశాను. ఈ రెండూ ఉద్యమకారులకు నచ్చలేదు. స్త్రీలు గృహిణి పాత్రలో ఉంటూ, అది అనుమతించిన మేరకే సామాజిక జీవితంలోకి రావాలని చాలామంది అనుకుంటారు. కుటుంబాలు నిలబడవు అంటారు. స్త్రీల జీవితాలను తొక్కేస్తూ కుటుంబాలు నిలబడాలా? కుటుంబం నిలబడటానికి, పడిపోవటానికి స్త్రీలు మాత్రమే కారణమా? ఇలా అనేక విషయాల మీద కథలు, నవలలు రాయటానికి నాకు 'స్వేచ్ఛ' నవల మీద జరిగిన దాడి ఉపయోగపడింది. వ్యక్తిగతంగా జరిగిన దాడి నేను మరింత బలంగా, మానవీయంగా, క్షమాగుణం పెంచుకునేలా, మొరటువారిని, మూర్ఖులను చూసి నవ్వుకునే శక్తిగల దానిగా తయారు చేసింది.

దళిత సమస్యనీ, స్త్రీల సమస్యనీ ఏకకాలంలో చిత్రించిన నవల 'ఆకాశంలో సగం'. ఆ ఇతివృత్తం మిమ్మల్ని ఎందుకు ఆకర్షించింది? జసింత వంటి యోధ ఐన పాత్ర సృష్టి ఎలా జరిగింది?

'ఆకాశంలో సగం' పూర్తి కల్పితం కాదు. ఒక గ్రామంలో రెండు పార్టీల మధ్య పంచాయితీ ఆఫీసు ఎక్కడ కట్టాలనే చిన్న విషయం మీద పెద్ద తగాదాలు, ఘర్షణలు జరిగాయి. బహుశా అనేక గ్రామాల్లో జరుగుతాయి. వాటిలో స్త్రీల ప్రమేయం ఉండదు. స్త్రీలకు ఆ ఘర్షణలు ఇష్టం లేకపోయినా భర్తల కోసం భరిస్తారు. తమ వారికి దూరమవుతారు. దీనిని ఎవరు ఎదుర్కోగలరు? ఒక దళిత యువతి, చదువుకున్న చైతన్యవంతమైన యువతి మాత్రమే ఎదుర్కోగలదని నాకు అనిపించింది. ఉద్యమాలలో అలాంటి యువతులను నేను చూశాను. కానీ వారికి నాయకత్వ లక్షణాలు ఎంత ఉన్నతంగా ఉన్నా, నాయకత్వంలోకి రానివ్వని పరిస్థితులనూ చూశాను. ఒక దళిత యువతికి ఆ పోరాట పటిమ, వ్యూహ రచన, నలుగురిని కూడగట్టగల చొరవ ఉండటం నాకు తెలుసు. ఆ యువతికి నిజ జీవితంలో దొరకని నాయకత్వాన్ని నా నవలలో నేను ఇచ్చాను. 'జసింత' పాత్ర రూపుదిద్దుకుంది. నిజంగా స్త్రీలు నాయకత్వం వహిస్తే, పురుషులు వారి వెనక నడిస్తే ఉద్యమాలు విజయవంతమవుతాయని నమ్ముతాను. ■

'కవిత 2024'కు ఆహ్వానం

విజయవాడ 'సాహితీమిత్రులు' వెలువరిస్తున్న 'కవిత 2024' కోసం జనవరి 2024 నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురితమైన కవితలను మార్చి 15 లోగా editor.kavitha2024@gmail.comకు పంపాలి. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో పెట్టిన కవితలు అర్హమైనవి కాదు. పత్రికలలో ప్రచురితమైన కవితల ఇమేజ్/ పిడిఎఫ్‌లు మాత్రమే పంపాలి.

విశ్వేశ్వరరావు

కవిసంధ్య కవితల పోటీ ఫలితాలు

కవి సంధ్య, యానాం – చిన్ని నారాయణ రావు ఫౌండేషన్, నెల్లూరు సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు వరుసగా– జడా సుబ్బారావు (నూజివీడు), పర్కపల్లి యాదగిరి (సిద్దిపేట), ఐలేని గిరి (దుబ్బాక) ఎంపికయ్యారు. ప్రోత్సాహక బహుమతులకు ఎంపికైనవారు: వినోద్ గుత్తుల, మోకా రత్నరాజు, జె.డి. వరలక్ష్మి, కళా గోపాల్, బి. వేణు గోపాలరెడ్డి, పొనుగు మట్ల అశోక్ కుమార్, బి.వి. శివప్రసాద్, పిన్నంశెట్టి కిషన్, తుమ్మల దేవ్ రావ్, ఉదారి నారాయణ. మార్చి 23న బహుమతి ప్రదానం ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు

ఉమ్మడిశెట్టి అవార్డులు

ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, అనంతపురం ప్రకటించిన ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు – 2024 కోసం 'రెండు ప్రపంచాల మధ్య' కవితా సంపుటికి గాను కవయిత్రి వైష్ణవిశ్రీ ఎంపికయ్యారు. ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారం – 2025 కోసం కవి నంద కిషోర్ ఎంపికయ్యారు. త్వరలో అవార్డు ప్రదానం జరుగుతుంది.

రాధేయ

సోమవారం 3 మార్చి 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



జ్ఞాపకాలై పరిమళించే బంధాల కోసం...



గరికపాటి మణిందర్ రాసిన ఈ కవిత వస్తు రూపాల మధ్య మంచి సమన్వయాన్ని సాధించింది. కవిత మొత్తం అంతర్లీనంగా ఒక సౌందర్యం పాఠకుడి హృదయాన్ని తన లోపల సంలీనం చేసుకుంటుంది. కవితలోని 'వాక్యా'లని మనుషులకు ప్రతీకలుగా తీసుకుంటే కవి దేన్ని ఉద్దేశించాడో అర్థం అవుతుంది. స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు ఎంత మంది ఉంటే మాత్రమేమి? వాళ్ళెంత పారదర్శకంగా, ఎంత ఇన్‌స్టంట్ కాఫీ పరిమళంలా వున్నా సరే, హృదయానికి దగ్గరగా వచ్చేవారు చాలా తక్కువమందే. వాళ్లు కొత్తగా కుట్టించుకున్న బట్టలకు రాసిన అత్తరు పసుపు మరకలా మనసుకు అలా కలకాలం పట్టి నిలిచిపోతారు. ఇక్కడ పసుపుకు అత్తరును అద్దటంలో ఉంది కవి చమత్కారం. మామూలుగా కొత్త బట్టలకు పసుపు రాయటం సహజం. కేవలం పసుపు మాత్రమే రాస్తే అది రాలిపోతుంది. అత్తరు అద్దటం వలన అత్తరు లోని తడిలో పసుపు సంగమించి చివరకు మరకగా మిగులుతుంది. ఆ సహజమైన పసుపుకు అత్తరు అద్ది మరకను సైతం పరిమళభరితం చేస్తున్నాడు. మనుషులు ఒకరితో ఒకరు భౌతికంగా కలిసి ఉండటం మాత్రమే కలసి ఉండటం కాదు. భౌతికమైన మనుషులను మానసికమైన బంధం ఏదో ముడి వేయాలి. ఆ బంధం అత్తరులా పరిమళాలు వెదజల్లాలి. అప్పుడు మనుషులు లేకున్నా బంధాలు జ్ఞాపకాలై పరిమళిస్తాయి.

■ **వంశీకృష్ణ, 95734 27422**

ప్రియ పద్యం

కొన్ని వాక్యాలు



వాక్యాలు కలగాపులగం
ఏ వాక్యం రంగు ఏమిటో
ఏ సాంధ్య వర్ణాన్నడగాలి

కొన్ని
రాళ్ళు పరచుకున్న సరస్సు లోని నీలంరంగంత
పారదర్శకంగా ఉంటాయి.

ఇంకొన్ని
హేమంతంలోని
కారు అద్దాలపై కురిసిన
తుషారంలా స్పష్టాస్పష్టంగా దోబూచులాడతాయి

మరికొన్ని
సీతాకోక రెక్కల్లాటి పెదాలు మధ్య
అమాయకత్వాన్ని ఒలకబోసే
లాలిపప్‌లా రసానందం తొణికిసలాడిస్తాయి.

వాక్యాలంతే
అలసిన సాయంత్రాలకు
దోరగా వేయించి చేసిన
ఇన్‌స్టంట్ కాఫీ పరిమళాలను ఇస్తాయి.

దినం కొలిమిలో కాలిన చేతులకు
మునిమాపుల
పూలమృదుత్వంతో సుకుమారంగా
అనురాగపు మైలేపనాలవుతాయి.

వాక్యాలు
కుప్పనూర్పిడిలో తూర్పారబట్టే
పొట్టు పొల్లులా గాలివాటంలో
తేలిపోతుంటాయి

చాలా తక్కువ వాక్యాలు మాత్రమే
కొత్తగా కుట్టించుకున్న బట్టలకు
రాసిన అత్తరు పసుపు మరకలా
మనసుకు
అలా కలకాలం పట్టి నిలిచిపోతాయి

■ **గరికపాటి మణిందర్**

✆ 99483 26270

కేశవరెడ్డీ నేనూ మంచి స్నేహితులం అవుతాం అనిపిస్తుంది

చదువు ముచ్చట

మొహమ్మద్ గౌస్



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?

వివేక్ లంకమల రాసిన 'వలపటెద్దు' కథా సంపుటి బాగా నచ్చింది. మనిషి చుట్టూ ప్రకృతి అని కాకుండా ప్రకృతిలో, ప్రకృతితో కలిసి మనిషి అనే సందేశం ఈ కథల ద్వారా దొరుకుతోంది. మానవ జీవితంలో పశు పక్ష్యాదుల భాగాన్ని చాలా లోతుగా తెలుసుకొని రాసిన కథలు. రాయలసీమ గ్రామీణ జీవితం కూడా డాక్యుమెంట్ అయింది.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదివారు?

ఇంటర్మీడియేట్లో ఉన్నప్పుడు స్నేహితుల ద్వారా కొన్ని పుస్తకాల పీడీఎఫ్‌లు దొరికాయి. అప్పటిదాకా పుస్తకాలు అలా పీడీఎఫ్‌లుగా ఉంటాయని కూడా తెలీదు. అలా దొరికిన వాటిలో 'ఒక గుండె సవ్వడి' (ముచ్చర్ల రజనీ శకుంతల), 'ఎంతో మధురమీ స్నేహం' లాంటి నవలలు చదివినట్టు గుర్తు. ఇప్పుడు ఆ కథలేవీ గుర్తులేవు.

ఒకప్పటికీ ఇప్పటికీ చదివే పద్ధతి ఎలా మారింది?

ఒకప్పుడు ఒక రచయితని ఎంచుకుని ఆ రచయిత పుస్తకాలన్నీ వరుసగా చదివేవాడిని. ఇప్పుడు ఎక్కువగా సమకాలీన రచయితలు ఏం రాస్తున్నారో తెలుసుకోవడానికి వస్తున్న పుస్తకాలన్నీ చదువుతున్నాను. ఇప్పుడు ఎక్కువగా యాసలో (అన్ని యాసలు) రాసిన పుస్తకాలు చదువుతున్నాను.

కలిసి మాట్లాడాలనిపించే గత కాలం రచయిత?

ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా డా. కేశవరెడ్డి అని చెప్తాను. ఆయన 'స్మశానం దున్నేరు', 'సిటీ బ్యూటిఫుల్' నవలల గురించి, నిజానికి ఆయన అన్ని పుస్తకాల గురించి ఆయనతో మాట్లాడాలి. నేను బీ.టెక్‌లో ఉన్నప్పుడు 'చివరి గుడిసె' నవల చదివి ఆయన గురించి వెతికితే లేరని తెలిసింది. కేశవరెడ్డి పుస్తకాల గురించి, ఆయన సృష్టించిన పాత్రల గురించి ఆయనతో మాట్లాడితే మేం మంచి స్నేహితులం అవుతాం అనిపిస్తుంది.

రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా, మీరు ఎప్పుడూ పాటించే నియమం?

ఎవరు చెప్పారో, ఎప్పుడు చెప్పారో గుర్తులేదు: నేను మాత్రమే రాయగలిగిన కథలు మాత్రమే నేను రాయాలి. నేను పాటించే నియమం – కథ వెంట పరిగెత్తకుండా కథ పక్కన కూర్చొని మాట్లాడుతూ రాయాలి. ఎదురుచూడాలి. కథ ఒప్పుకున్నాకే రాయాలి. కొలతలు, లెక్కలు లేకుండా రాయాలి.

మీకు తరచుగా గుర్తొచ్చే వాక్యం/ కవితా పంక్తి?

కాఫ్కా 'మెటమార్ఫసిస్' నుండి "గ్రెగర్ జమ్జా ఒక ఉదయం కలత పెట్టే కలల నుంచి మేల్కొని చూసేసరికి తాను ఒక పెద్ద కీటకంగా మారిపోయి ఉన్నాడు" అన్న వాక్యం. ఆ మొదటి వాక్యంతోనే పాఠకుడిని "ఇప్పుడీ కథ చదవకుండా ఎలా ఉంటావో చూస్తా" అని చెప్తున్నట్టు అనిపిస్తుంది. ఆల్బర్ట్ కాము 'ది స్ట్రేంజర్' నవల నుండి "Mother died today. Or maybe yesterday, I don't know" కూడా అలాంటి వాక్యమే.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర?



కేశవరెడ్డి 'సిటీ బ్యూటిఫుల్' పుస్తకంలోని దేవీదాస్ పాత్ర. వంద శాతం అని చెప్పలేను కానీ, లాక్‌డౌన్‌లో ఆ పుస్తకం చదివేటప్పుడు చాలా విషయాల్లో ఆ పాత్రతో ఏకీభవించాను. ఆ పాత్ర తన భావాలను వ్యక్తపరిచే విధానం చాలా నవ్వు తెప్పిస్తూ, కోపాన్ని అర్థం చేయిస్తూ ఉంటుంది. ఆ ఫ్రస్ట్రేషన్ వ్యక్తపరిచే విధానం కూడా కారణం అయ్యుండొచ్చు.

(మొహమ్మద్ గౌస్ కథ, నవలా రచయిత. ఇప్పటివరకు 'గాజులసంచి' కథా సంపుటి; 'జీరో నెంబర్ 1', '826 కి.మీ' నవలలు పుస్తకాలుగా వచ్చాయి.)

ఎండమావుల్లో జమ్మిచెట్టు

నది ఎండాకాలపు వడగాల్పుల్లో
ఒకానొక మిట్ట మధ్యాహ్నం
ఎదురుగా ఎండ బోయిన మిరప చేను
అక్కడక్కడా తెల్లని బొమికల్లా
గాలికి ఊగుతున్న తాలుగాయలు
ఎండి తలలు వాల్చేసిన దిష్టిబంతి చెట్లు
పగిలిన పత్తి గుల్లలోంచి కారుతున్న
మిగిలిపోయిన తెల్లని పత్తి
తలకొట్టేసినాక ఎదగలేక
ఎండిపోయిన పొగలొట్టలు

ఆకులు రాలిన చెట్టు కింద
బొబ్బలెక్కిన కాళ్ళకు
పూయాల్సిన లేపనం గురించి ఎదురుచూపు
పేగులకంటుకుపోయిన పొట్ట
ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఎగిరిపడుతుంది

గుల్లబారిన మట్టిపెళ్ళపై
రాలిన కన్నీటి చినుకు

సంచుల్లో మూటగట్టిన విత్తనాలు
ఎప్పటికీ మొక్కలవ్వవు
ఋతువుల పరదాలను ఎంత తొలగించినా
చిక్కని చీకటి తప్ప
చెమ్మ చేతికి తగలదు

కాటాలకెక్కిన పంట బరువు
ఎప్పుడూ రెండోవైపుకే వంగిపోతుంది
బేరన్లలో బంగారు వర్ణానికి తిరిగిన పొగాకు
బ్రోకర్ చేతుల్లో నలుపుకు తిరిగి చూర్ణమైపోతుంది.
విరిగిన వెన్నెముక ఎప్పటికీ అతకదు
స్వేద భూముల్లో మొలకెత్తే మొక్కలు
కాలిపోయి కవురుకంపు వెదజల్లుతాయి

ఎక్కడో దూరంగా ఓ జమ్మి చెట్టు
చుట్టూ ఎండమావులు
ఆశల వడగాల్పుల్లో గొంతు తడవదు
ఉండీ ఉండీ ఉత్తీత పిట్ట అరుపు
ఎలపట దాపట ఎద్దులు రెండు
జీవితాన్ని చెరోవైపూ లాక్కెళ్లిపోయాయి
వెనక
ముందు
చుట్టూ
ఎటు చూసినా
శూన్యమే శూన్యం
పూరించలేని శూన్యం

■ **బండ్ల మాధవరావు**

పండుగ తర్వాత

పట్నం వచ్చి పండుగ చేసుకుని వెళ్లింది
పల్లె నిండా జంబో గ్లాసులు ప్లాస్టిక్ బాటిల్స్

కార్లు తిరిగి క్యాకట్టి వెళ్లినాయి
మూడు రోజుల వస్త్ర కనక ప్రదర్శన ముగింపు

నోట్ల కట్టలు గొప్ప గొప్ప మాటలు చెప్పాయి
బాగుపడాలంటే దగా బుర్ర పెట్టాలి అని
అందరూ సలహాలు మాత్రమే వదలి వెళ్లారు

అవసరం టోల్‌గేట్ దాటినాక సెల్ సైలెన్స్
మొహమాటానికి చేరిన నెంబర్‌లు డిలీట్
ఏ వరస ఇక అందుబాటులో వుండబోదు

మళ్ళీ పండుగ వరకు పల్లె వూసు రాదు
మూటల వేటలో మనుషులు మూస బతుకు
పచ్చని స్టేటస్లు పల్లీ కొట్టి మళ్లీ కాంక్రీట్ జంగిల్‌లో...

■ **దాసరి మోహన్**


✆ 99853 09080




కవితా సంకలనాలకు ఆహ్వానం

జాతీయ సాహిత్య పరిషత్, కరీంనగర్ ఆధ్వర్యంలో రజనిశ్రీ సాహిత్య పురస్కారానికి జనవరి 2022 నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో ముద్రితమైన పద్య, గేయ, వచన కవితల సంకలనాలు మాత్రమే నాలుగు ప్రతులను మార్చి 20లోగా పంపాలి. ప్రశంసా పత్రం, శాలువాతో పాటు రూ.10,116/– నగదు బహుమతి ఉంటుంది. చిరునామా: గాజుల రవీందర్, ఇం.నెం.: 8-3-255/1, రామచంద్రాపూర్ కాలనీ, రోడ్ నంబర్ 12, భగత్ నగర్, కరీంనగర్ – 505001. ఫోన్: 9848255525.

జి.వి. శ్యాంప్రసాద్ లాల్



ముగ్గురూ.. ముగ్గురే!



బుద్దా వెంకన్న
దేవినేని ఉమామహేశ్వరరావు
వంగవీటి రాధాకృష్ణ

ఎమ్మెల్సీ పదవికి ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి ప్రధానంగా పోటీ

బుద్దా వెంకన్న, దేవినేని ఉమా, వంగవీటి రాధాకృష్ణల్లో ఎవరికి చాన్స్?

త్వరలో ఎన్నిక జరగనున్న ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ పడుతున్న ఉమ్మడి జిల్లాలోని ఆశావహుల్లో హైటెన్షన్ నెలకొంది. ఎన్టీఆర్ జిల్లా నుంచే ప్రధాన పోటీ ఉంది. ఈ జిల్లా నుంచి ముగ్గురు నేతలు రేసులో ఉన్నారు. వీరిలో బుద్దా వెంకన్న, దేవినేని ఉమామహేశ్వరరావు, వంగవీటి రాధాకృష్ణ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఖచ్చితంగా ఎవరో ఒకరికి పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్సీ స్థానం కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. సామాజిక వర్గాల సమీకరణ ఒక్కటే కాకుండా.. క్లిష్టకాలంలో దాడులను ఎదుర్కొనటంతో పాటు పార్టీని బలోపేతం చేయటం, వివిధ వర్గాలను పార్టీ వైపు తీసుకువచ్చేలా చేయటంలో ఈ ముగ్గురి పాత్ర ప్రధానంగా ఉంది. ఈ ముగ్గురిలో అధిష్ఠానం ఆశీస్సులు ఎవరికి దక్కబోతున్నాయన్నది వేచి చూడాల్సిందే.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): త్వరలో ఎన్నిక జరగనున్న ఎమ్మెల్సీ పదవిని బుద్దా వెంకన్న గట్టిగా ఆశిస్తున్నారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో బుద్దా వెంకన్న విజయవాడలో సాగించిన పోరాటాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే బుద్దా వెంకన్నకు చంద్రబాబు ఎంతో గుర్తింపునిచ్చారు. విజయవాడ నగరంతో పాటు పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో పెట్టుకుని కనకదుర్గ గుడి దగ్గర ఫ్లై ఓవర్ ఏర్పాటు కోసం బుద్దా వెంకన్న చేసిన పోరాటం ఆ రోజుల్లో ఏడు నియోజకవర్గాల ప్రజలను పార్టీకి దగ్గరయ్యేలా చేసింది. బుద్దా వెంకన్న కృషికి నాడు చంద్రబాబు మెచ్చి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. నారా లోకేశ్‌ను మంత్రివర్గంలోకి తీసుకురావాలని మొట్టమొదటిసారిగా డిమాండ్ చేసింది కూడా బుద్దా వెంకన్నే కావటం గమనార్హం. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలపై గళమెత్తారు. వెంకన్నపై వైసీపీ ప్రభుత్వ హయాంలో 37 కేసులు కూడా పెట్టారు. అప్పట్లో బరి తెగించి మాట్లాడే విజయసాయిరెడ్డి,

ఆశావహుల్లో ఎన్టీఆర్ జిల్లా వారే ఎక్కువ

ఎమ్మెల్సీపై ఎడతెగని ఉత్కంఠ

కొడాలి నాని, వల్లభనేని వంశీమోహన్‌లకు గట్టి కౌంటర్లు ఇస్తూ పార్టీని దీటుగా ఉనికిలో ఉంచారు. టీడీపీ ఆఫీసులపై దాడులకు తెగబడిన సందర్భంలోనే చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దాడికి ప్రయత్నం చేస్తే బుద్దా వెంకన్న ధైర్యంగా జోగిని ఎదుర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను ప్రశ్నించినందుకు బుద్దా వెంకన్న, బొండా ఉమాలపై వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటన నుంచి బుద్దా వెంకన్న తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో బలమైన బీసీ నేతలకు ఎలాంటి పదవి కూడా దక్కలేదు. ఎంపీ, ఎమ్మెల్యేల్లో బీసీ వర్గానికి ప్రాతినిధ్యం లేదు. దీంతో ఆ వర్గానికి చెందిన బుద్దా వెంకన్న ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు.

అంకితభావం కలిగిన నేత దేవినేని ఉమా

టీడీపీ మరో ముఖ్యమైన నేత, ఉమ్మడి కృష్ణాజిల్లా పూర్వ అధ్యక్షుడు అయిన దేవినేని ఉమామహేశ్వరరావు కూడా ఎమ్మెల్సీ ఆశావహుల్లో ఉన్నారు. దేవినేని గురించి పరిచయం అక్కరలేదు. రాష్ట్రంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో దేవినేని జరిపిన పోరాటాలు తెలియందికాదు. సాగునీటి సమస్యలు, ప్రభుత్వాల అక్రమాలపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అలుపెరగని పోరాటాలు చేశారు. ఎన్నో రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించారు. దీనికి గుర్తింపుగా రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ అధికారంలోకి రాగానే దేవినేని ఉమామహేశ్వరరావుకు జలవనరుల శాఖ మంత్రిగా చంద్రబాబు పదవి ఇచ్చారు. మంత్రి పదవిలో ఉండగా ఆయన నాయకులు, కార్యకర్తలకు కాస్త దూరం అయ్యారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంలో మిగతా 6లో..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి రాజధాని ప్రాంతంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం గుంటూరులోని ఏసీ కాలేజీలో ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. కూటమి బలంపై ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రజా సంఘాలు, ఉద్యోగులపై కేఎస్ లక్ష్మణరావు నమ్మకం పెట్టుకున్నారు. పోలింగ్ రోజున కూడా ఎవ్వరికీ ఏకపక్ష వాతావరణం కనిపించకపోవటంతో పోరు హోరాహోరీగా ఉంటుందని భావిస్తున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తి కావటానికి రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. రెండు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 2.40 లక్షల ఓట్లు పోల్ కావటంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు బ్యాలెట్ బాక్సుల నుంచి బ్యాలెట్లను తీసి వాటిని ట్రేలలో పెట్టుకోవటానికే సమయం సరిపోతుందని భావిస్తున్నారు. తొలి ప్రాధాన్యతలోనే ఫలితం తేలే అవకాశం ఉంటే కనుక మంగళవారం సాయంత్రం నాటికి విజేత ఎవరన్నది తేలనుంది. అదే రెండో ప్రాధాన్యత కూడా లెక్కించాల్సి వస్తే మాత్రం బుధవారం సాయంత్రం కానీ ఫలితం వెల్లడయ్యే అవకాశం ఉండదు. పోలైన ఓట్లలో సగానికి పైగా ఏ అభ్యర్థికి ఓట్లు వస్తాయో ఆ అభ్యర్థి విజేతగా నిలుస్తారు. తొలి ప్రాధాన్యత లెక్కింపులో ఖచ్చితంగా 50 శాతం ఓట్లు వచ్చి ఉండాలి. యాభై శాతం ఓట్లు రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. రెండో ప్రాధాన్యతకు వెళ్లే ముందు చివరిస్థానంలో ఎవరైతే ఉంటారో వారిని ఎలిమినేట్ చేస్తారు. ఇలా ప్రతి ప్రాధాన్యతకు వెళ్లినప్పుడల్లా చివరి స్థానంలో ఉన్న వారిని ఎలిమినేట్ చేస్తారు. చివరికి ఇద్దరు అభ్యర్థులకు 50 శాతం రాకపోతే .. ఎలిమినేట్ చేసిన అభ్యర్థులలో ఎవరికి ప్రాధాన్యతా క్రమంలో ఓట్లు వచ్చాయో లెక్కపెట్టి వాటిని ఆయా అభ్యర్థులకు కలిపి అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- గుంటూరు ఏసీ కాలేజీలో ఉదయం 8 గంటలకు ప్రారంభం
- ఫలితం రావటానికి రెండు, మూడు రోజులు పట్టే అవకాశం



ల్యాంకో లైసెన్స్ ఓ మిస్టరీ!

వివాదాస్పదంగా వెస్ట్ బైపాస్‌లో ల్యాంకో పవర్ లైన్ షిఫ్టింగ్ వ్యవహారం

ల్యాంకో లైసెన్స్‌పై స్పష్టత ఇవ్వని రాష్ట్రంలోని శాఖలు

తాజాగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సెక్రటరీని వివరణ కోరిన ధర్మాసనం

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో అంతర్భాగంగా ఉన్న ల్యాంకో ట్రాన్స్ మిషన్ హైటెన్షన్ పవర్ లైన్స్ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. ల్యాంకో లైన్స్‌కు పార్లమెంట్‌లో చేసిన 164 చట్టం ప్రకారం లైసెన్స్ ఉన్నదీ, లేనిదీ ఏ శాఖ కూడా నిర్ధారించటం లేదు. దీంతో లైసెన్స్ ఉన్నట్టుగా భావించి లైన్‌లాస్ చార్జీలు రూ.14 కోట్ల మేర చెల్లింపులు చేయటం మరింత వివాదాస్పదంగా మారుతోంది. తాజాగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సెక్రటరీని ల్యాంకో లైసెన్స్‌పై ధర్మాసనం వివరణ కోరడం చర్చనీయాంశమైంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డులో ల్యాంకో పవర్ లైన్ షిఫ్టింగ్ వ్యవహారం ఆది నుంచి అనేక వివాదాలకు కారణమవుతోంది. ల్యాంకో పవర్ ప్లాంట్ కొనసాగుతున్న దశలో అప్పటి యాజమాన్యం ఇచ్చిన లేఖ, డిజైన్ ప్రకారం జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) షిఫ్టింగ్ పనులకు రూ.36 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచింది. అప్పట్లో ల్యాంకోకు ఇచ్చిన అలైన్‌మెంట్‌పై విద్యుత్ శాఖ అధికారుల సంతకాలు ఏవీ లేకపోవటం పలు అనుమానాలకు తావిచ్చింది. జాతీయ రహదారుల సంస్థ రంగంలోకి దిగటానికి కొంత సమయం పట్టింది. ఈ లోపు ల్యాంకో పవర్ ప్లాంట్ మూసివేతకు గురైంది.

మూడు భాగాల అమ్మకాలు

ల్యాంకో దివాళా తీయటంతో నేషనల్ కమిషన్ ఆఫ్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఒక లిక్విడేటర్‌ను నియమించింది. ల్యాంకో ఎవరికైతే అప్పులు ఉందో ఆ బకాయిలను తీర్చటానికి ఎన్‌సీఎల్‌టీ నియమించిన లిక్విడేటర్ ఆ ఆస్తులను అమ్మే బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. తనకు అప్పగించిన బాధ్యతల ప్రకారం ల్యాంకో పవర్ ప్లాంట్‌ను మూడు భాగాలుగా ఆక్షన్‌కు పెట్టడం జరిగింది. ఇందులో ఒక భాగాన్ని రాధా సంస్థ, రెండో భాగాన్ని రిలయన్స్ సంస్థ, మూడో మిగతా 6లో..

చంద్రయాన్-3 అద్భుత విజయం



- చంద్రయాన్ 4కు సోపానం
- 'ఆంధ్రజ్యోతి'తో మిషన్ డైరెక్టర్ మోటమర్రి శ్రీకాంత్

6లో

బంగినపల్లి టన్ను రూ. 1,25,000

రెడ్డిగూడెంలో మామిడి అమ్మకాలు ప్రారంభం

తోతాపురి రూ.50 వేల నుంచి 70 వేల వరకు..

- రసాలు రూ.30 వేల నుంచి 40 వేల వరకు విక్రయం
- వేలంపాటలకు హాజరైన యూపీ, మహారాష్ట్ర, గుజరాత్ సేట్లు



ఆంజనేయులు మామిడి మార్కెట్‌లో పాట పెడుతున్న బంగినపల్లి మామిడి

(ఆంధ్రజ్యోతి,రెడ్డిగూడెం): ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో మామిడి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. టన్ను బంగినపల్లి ధర రూ.70 వేల నుంచి 1,25,000 వరకు పలికింది. తోతాపురి రూ.50 వేల నుంచి 70 వేల వరకు, రసాలు రూ.30 వేల నుంచి 40 వేల వరకు కొనుగోలు చేశారు. మెట్టగూడెం సెంటర్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన వీరాంజనేయ మ్యాంగో మార్కెట్, దేవరకొండ ఆంజనేయులు మార్కెట్‌లో బంగినపల్లి మామిడి రకం అమ్మకాలను ప్రారంభించారు. యూపీ, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి వచ్చిన సేట్లు వేలం పాట ద్వారా మామిడి కాయలను కొనుగోలు చేశారని ఆంజనేయులు తెలిపారు. గతేడాది రెడ్డిగూడెం నుంచి 15 లారీల వరకు ఎగుమతి అయితే ఈ ఏడాది కాయలు లేని కారణంగా మూడు లారీలు కూడా ఎగుమతి అవ్వడం లేదని రైతులు చెబుతున్నారు.

అతిపెద్దగా..

అమరావతికి మణిహారంగా ఓఆర్ఆర్ నిర్మాణం

ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్ చుట్టూ దేశంలోనే అతిపెద్ద అవుటర్ రింగురోడ్డును నిర్మించిన చంద్రబాబు.. విభజిత రాష్ట్ర రాజధాని అమరావతి చుట్టూ అంతకన్నా పెద్ద అవుటర్ రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 190 కిమీ పొడవు, 70 మీటర్ల వెడల్పుతో 6 వరసలుగా అమరావతికి మణిహారంగా నిర్మించనున్నారు. ఏడు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఏడాదిలోపు పనులు ప్రారంభించటానికి చర్యలు తీసుకుం టున్నారు.



అమరావతి అవుటర్‌రింగ్ రోడ్డు

190 కిమీ పొడవు.. 70 మీటర్ల వెడల్పు.. 6 వరసలు

- ఏడు నెలల్లో టెండర్లు.. ఏడాదిలోగా పనులు ప్రారంభం
- మొత్తం ఖర్చు కేంద్రమే భరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి): అవుటర్ రింగు రోడ్డు ఏర్పాటుతో ప్రపంచం, దేశంలో చాలా నగరాలు స్వల్ప వ్యవధిలోనే ఎంతగానో అభివృద్ధి చెందాయి. ఈ పరిస్థితుల్లో రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులతోపాటు ఏకకాలంలో అవుటర్‌రింగు రోడ్డును భారీస్థాయిలో నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్ చుట్టూ దేశంలోనే అతిపెద్ద అవుటర్‌రింగురోడ్డును నిర్మించిన చంద్రబాబు.. విభజిత రాష్ట్ర రాజధాని అమరావతి చుట్టూ అంతకన్నా పెద్ద అవుటర్ రింగు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పైగా రాష్ట్ర ప్రభుత్వానికి నయాపైసా ఖర్చు లేకుండా మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించేలా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. సుమారు 190 కిలోమీటర్ల నిడివిలో ఏర్పాటయ్యే ఈ ఓఆర్ఆర్ 70 మీటర్ల వెడల్పుతో ఆరు వరసలతో దేశంలోనే అతిపెద్ద ఓఆర్ఆర్‌గా నిలవబోతుంది. అమరావతికి మణిహారంగా నిలిచే ఓఆర్ఆర్ ప్రాజెక్టును ఏడాదిలోగా పట్టాలెక్కించి ఆపై మూడేళ్లలోగా పూర్తి చేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంగా ఉంది. భూసేకరణ ప్రక్రియను సత్వరమే ప్రారంభించి వచ్చే ఏడు మాసాలలోగా టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తుంది. ఆపై నాలుగైదు మాసాల్లోగా నిర్మాణపనులను మొదలెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓఆర్ఆర్ నిర్మాణానికి సుమారు 4,205 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా అంచనా వేస్తుండగా, అందులో సుమారు 306 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. దీంతో 3,899 ఎకరాలను సేకరిస్తే సరిపోతుందని భావిస్తున్నారు.

మూడు దశలు.. 11 ప్యాకేజీలుగా..

ఓఆర్ఆర్‌ను 11 ప్యాకేజీలుగా విభజించి మూడు దశలుగా నిర్మించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల నుంచి గుంటూరు జిల్లా పొత్తూరు వరకు 63 కిలోమీటర్ల పొడవునా మొదటి దశలో పనులను చేపట్టబోతున్నారు. ఇందులో కృష్ణానదిపై పల్నాడు జిల్లా బలుసుపాడు- కృష్ణాజిల్లా మున్నలూరు మధ్య ఓఆర్ఆర్‌కు పశ్చిమ దిశగా 3.15 కి.మీల పొడవున కొత్త వంతెనను నిర్మిస్తారు. రెండో దశలో గుంటూరు జిల్లా పొత్తూరు నుంచి కృష్ణాజిల్లా పొట్టిపాడు వరకు మరో 65 కిలోమీటర్ల నిడివిలో నిర్మాణ పనులను చేపడతారు. ఈ దశలో కృష్ణానదిపై ఓఆర్ఆర్‌కు తూర్పు దిశలో గుంటూరు జిల్లా మున్నంగి- కృష్ణాజిల్లా వల్లూరుపాలెం మధ్య 4.8 కిలోమీటర్ల పొడవునా వంతెనను నిర్మిస్తారు. మూడో దశలో పొట్టిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వరకు 62 కిలోమీటర్ల పనులను చేపట్టి ఓఆర్ఆర్‌ను పూర్తి చేస్తారు. మూడోదశలోనే జికొండూరు సమీపంలో 4.4 కిలోమీటర్ల పొడవున టన్నెల్ నిర్మాణం జరగనున్నది.

కృష్ణాడెల్టాకు మహర్దశ

అమరావతి ఓఆర్ఆర్‌తోపాటు మరో రెండు లింకురోడ్లను అనుసంధానంగా నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తున్న విజయవాడ పశ్చిమ బైపాస్‌ను తూర్పు దిశగా సుమారు 17 కిలోమీటర్లు పొడిగిస్తూ ఆరులేన్ల రహదారిని నందివెలుగు వరకు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ మిగతా 6లో..

నేటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 166 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 58,851 మంది విద్యార్థులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షలకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలోని 166 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 58,858 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 37,979 మంది, కృష్ణాజిల్లాలో 20,879 మంది విద్యార్థులు ఉన్నారు. అత్యధికంగా పెనమలూరు జోన్‌లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గంపలగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సమస్యాత్మకంగా గుర్తించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను సిద్ధంచేశారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

6లో



సమస్యలపై సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు

- 8 నుంచి 17వ తేదీ వరకు యాత్రలు
- 22 నుంచి మహాజర్లు, ధర్నాలు

6లో

● ఉపవాస దీక్ష



రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. లబ్బీపేటలోని మదీన మసీదులో ముస్లింలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం ఉపవాస దీక్షను విరమించి రోజా స్వీకరించారు.

గ్రీన్‌చానల్‌లో గుండె తరలింపు

- కాకినాడ యువకుడికి విజయవాడ వాసి గుండె
- తిరుపతి శ్రీపద్మావతి హృదయాలయలో ఆపరేషన్

6లో



ఇఫ్తార్ (సాయంత్రం): 6-14 (సోమ)
సహర్ (ఉదయం): 5-12 (మంగళ)

మహిళ మెడలో గొలుసు చోరీ 6

త్వరలో రవితేజతో సినిమా తీస్తాం

- సినీ రచయిత ప్రసన్నకుమార్

6లో

మరో శిశువును సంరక్షించిన పోలీసులు

చంద్రయాన్-3 అద్భుత విజయం

ఇంటర్వ్యూ..

» చంద్రయాన్ 4కు సోపానం

» 'ఆంధ్రజ్యోతి'తో మిషన్ డైరెక్టర్ మోటమర్రి శ్రీకాంత్

(మచిలీపట్నం టౌన్-ఆంధ్రజ్యోతి)



చంద్రయాన్ 3 ఇస్రో చేసిన ఒక అద్భుతమని మిషన్ డైరెక్టర్ మోటమర్రి శ్రీకాంత్ పేర్కొన్నారు. మచిలీపట్నంలో తాను చదువుకున్న నిర్మలా స్కూల్‌లో రెండు రోజులు గడిపేందుకు వచ్చిన ఆయనను 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా పలు ఆసక్తికర విషయాలు చెప్పారు. ఆయన సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌లో 3 నుంచి 6వ తరగతి వరకు చదివారు. 7 నుంచి 10వ తరగతి వరకు నిర్మలా హైస్కూల్‌లో, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం మచిలీపట్నం హిందూ కళాశాలలో చదివారు. విశాఖపట్నంలో డిగ్రీ పూర్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్ పూర్తిచేశారు. ఇండోర్‌లో అహల్య యూనివర్శిటీలో ఎంటెక్ చేశారు. 2003లో ఇస్రోలో సైంటిస్టుగా చేరారు. అలా అంచెలంచెలుగా ఎదుగుతూ చంద్రయాన్-3 కోసం నాలుగేళ్లు పనిచేశారు.



? చంద్రయాన్ 3లో మీరు విజయం ఎలా సాధించగలిగారు.

● చంద్రయాన్-2లో వైఫల్యాలు చంద్రయాన్-3లో విజయానికి సోపానాలయ్యాయి. చంద్రయాన్-2, 3లలో పదేళ్లకుపైగా వివిధ అంశాలపై మా టీమ్ శ్రమించింది. శ్రమకు తగ్గ ఫలితం లభించింది.

? చంద్రయాన్-3 ప్రయోగంలో మీ అనుభవాలు.

● సభ్యులందరం కలిసి టీమ్ వర్కుగా పనిచేశాం. కొన్ని సంవత్సరాలు భార్య, పిల్లలకు దూరంగా ఉండిపోయాం. చంద్రయాన్-2లో ఒక దెబ్బ తగలడంతో చంద్రయాన్-3పై ఎక్కువ సేపు ఏకాగ్రతతో పరిశ్రమించాం. చంద్రయాన్-3 విజయవంతంతో జట్టు సభ్యుల ఆనందం ఇంతా అంతా కాదు.

? చంద్రయాన్-3 లక్ష్యాలను ఎలా సాధించారు.

● విదేశీ సైంటిస్టులతో భారతీయ సైంటిస్టులు సమంగా పోటీపడగలరని నిరూపించగలిగాం. చంద్రుని ఉపరితలంపై ల్యాండిగ్ చేయడంతో పాటు ఒక రోవర్‌ను కూడా తిరిగే విధంగా చేశాం. ఈ రోవర్ చంద్రుని ఉపరితలంపై ప్రయాణించి నమూనాను సేకరించి చంద్రుని భూ భౌగోళిక రసాయన కూర్పును విశ్లేషించగలిగింది. 2023 ఆగస్టు 23న ప్రయోగించిన చంద్రయాన్ ల్యాండర్ కొన్ని కీలకమైన చిత్రాలను సేకరించి పంపించింది.

? చంద్రయాన్-3 చంద్రుని చుట్టూ ఎన్ని రోజులు పరిభ్రమించింది.

● 11 రోజుల పాటు చంద్రుని ఉపరితలంపై తిరుగుతూ నేరుగా 100 మీటర్లు ప్రయాణించింది. దీనివల్ల చంద్రుడిపై సమాచారం చాలా అందించింది. ఇప్పటికీ చంద్రుడిపై రోవర్ అలాగే ఉంది. ఆ తరువాత చంద్రయాన్ భూమి చుట్టూ తిరగడం ప్రారంభించింది. ఇంత వరకు ఏ దేశం చేయని ప్రయోగం చేయగలిగాం. ఇదొక గర్వకారణం.

? చంద్రయాన్-3 ప్రస్తుత పరిస్థితి.

● మూడునెలలు చంద్రుని చుట్టూ తిరిగింది. ల్యాండర్, రోవర్ అక్కడే ఉండిపోయింది. ప్రస్తుతం భూమి చుట్టూ ప్రొపల్షన్ మాడ్యూల్ పరిభ్రమిస్తోంది. అదే చంద్రయాన్-3 ప్రత్యేకత.

? ఇస్రో ప్రయోగాలు నాసాతో కలిసి చేసే ఆలోచన ఉందా.

● ఇస్రో సంస్థ దీనిపై ఆలోచన చేసింది. అయితే ఇంకా కార్యరూపం దాల్చలేదు.

? చంద్రయాన్-4 ప్రయోగం చేయాలనుకుంటున్నారా.

● ఇస్రో ప్రయోగాలు ఆగవు. చంద్రయాన్-1 నుంచి చంద్రయాన్-3 వరకు అంచెలంచలుగా సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాం.. అదేవిధంగా చంద్రయాన్-4 కోసం ఇప్పుడిప్పుడే డైరెక్టర్ ఆలోచిస్తున్నారు. అయితే ఈ ప్రయోగాలు రూ.కోట్ల వ్యయంతో కూడుకున్నవి.

? నేటి యువ సైంటిస్టులకు మీరిచ్చే సలహాలు, సూచనలు.

● కొత్త పరిశోధనల కోసం నిరంతర అధ్యయనం అవసరం. పరిశోధనలు కొత్త ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు దోహదపడతాయి. ఏదైనా ఒక ప్రయోగం చేసిన వెంటనే ఫలితం కనబడక పోతే నిరుత్సాహపడకుండా ముందుకు సాగితే తప్పనిసరిగా విజయాలు సాధిస్తాం. ఇందుకు యువ సైంటిస్టులు గ్లోబల్ అవేరెనెస్ కలిగి ఉండాలి. తోటి సైంటిస్టులతో చర్చిస్తూ భావాలు పంచుకుంటూ ముందుకు సాగాలి.

? స్థానిక విద్యార్థులకు మీరు అందించే సేవలు.

● వృత్తి రీత్యా కొంచెం బిజీగా ఉంటాను. సమయం దొరికితే మచిలీపట్నంలోని విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ఇస్రోపై, ఆధునిక శాస్త్ర సంకేతిక పరిజ్ఞానంపై అప్పుడప్పుడు వచ్చి అవగాహన కల్పిస్తాను. నావంతుగా కొంత చైతన్యం కలిగిస్తాను. చదువుకున్న పాఠశాలలను, చదువు చెప్పిన గురువులను మరచిపోను.



శిశువును మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగిస్తున్న ఏసీపీ లతాకుమారి

మరో శిశువును సంరక్షించిన పోలీసులు

విజయవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో మహిళా గ్యాంగ్ విక్రయించిన మరో ఉత్తరాది శిశువును పోలీసులు సంరక్షించారు. సితార సెంటర్‌కు చెందిన బలగం సరోజని ఉత్తరాది నుంచి మొత్తం ఏడుగురు శిశువులను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వారిలో ముగ్గురు శిశువులను విక్రయించడానికి సిద్ధంగా ఉండగా పోలీసులు పట్టుకున్నారు. మిగిలిన నలుగురు శిశువులను సరోజని విక్రయించడంతో వారి ఆచూకీ తెలుసుకునే పనిలో ప్రత్యేక బృందాలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపాన ఉన్న సీతానగరం నుంచి ఒక శిశువును పోలీసులు సంరక్షించారు. కొనుగోలు చేసిన దంపతుల నుంచి శిశువును స్వాధీనం చేసుకుని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. మరో ముగ్గురు శిశువులను గుర్తించాల్సి ఉంది.

మహిళ మెడలో గొలుసు చోరీ



బాధితురాలు విజయ



జగ్గయ్యపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వచ్చిన యువకుడు నడిచి వెళ్తున్న మహిళ మెడలో ఉన్న నల్లపూసల గొలుసును తెంపుకుని పరారైన సంఘటన పట్టణంలో పుట్టబజార్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఖమ్మం నుంచి జగ్గయ్యపేట పుట్టబజార్‌లో ఉంటున్న మేనకోడ రాండేవు విజయ (55) వచ్చింది. కోదాడ రోడ్డులో ఆటో దిగి పుట్టబజార్‌లోకి వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన యువకుడు ఆమె మెడలో ఉన్న నల్లపూసల గొలుసును తెంపుకుని పరారయ్యాడు. గొలుసు విలువ రూ.2.లక్షలు పైనే ఉంటుందని ఆమె పేర్కొంది. అదే బజార్‌లో గత వారం రోజులుగా బైక్‌పై ఓ ఆగంతకుడు తరచు తిరుగుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా జగ్గయ్యపేట ఎస్ఐ జి.రాజు దర్యాప్తు చేస్తున్నారు.



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణా నదిలో పవిత్ర స్నానాలు చేసి కొండపైకి చేరుకున్నారు. క్యూలలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. కాగా, వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది క్యూలైన్లలో భక్తులను క్రమబద్ధీకరించారు. తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తి చేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందజేశారు.



సూర్యోపాసన సేవ





» నిశ్చయ తాంబూలం..

కృష్ణాజిల్లా ఉయ్యూరు పట్టణంలో ఆదివారం జరిగిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ కుమార్తె స్నేహ, రాజేశ్ నిశ్చయ తాంబూలాల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొల్లురవీంద్ర, కొలుసుపార్థసారథి, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, సుజనా చౌదరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి, ప్రముఖులు, పార్టీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. - **ఉయ్యూరు**

ముగ్గురూ.. ముగ్గురే!

(5వ పేజీ తరువాయి)

ఉండగా, ఆ గ్యాప్‌ను సరిచేసుకోవటంతో పాటు గతంలో జరిగిన వైసీపీ నాయకుల మైనింగ్ దోపిడీని దేవినేని గట్టిగా ప్రశ్నించారు. అనూహ్యంగా కిందటి ఎన్నికల్లో దేవినేనికి సీటు దక్కకపోవటం ఉమ్మడి జిల్లాను షాక్‌కు గురి చేసింది. ఉమ్మడి జిల్లా అధ్యక్ష బాధ్యతలను చూసిన దేవినేని ఉమాకు మైలవరం కాకపోయినా పెనమలూరు, గన్నవరం ఎక్కడైనా సీటు ఇవ్వాలన్న డిమాండ్ కూడా వచ్చింది. కానీ ఎక్కడా దక్కలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఉమాకు సముచిత స్థానం లభిస్తుందని ఆయన అభిమానులు భావించారు. ఉమాకు ఎలాంటి క్రియాశీలక పదవి లభించకపోవటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవినేని అభిమానులు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తికి ఇచ్చే గౌరవం ఇదేనా అన్న విమర్శలు కూడా వస్తున్నాయి. పదవులు రాకపోయినా దేవినేని ఉమా పార్టీలు మారే రకం కాదు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్నారు. దేవినేని సేవలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్సీ ఇస్తారేమోనని ఆయన అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

స్టార్ క్యాంపెయినర్‌గా పార్టీ విజయానికి రాధా కృషి

ఎన్టీఆర్ జిల్లాలోనే మరో ప్రధానమైన నాయకుడు వంగవీటి రాధాకృష్ణ. వైసీపీని వీడిన తర్వాత టీడీపీకి దగ్గరయ్యారు. వంగవీటి మోహనరంగా వారసుడిగా 2004లో రాజకీయాల్లోకి వచ్చారు. 2004లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి చెందారు. ఆ తర్వాత 2014లో కూడా వైసీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల ముందు తన సీటు విషయంలో జగన్ మోసం చేయటంతో వైసీపీని వీడారు. ఆ ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ప్రచారం చేశారు. అప్పటి నుంచి టీడీపీలోనే కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమికి రాధాకృష్ణ స్టార్ క్యాంపెయినర్‌గా మారారు. ఎందరో అభ్యర్థులకు ప్రచారం చేశారు. తెలుగుదేశం పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారు. రాధాను ఎమ్మెల్సీ పదవి తప్పకుండా వరిస్తుందని ఆయన అభిమానులు ఎంతో ఆశగా ఉన్నారు.

ఇక కృష్ణాజిల్లా విషయానికి వస్తే ఎమ్మెల్సీ ఆశావహులు పెద్దగా లేరనే చెప్పాలి. ఇప్పటికే సీనియర్ నేతలకు చాలా వరకు నామినేటెడ్ పదవులు వరించాయి. పార్టీ తరఫున ఎమ్మెల్సీ హామీ ఇచ్చిన రావి వెంకటేశ్వరరావుకు ఇటీవలే రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా పదవి ఇచ్చారు. పెడన నియోజకవర్గంలో బూరగడ్డ వేదవ్యాస్‌కు సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అధినాయకత్వం అప్పట్లో చెప్పటం జరిగింది. ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ ఇవ్వలేదు. ఆయన అభిమానులు మాత్రం ఎమ్మెల్సీ వస్తుందని ఆశిస్తున్నారు. ఆయన కూడా ఆశావహుల జాబితాలో ఉన్నారు. ఇక పోతే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సరిహద్దుగా ఉన్న పెనమలూరు నియోజకవర్గానికి చెందిన గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పార్టీ త్రిముఖ పోరులో ఎప్పుడూ బలపుతూ వస్తున్నారు. ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్, ఎమ్మెల్సీగా వైవీబీ రాజేంద్ర ప్రసాద్ తన్నుకుపోతుండటంతో.. గొట్టిపాటి ఆశలు నెరవేరలేదు. న్యాయవాదిగా పార్టీ నాయకుల కేసులను వాదించటంతో పాటు, పలు జిల్లాలకు పరిశీలక బాధ్యతలు కూడా చూశారు. సౌమ్యుడు, విలువలతో కూడిన రాజకీయాలు కలిగిన గొట్టిపాటికి ఆశాభంగమే ఎదురవుతోంది. కొత్తవారికి ఎమ్మెల్సీ సీటును ఇవ్వాలనుకుంటే గొట్టిపాటి అర్హత కలిగిన వ్యక్తి అని ఆయన అభిమానులు ఆశలతో ఉన్నారు.

8 నుంచి సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు

» 22 నుంచి మహాజర్లు, ధర్నాలు

గవర్నర్‌పేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు ఆదివారం బాలోత్సవ్ భవన్‌లో మీడియాకు వివరించారు. సమస్యలపై ఈ నెల 8 నుంచి 17 వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించి, యాత్రల్లో గుర్తించిన సమస్యల పరిష్కారం కోరుతూ 22 నుంచి 28వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద మహాజర్లు, ధర్నాలు చేపడతామని తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఏప్రిల్, మే నెలల్లో పోరాట రూపకల్పన చేస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యల అధ్యయనం కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వాలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తాయని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధికి నిధులు కేటాయించాల్సిన ప్రభుత్వం రూ.300 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకూ నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు.



మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

వృత్తి విద్య నైపుణ్యాలను ప్రోత్సహించండి

అమరావతి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను చదువుతోపాటు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవడంలోనూ ప్రోత్సహించాలని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ట్రైనర్లను ఆదేశించారు. విజయవాడలో జరుగుతున్న వృత్తివిద్య ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు 10 ట్రేడుల్లో విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సులు అందిస్తున్నామన్నారు.

జాతీయ యోగా పోటీలకు రమేష్, స్వర్ణలత

మచిలీపట్నం టౌన్: చండీఘర్‌లో మార్చి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే జాతీయ యోగా పోటీలకు మచిలీపట్నం నుంచి సీనియర్ ఆడిటర్ ఎస్.రమేష్, తాళ్లపాలెం జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ కె. స్వర్ణలత ఎంపికయ్యారు.

వివాహేతర సంబంధానికి నిండు ప్రాణం బలి

ఆటోనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకోగా, ముగ్గురు పిల్లలకు తల్లిని దూరం చేసింది. విజయవాడ రూరల్ మండలం నిడమానూరుకు చెందిన పి.కావ్య(23) రేపల్లికి చెందిన ప్రకాష్‌రావును ఆరేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వారికి ముగ్గురు పిల్లలు. భర్త వంట పనులు చేసేవాడు. కావ్య నిడమానూరులోని ఓ ఆసుపత్రిలో పనిచేసేది. అ సమయంలో నిడమానూరుకు చెందిన లాం వాసు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారితీసింది. భర్తకు విషయం తెలియడంతో కావ్యను ఉద్యోగం మాన్పించాడు. ఐదు నెలల క్రితం కావ్య రెండవ, మూడవ కుమార్తెలతో కలిసి లాంవాసుతో వెళ్లిపోయింది. భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిని వెతికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి కావ్య లాం వాసును దూరం పెట్టింది. దీన్ని భరించలేని లాం వాసు చంపేస్తానని బెదిరిస్తు.. శనివారం అర్ధరాత్రి భర్త ఇంట్లోలేని సమయంలో కావ్యతో గొడవ పడ్డాడు. ఆమె మెడకు చున్నీతో ఉరి బిగించి హత్య చేశాడు. పక్క గదిలో ఉన్న కావ్య తాతయ్య కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. భర్త ప్రకాష్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వి.పవన్ కిషోర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలి

» డీబీఎఫ్ ప్రధాన కార్యదర్శి భాగ్యారావు

గాంధీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ గ్రామీణ నీటి సరఫరాశాఖలో పనిచేస్తున్న కార్మికులకు రూ.30 వేల కనీస వేతనం చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ గ్రామీణ నీటి సరఫరా శాఖ కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాగ్యారావు మాట్లాడుతూ ఈ శాఖలోని కార్మికులు కాంట్రాక్టర్ల వ్యవస్థలో తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్‌కు గుర్తింపునివ్వాలన్నారు. ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టర్ల ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చమల్లమూడి ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ న్యాయ సలహాదారు సాతులూరి రామాంజనేయులు, గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కనుపూరు పద్మ, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దీయా చినకొండయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లీలాచలం, ఎం.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో సిమెంటు పని చేస్తున్న విద్యార్థులు

బడికోసం బాలల శ్రమదానం!

» తల్లిదండ్రులు, స్థానికుల ఆగ్రహం.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు

ఉంగుటూరు : క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం కింద నాలుగో శనివారం పాఠశాల పరిసరాలను శుభ్రపరచడం తెలిసిందే.. దీనికి భిన్నంగా మండలపరిధిలోని పెద అవుటపల్లి జడ్పీహైస్కూల్‌లో గురువులే విద్యార్థులతో తాపీ పనులు చేయించడంపై తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. హైస్కూల్ గేటుకు రోడ్డుకు మధ్య 9వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు శనివారం గచ్చుపని చేశారు. హెచ్ఎం. శేషుకుమారి, పీడీ రాంబాబు వద్దని వారించినా మధ్యాహ్నసమయంలో విద్యార్థులు గేటువద్ద కాంక్రీట్ పనులు పూర్తిచేశారు. అది చూసిన గ్రామస్థులు హెచ్ఎం, పీడీల వైఖరిపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సత్వరమే స్పందించిన గుడివాడ ఇన్‌చార్జి డీవైఈవో కొండా రవికుమార్ పాఠశాల హెచ్ఎం శేషుకుమారిని దీనిపై వివరణ కోరారు.

మరణం తర్వాత జీవించి ఉండేందుకు అవయవదానం మంచి మార్గం

» క్యాపిటల్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ మన్నె హరీష్



బచ్చు ప్రదీప్ (ఫైల్)

వన్‌టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మనిషి మరణం తరువాత కూడా జీవించి ఉండేందుకు అవయవదానం ఒక మంచి మార్గమని క్యాపిటల్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నె హరీష్ అన్నారు. ఫిబ్రవరి 21న కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన బచ్చు ప్రదీప్ (32) మెదడులో తీవ్ర రక్త స్రావం జరగడంతో స్పృహ కోల్పోయారు. అతడి ప్రాణం కాపాడేందుకు పోరంకిలోని క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు ఎంతగానో శ్రమించి శస్త్ర చికిత్స చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో శనివారం బచ్చు ప్రదీప్‌కి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రదీప్ తన మరణానంతరం అవయవాలను వేరొకరికి దానం చేయాలనే సంకల్పం కలిగి ఉండటంతో అదే విషయాన్ని మృతుడి బంధువులు వైద్యులకు తెలిపారు. వారి సూచన మేరకు జీవన్‌దాన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏపీ ప్రతినిధులను సంప్రదించి శరీరంలోని పలు అవయవాలను ఆదివారం సేకరించి వివిధ ఆసుపత్రులకు గ్రీన్ ఛానల్ ద్వారా తరలించారు. ఈ సందర్భంగా క్యాపిటల్ హాస్పటల్ ఎండీ డాక్టర్ మన్నె హరీష్ మాట్లాడుతూ, ఇటువంటి గొప్ప సంకల్పం కలిగిన వ్యక్తులు ఉండటం వల్లనే జీవశ్చవాల్లా జీవిస్తున్న కొందరికి పునర్జన్మ లభిస్తుందని చెప్పారు. జీవన్‌దాన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆంధ్రప్రదేశ్ విభాగం చైర్మన్ డాక్టర్ డి.ఎస్.ఎల్.వి.నరసింహం, జీవన్‌దాన్ సంస్థ ప్రధాన వైద్యులు కె.రాంబాబు మృతుని కుటుంబసభ్యులు, బంధువులను అభినందించారు.



ప్రత్యేక విమానంలో గుండెను తీసుకువస్తున్న వైద్యులు

గ్రీన్‌చానల్‌లో గుండె తరలింపు

» కాకినాడ యువకుడికి విజయవాడ వాసి గుండె

» తిరుపతి శ్రీపద్మావతి హృదయాలయలో ఆపరేషన్

తిరుపతి(వైద్యం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కాకినాడకు చెందిన 20 ఏళ్ల యువకుడికి విజయవాడకు చెందిన వ్యక్తి గుండెను విజయవంతంగా అమర్చారు. ఈ ఘటన తిరుపతిలోని టీటీడీ పరిధిలో నడుస్తున్న శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రిలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బి.ప్రదీప్(32) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. కాకినాడకు చెందిన ఓ యువకుడు గుండె సంబంధిత వ్యాధితో స్థానిక శ్రీపద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గుండె మార్పిడి ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. దీంతో అయన వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. విషయం తెలుసుకున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి.. తన బృందంతో కలిసి విజయవాడలోని క్యాపిటల్ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ప్రదీప్ గుండె సేకరించి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక విమానంలో సాయంత్రం 4.10 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్సులో 4.30 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆగమేఘాలపైఆపరేషన్‌ను ప్రారంభించారు.

త్వరలో రవితేజతో సినిమా తీస్తాం

» సినీ రచయిత ప్రసన్నకుమార్



మచిలీపట్నం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : త్వరలో రవితేజతో తీసే సినిమాకు స్క్రిప్టు ఇస్తున్నానని ప్రముఖ సినీరచయిత ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి రేవతీ సెంటర్‌లో మజాకా సినిమాను చూసేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చిలకలపూడికి చెందిన తాను అంచెలంచెలుగా ఎదిగేందుకు ఎందరో కళాకారులు, రచయితలు సహకరించారన్నారు.

డీవైఈవో అభ్యర్థులకు టెన్త్ విధులు మినహాయింపు

అమరావతి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన టీచర్లకు టెన్త్ పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. అలాగే డీవైఈవో పరీక్షలు జరిగిన మార్చి 26, 27 తేదీల్లో సెలవు తీసుకునేందుకు అనుమతివ్వాలన్నారు. ఈనెల 17 నుంచి 31 వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. కాగా డిపార్ట్‌మెంటల్ పరీక్షల తరహాలో డీవైఈవో పరీక్షలకు హాజరయ్యే వారికి ఓడీ సౌకర్యం కల్పించాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

అతిపెద్దగా..

(5వ పేజీ తరువాయి)

సూచించింది. ఈ కొత్త రహదారి విజయవాడ పశ్చిమబైపాస్-ఎన్‌హెచ్-16ని నందివెలుగు వద్ద అవుటర్‌రింగురోడ్డుతో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారితో విజయవాడ తూర్పు బైపాస్ రహదారి అవసరం ఉండదని ఎన్‌హెచ్ఏఐ తేల్చిచెప్పింది. చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో పశ్చిమ బైపాస్ కలిసే ప్రాంతంలో క్లవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌ను సరికొత్తగా నిర్మిస్తారు. ఇక్కడ నుంచి మొదలయ్యే అనుసంధాన రహదారి నంబూరుకు ఉత్తరంగా పెనుమూలి, మంచికలపూడి, కంఠంరాజు కొండూరు, దుగ్గిరాల, చింతలపూడికి ఆవలివైపుగా వెళ్లి నందివెలుగు వద్ద ఓఆర్ఆర్‌తో కలుస్తుంది. ఈ రహదారితో పాటు మంగళగిరి-తెనాలి-నారా కోడూరు రూటులో ప్రస్తుతం ఉన్న డబుల్‌లేన్ రోడ్డును నాలుగులేన్ల రహదారిగా అభివృద్ధి చేయబోతున్నట్టు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఇక రెండో లింకురోడ్డు విషయానికొస్తే.. బుడంపాడు వద్ద గుంటూరు హైవే జంక్షన్ నుంచి నారాకోడూరు వరకు సుమారు ఆరున్నర కిలోమీటర్ల పొడవున ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నారాకోడూరు వద్ద ఓఆర్ఆర్‌తో లింకు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి మూడు అలైన్‌మెంట్లను పరిశీలిస్తున్నారు.

ల్యాంకో లైసెన్స్ ఓ మిస్టరీ!

(5వ పేజీ తరువాయి)

భాగాన్ని మయన్మార్‌కు చెందిన సంస్థ కొనుగోలు చేసింది. మూడో భాగంలో ల్యాంకో పవర్ లైన్ కూడా ఉంది. మయన్మార్ సంస్థ పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించకపోవటంతో పూర్తిగా ఇంకా దాని పరం కాలేదు. కానీ మయన్మార్ సంస్థ, రాధా సంస్థల అంతర్గత ఒప్పందం కారణంగా ఈ లైన్‌కు ఏర్పడిన విద్యుత్ అంతరాయానికి ప్రతిగా ఎన్‌హెచ్ అధికారులు రాధా సంస్థకు రూ.14 కోట్లు చెల్లించారు. ఎన్‌హెచ్ పీడీకి ల్యాంకో లిక్విడేటర్ రాసిన లేఖలో ల్యాంకో పవర్ లైన్‌ను తాము మయన్మార్ కంపెనీకి విక్రయించామని ఆ సంస్థ ఇంకా డబ్బులు చెల్లించాల్సి ఉందని, దీనిపై కూడా ఎన్‌సీఎల్‌టీలో వివాదం నడుస్తోందని, అందువల్ల రాధాకు, మయన్మార్ కంపెనీకి సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఎన్‌హెచ్‌పై కోర్టుకెళ్లిన రైతులు

అసలు విద్యుదుత్పత్తే లేకుండా మూతపడిన సంస్థకు చెందిన లైన్‌కు విద్యుత్ అంతరాయం పేరుతో రూ.14 కోట్లు ఎలా చెల్లింపులు జరుపుతారని జక్కంపూడి, నైనవరం రైతులు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశాలన్నీ గందరగోళం, అయోమయ పరిస్థితులను కలిగిస్తున్నాయి. రైతులు వేసిన కేసులను విచారిస్తున్న హైకోర్టు ఈ సమస్యలన్నింటికీ మూలమైన కీలక కోణాన్ని గుర్తించింది. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్‌లైన్స్‌కు లైసెన్స్ ఉందా లేదా అన్న అంశంపై దృష్టి సారించింది. ల్యాంకో లైసెన్స్ అంశంపై స్పష్టత కోరగా.. ఏ శాఖ కూడా లైసెన్స్ విషయం చెప్పటం లేదు. దీంతో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సెక్రటరీని తాజాగా వివరణ కోరింది.

8న మహిళలకు ఉచిత వైద్య శిబిరం

పటమట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న ఉమెన్స్ డే సందర్భంగా మహిళల ఆరోగ్యం.. కుటుంబానికి ఆరోగ్యం అనే నినాదంతో రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంటినీ హాస్పటల్ సహకారంతో మార్చి 8 శనివారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు మహిళలకు అశోక్‌నగర్ సోమనాథ్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రూట్స్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయ్‌భాస్కర్ తెలిపారు. ఈ శిబిరంలో ఎముకల బలాన్ని తెలిపే పరీక్ష, థైరాయిడ్ పరీక్ష, ఇతర పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 98498 72499 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఇష్టానుసారం



మహానాడు జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో నడుస్తున్న పాదచారులు

భారతీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన జంక్షన్ వద్ద పాదచారులు, పలువురు వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లు దాటుతుండటంతో మిగతా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదివారం జాతీయ రహదారిపై రమేష్ ఆసుపత్రి, మహానాడు రోడ్డు, రామవరప్పాడు వంటి పలు ప్రధాన జంక్షన్ల వద్ద కొందరు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు సెల్‌ఫోన్, పక్కవారితో మాట్లాడుత నా ఇష్టం వచ్చినట్టు రోడ్డు దాటుతూ తోటి వాహనదారులకు ఇబ్బందులు గురి చేశారు. పైగా ట్రాఫిక్ అధికారులు పిలుస్తున్నా తమకైం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వీరి వల్ల ఎక్కడేం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రధాన కూడలిలో పాదచారులు జీబ్రలైన్లపై మాత్రమే నడిచేలా చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.



రమేష్ ఆసుపత్రి జంక్షన్ వద్ద..



ఇరుకుగా మారిన కనకదుర్గానగర్ వంతెన

ఇరుకు వంతెనతో అవస్థలు

భారతీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇరుకుగా మారిన కనకదుర్గానగర్ వంతెనతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఏలూరు జాతీయ రహదారి, సర్వీస్ రోడ్డుపై నిత్యం వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉండడంతో కనకదుర్గానగర్ రోడ్డు ప్రత్యామ్నాయంగా మారింది. వాహనదారులు బల్లెం వారి వీధిలో గుండా బాయిన బాజీ రోడ్డులో ప్రవేశించి హైటెక్షన్ రోడ్డులోకి, కనకదుర్గానగర్ మెయిన్ రోడ్డులో చేరుకుంటారు. ఇక్కడ నుంచి మహానాడు రోడ్డు, ఆటోనగర్, భారతీనగర్, గురునానక్, పటమట, బందర్ రోడ్డుకు వెళ్లే వాహనదారులు కనకదుర్గానగర్ మెయిన్ రోడ్డును ఉపయోగిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డుకి వెళ్లే మొదట్లో పంటకాలువ డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన ఇరుకుగా మారింది. వాహనాల రద్దీతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వంతెనను వెడల్పు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కుచించుకుపోయిన గురునానక్ రోడ్

భారతీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అసలే ఇరుకు రోడ్డు అనుకుంటే దానికితోడు రోజురోజుకీ పెరుగుతున్న అక్రమ వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 5వ నెంబర్ రోడ్‌లో రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి ఆటోనగర్ వరకు రోడ్డుకిరువైపులా పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు చెందిన కార్యాలయాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, కల్యాణ మండపాలున్నాయి. అంతే కాక ఆటోనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు కావడంతో ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటుంది. దీంతో ఆయా కార్యాలయాలు, షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను సమీపంలోని గురునానక్ (5వ నెంబరు) రోడ్డులో ఇరువైపులా నిలిపేస్తున్నారు. దీంతో వాహనాలు గంటల కొద్దీ నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. సాయంత్రం సమయంలో అటుగా ప్రయాణించాలంటే ఎంతో సమయం కేటాయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



గురునానక్ రోడ్‌లో ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో నిలిచిపోయిన వాహనాలు



మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులు

జాతీయ అథ్లెటిక్ పోటీలకు నగర క్రీడాకారులు

లబ్బీపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో ఈ నెల 4 నుంచి 9 వరకు జరిగే 45వ జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 16 మంది పోటీలకు హాజరవుతున్నట్టు కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ జీ.వి.ప్రసాదరావు, అధ్యక్షుడు కంది గంగాధరరావు తెలిపారు. ఈ పోటీల్లో 30 ప్లస్ కేటగిరి నుంచి 90 ఏళ్ల కేటగిరి వరకు క్రీడాకారులు పాల్గొంటారని, మహిళా క్రీడాకారులు ఎం అరుణ, ఎన్ కుముద్వతి, కే గీతాంజలీ, ఏవీ సుబ్బలక్ష్మీ, పురుష క్రీడాకారులు ఏ శివగణేష్ బాబు, జీ శ్రీనివాస నాయక్, కే రోశయ్య, టీ జమల్‌బాబు, కే రణదీర్ కుమార్, పి.జ్యోతి ప్రకాష్, ఎల్.రవీంద్ర రావు, ఎన్.నెల్సన్, ఎస్.పద్మనాభన్, బి.జోజి, కె.గంగాధర్ రావు, సీహెచ్ రామస్వామి పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు.



ఎంపికైన నూతన కార్యవర్గం

శిక్షణ, ఉపాధి అధికారుల సమాఖ్య నూతన కార్యవర్గం

మొగల్రాజపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): శిక్షణ, ఉపాధి అధికారుల సమాఖ్య నూతన కార్యవర్గం ఎంపిక నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగింది. సమాఖ్య పూర్వ అధ్యక్షుడు బీ వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాలు మెరుగుపరిచే శిక్షణ అందించడం, నాణ్యమైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలని నిర్ణయించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎంపికలో భాగంగా అధ్యక్షుడిగా డాక్టర్ ఎన్‌వీ సురేంద్ర బాబు, ఉపాధ్యక్షుడిగా జి.ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా వి.జగదీష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ పీఎల్ మాధవరావు, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ బి.వంశీమోహన్ (దక్షిణ జిల్లాలు) ఎం.హిమబిందు (మధ్య జిల్లాలు), కావూరి శ్రీధర్ (డిగ్రీ కళాశాలు), కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎన్. కిషందర్, ఏ శివనాగేశ్వరరావు ఎంపికయ్యారు.

ముక్కు మూసుకుని నడవాల్సిందే..!



పేరుకుపోయిన చెత్త నిల్వలు, వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ

పటమట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): 14వ డివిజన్ శాంతినగర్ చైత్ర స్కూల్ సమీపంలో వారం రోజుల నుంచి చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. ముక్కు మూసుకొని రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా స్కూల్ ఎదుట డ్రెయినేజీ వ్యర్థాలతో నిండిపోయి మురుగు నీరు ముందుకు కదలడం లేదు. అధికారులు స్పందించి డ్రెయినేజీ, చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

బచ్చుల అర్జునుడికి ఘన నివాళి

వన్‌టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనమండలి సభ్యుడు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు వర్ధంతి ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అర్జునుడు చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి, తెలుగుదేశం పార్టీకి అర్జునుడు విశేష సేవలందించారని, బీసీ నేతల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నాయకుడన్నారు. మచిలీపట్నం మునిసిపల్ చైర్మన్‌గా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, శాసన మండలి సభ్యుడిగా, జాతీయ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా పార్టీకి ఎనలేని సేవ చేసిన వ్యక్తి అర్జునుడని కొనియాడారు. పార్టీ నేతలతో, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని, గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బీసీ నేత అయిన అర్జునుడుని చంద్రబాబు నియమించారన్నారు. అక్కడ వంశీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అర్జునుడు పోరాటాలు చేశాడన్నారు. అర్జునా.. అంటూ చంద్రబాబు ఆప్యాయంగా పిలిచేవారని, అలాంటి వ్యక్తి లేకపోవటం పార్టీకి, బీసీ నేతలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శాంతి శివరామ ప్రసాద్ గౌడ్, ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, వీరంకి కుటుంబ రావు, మహమ్మద్ హఫీజ్ రహమాన్, యార్లగడ్డ రమేష్, మన్నెం పోతరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జలాల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

రేపటి నుంచి మహిళా ఉద్యోగులకు
సాంస్కృతిక, ఆటల పోటీలు

గాంధీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు సాంస్కృతిక ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీ ఎన్జీవో సంఘం మహిళా విభాగం రాష్ట్ర చైర్మన్ వి.నిర్మలా కుమారి పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4న స్థానిక ఐజీఎం స్టేడియంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి పోటీలను ప్రారంభిస్తారన్నారు. స్టేడియంతో పాటు ఎన్జీవో హోంలోనూ ఈ నెల 5, 6న జరిగే పోటీల్లో మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. విజేతలకు ఈ నెల 8న ఎన్జీవో హోంలో బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి మహిళలకు ఉందన్నారు. సంఘం కన్వీనర్ పి.మాధవి మాట్లాడుతూ కుటుంబ నిర్వహణతో పాటు సమాజాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల రక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీఎస్‌జీఈఎఫ్ మహిళా కమిటీ కన్వీనర్ ఎం.రాజ్యలక్ష్మీ, ప్రచార కార్యదర్శి బి.జానకీ, కార్యదర్శి బి.తులసీ, లలితాంబ, శాంతిశ్రీ, శివలీల పాల్గొన్నారు.

శ్రామిక పక్షపాతి లక్ష్మణరావు

● ప్రముఖ రచయిత్రి ఓల్గా

విజయవాడ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉప్పల లక్ష్మణరావు శ్రామికవర్గ పక్షపాతి అని, కమ్యూనిస్టు దృక్పథంతో రచనలు చేసేవాడని, అతడి రచనల్లో సామాజిక బతుకుపోరు కనిపిస్తుందని ప్రముఖ రచయిత ఓల్గా అన్నారు. ఆదివారం ఓ స్కూల్లో జరిగిన ఉప్పల లక్ష్మణరావు రచనలు పుస్తక పరిచయానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లక్ష్మణరావు రాసిన అతడు-ఆమె నవల చదివిన తర్వాత అతడు-ఆమె-మనం అనే పేరుతో పెద్ద వ్యాసం రాశానన్నారు. శ్రీశ్రీ ప్రింటర్స్ మొదలుపెట్టిన తర్వాత విశ్వేశ్వరరావు ప్రచురించిన మొట్టమొదటి పుస్తకం అదేనన్నారు. లక్ష్మణరావుతో తనకు ఆత్మీయమైన అనుబంధం ఉందని, ఆయన రచనలు ఆ కాలం నుంచి ఇప్పటి వర్తమానానికి అనుసంధానంగా ఉన్నాయన్నారు. బరంపురం వికాసం సభ్యులు కామేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్మణరావు బరంపురంతో ఉన్న అనుబంధాన్ని, వికాసంలో ఆయన పాల్గొన్న నాటి సంగతులు చెబుతూ, వారం వారం అనేక రచనలు చదవటం వాటిమీద చర్చలు చేసేవారన్నారు. దినకర్, శ్రీనివాస్, సేతుపతి ఆదినారాయణ, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, బండ్ల మాధవరావు పాల్గొన్నారు. చినుకు రాజగోపాల్ నిర్వహించారు.

దాడి చేసిన వారిపై కేసు

విద్యాధరపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యంగా ఇంటిలోకి ప్రవేశించి ఫర్నీచర్ ధ్వంసం చేసి చంపుతామని బెదిరించి, దాడికి ప్రయత్నించిన వారిపై ఆదివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం ఏకలవ్యనగర్‌లో కట్టా సత్తియ్య కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఈనెల 1న సత్తియ్య ఇంట్లో లేని సమయంలో భార్య శివనాగమణి ఒక్కరే ఉన్నారు. మేడా గోపి, ఏసు అలియాస్ కుంబా రాజేష్, గరిక వీరేంద్ర, గరిక ప్రసాద్, బాలసాని అమ్ము, బాలసాని చంటి, గరిక రమణ, బాలసాని లక్ష్మి, మేడా దశరథ, మరికొందరు ఇంటిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఫర్నీచర్ ధ్వంసం చేసి అసభ్యకరంగా దూషించారు. దీంతో ఆమె 112కు ఫోన్ చేయగా పరారయ్యారు. అనంతరం నాలుగు స్తంభాల సెంటర్‌లో సత్తియ్య బంధువులు కుంబా రామజోజి ఇంటికి వెళ్లి రాడ్లతో బెదిరించారు. బాధితురాలు శివనాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సీనియర్ సిటిజెన్స్‌కు రూ.లక్ష విరాళం

పటమట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సమాజానికి తమ వంతు సేవ చేస్తున్న పటమట సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు పటమటలంకకు చెందిన దివంగత గూడూరు రామ్మోహన్‌రావు పేరుతో ఆయన కుమారులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. దాత కుమారులు గూడూరు విజయ్‌కృష్ణ, రాధాకృష్ణ, బాబ్జి అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యదేవర పాపారావుకు ఈ విరాళాన్ని అందించారు. అసోసియేషన్ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు ఈ సాయాన్ని అందించినట్టు వారు తెలిపారు.

భవకుమార్‌ను కలిసిన సందీప్



భవకుమార్‌ను సన్మానిస్తున్న సందీప్

పటమట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు పరిధిలోని 12, 13, 14 డివిజన్లకు బీజేపీ మండలాధ్యక్షుడిగా నియమితుడైన యార్లగడ్డ సందీప్ ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్‌ను పటమట కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భవకుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రగతి కోసం కూటమి నేతలతో కలిసి పని చేయాలన్నారు. శంకర్, సతీష్, హర్ష, గణేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఆటోనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. యెర్నేని లక్ష్మీకాంత్ (47) లారీ బిజినెస్ చేసుకుంటూ కుటుంబంతో కలిసి కానూరులో నివాసం ఉంటున్నాడు. శనివారం సాయంత్రం గాయత్రినగర్‌లోని స్నేహితుడిని కలిసి అర్ధరాత్రి సమయంలో తిరిగి కానూరు బయలుదేరాడు. ఈ క్రమంలో గురునానక్ కాలనీ ఏపీఐఐసీ కాలనీ సెంటర్ వద్ద కొత్తగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్లకు రేడియో రంగులు లేకపోవడంతో స్పీడుగా వెళ్తున్న బండి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ క్రమంలో లక్ష్మీకాంత్ తలకు బలమైన రక్తగాయం, చెవుల నుంచి రక్తం కారడంతో స్థానికులు 108 కాల్ చేసి అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 4 గంటలకు మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీ పవన్ కిషోర్ తెలిపారు.

ఠాగూర్ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు

గవర్నర్‌పేట: చదవడం మా కిష్టంలో భాగంగా ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చిన్నారులకు ఇంగ్లీషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు నిర్వహించారు. ఉపాధ్యాయుడు జె.దేవ్ పర్యవేక్షించారు.

గ్రాడ్యుయేషన్ వరకు మన దేశంలో చదివినా, ఉన్నత విద్య మాత్రం విదేశాల్లో చదువుకుని కెరీర్‌లో గొప్పగా స్థిరపడాలనేది చాలా మంది విద్యార్థుల కోరిక. దీని వల్ల చాలా ఉపయోగాలు కూడా ఉన్నాయి. కొత్త సంస్కృతులు పరిచయం అవుతాయి, కెరీర్ అవకాశాలు పెరుగుతాయి, నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయి. అందుకే మన దేశంలో ప్రతీ సంవత్సరం విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థుల సంఖ్య దిన దిన ప్రవర్ధమానం అవుతోంది. అయితే ఉన్నత విద్యకు ఏయే దేశాలు-యూనివర్సిటీలు మంచివి, ఎంత ఖర్చు అవుతుంది, వీసా కోసం ఏయే పత్రాలు అవసరం అవుతాయి, ప్రాసెసింగ్ ఎలా చేయించుకోవాలి అనే విషయం చాలా మందికి అవగాహన ఉండదు. విదేశీ విద్యకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సహకరించడానికి మన దగ్గర ఫారెన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. వీటిని సంప్రదిస్తే సరైన గైడెన్స్ లభిస్తుంది. తరువాత సులువుగా కావాల్సిన డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవచ్చు.

కొవిడ్ ముందుతో పోలిస్తే తరువాత విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 52 శాతం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సంలో భారతదేశం నుంచి విదేశాలకు వెళ్లి చదువుకున్న విద్యార్థుల సంఖ్య 8,94,783. ప్రపంచ వ్యాప్తంగా చైనా తరువాత ఉన్నత విద్య కోసం అత్యధికంగా విదేశాలకు వెళుతున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. మన విద్యార్థుల ప్రాధాన్యంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకేలు వరుసగా ఉన్నాయి. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ నివేదిక ప్రకారం 2023-24 అకడమిక్ ఇయర్‌లో అమెరికాకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 3,37,630. అయితే కెనడా ఇబ్బందుల కారణంగా ఈ విద్యా సంవత్సరం అక్కడికి వెళుతున్న భారత విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఇంత పెద్ద మొత్తంలో విదేశాలకు వెళుతున్న విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న కన్సల్టెన్సీల సేవల పొందుతున్నారు. భారతదేశంలో పేరున్న కన్సల్టెన్సీల్లో ఇవికొన్ని...

విదేశీ విద్యకి బెస్ట్ కన్సల్టెన్సీలు

» ఐడీపీ ఎడ్యుకేషన్

ఐదు దశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సర్వీసులో ఉన్న పెద్ద సంస్థ ఇది. ఆస్ట్రేలియన్ ఆసియన్ యూనివర్సిటీస్ కో-ఆపరేషన్‌గా మొదలై కాలక్రమంలో 'ఐడీపీ ఎడ్యుకేషన్' పేరు మార్చుకుంది. విదేశీ విద్యకు సంబంధించి పలు సేవలు అందిస్తుంది. www.idp.com/india/

» ఇన్ఫినిటీ గ్రూప్

ఇన్ఫినిటీ గ్రూప్ రెండు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. ఈ సెక్టార్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న 'ఇన్ఫినిటీకి 300 యూనివర్సిటీ పార్టనర్‌షిప్, 2500 గ్లోబల్ పార్ట్‌నర్స్ ఉన్నారు. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్, ఎండ్ టు ఎండ్ అసిస్టెన్స్‌లో ఉంటుంది. https://infinitegroup.global/



» వై యాక్సిస్

భారతదేశంలోని పేరొందిన నమ్మకమైన స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీల్లో 'వై యాక్సిస్' ఒకటి. 25 సంవత్సరాల పైన ఈ సంస్థ కన్సల్టెన్సీ సర్వీసులో ఉంది. స్టడీ అబ్రాడ్, ఇమ్మిగ్రేషన్ కౌన్సెలింగ్, వీసా అసిస్టెన్స్, కెరీర్ కౌన్సెలింగ్, లాంగ్వేజ్ ట్రైనింగ్‌లో 'వై యాక్సిస్' సహాయం చేస్తుంది. https://www.yaxis.com/

» ఎడ్వైజ్ ఇంటర్నేషనల్

'ఎడ్వైజ్ ఇంటర్నేషనల్' మూడు దశాబ్దాలకుపైగా ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉంది. దేశంలోని పాత కన్సల్టెన్సీల్లో ఇది ఒకటి. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రి డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది. స్కాలర్‌షిప్స్, ఫైనాన్సియల్ ఎయిడ్‌కు సంబంధించిన సమాచారం కూడా ఇస్తుంది. https://www.edwiseinternational.com/

» 'మాన్య గ్రూప్'(ద ప్రిన్స్‌టన్ రివ్యూ ఇండియా)

దేశంలోని ఎస్టాబ్లిష్డ్ కన్సల్టెన్సీల్లో 'మాన్య గ్రూప్' ఒకటి. రెండు దశాబ్దాలకు పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో రెప్యూటెడ్ గ్రూప్ ఇది. పలు ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ కొనసాగిస్తోంది. స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, శాట్/ఏసీటీ/జీఆర్ఈ/జీమాట్/ఐఈఎల్‌టీఎస్/ టోఫెల్ ప్రిపరేషన్, లాంగ్వేజ్ ట్రైనింగ్, కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు నిర్వహిస్తుంది.
https://www.manyagroup.com/

» కెరీర్ మ్యాట్రిక్స్

ఒకటిన్నర దశాబ్దం పైగా ఎడ్యుకేషన్ సర్వీసెస్‌లో ఉన్న సంస్థ ఇది. పలు యూనివర్సిటీలు, సంస్థలతో పార్ట్‌నర్‌షిప్ ఉంది స్టడీ అబ్రాడ్ కౌన్సెలింగ్, యూనివర్సిటీ సెలెక్షన్, అప్లికేషన్ అసిస్టెన్స్, వీసా గైడెన్స్, ప్రీ డిపార్చర్ ఓరియంటేషన్ నిర్వహిస్తుంది.
https://careermatrix.in/

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోసం 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025'



నాలుగు సంవత్సరాల 'ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్'లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. 'నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025' పేరిట జరిగే ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది.. ఈ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 64 విద్యా సంస్థల్లోని 6,100 సీట్లలో అడ్మిషన్లు పొందవచ్చు. పరీక్షల్లో ర్యాంకు ఆధారంగా ఆయా సంస్థలు ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించి బీఏ-బీఈడీ, బీకాం-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తాయి. ఇంటర్ విద్యార్హత ఉన్న వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరడానికి ఎలాంటి వయోపరిమితి లేదు.

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలను అడుగుతారు. ఈ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్, హిందీతోపాటు 13 భాషల్లో జరుగుతుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 16 **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 29

నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఉపాధ్యాయ విద్యలో కూడా మార్పులు చేర్పులు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సుల్లో యోగా, వ్యాయమ విద్య, ఆర్ట్స్, సంస్కృతం ప్రవేశపెట్టనున్నారు. ఇవి 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఇప్పటి వరకు ఏ కోర్సులోనైనా విద్యార్థులకు 75 శాతం హాజరు తప్పనిసరి అన్న నిబంధన ఉండేది. ఇక దీనిని 2026-27 విద్యా సంవత్సరం నుంచి 80 శాతానికి పెంచనున్నారు. ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ పూర్తి వివరాలకు exams.nta.ac.in/NCET/ వెబ్‌సైట్ చూడవచ్చు.

దిక్సూచి DIKSUCHI

1161 కానిస్టేబుల్/ ట్రేడ్స్‌మన్

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో వివిధ సెక్టార్‌లో ఖాళీగా ఉన్న 1161 కానిస్టేబుల్ ట్రేడ్స్‌మన్ పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 3. నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఖాళీల్లో 493 కానిస్టేబుల్/కుక్, కానిస్టేబుల్/వాషర్‌మన్ 262, కానిస్టేబుల్ బార్బర్ 199, కానిస్టేబుల్/స్వీపర్ 152, కానిస్టేబుల్/కార్పెంటర్ 9, కానిస్టేబుల్/టైలర్ 23 మొదలైన 13 రకాల పోస్టులు ఉన్నాయి. ఫిజికల్ స్టాండెడ్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. అభ్యర్థుల వయస్సు 2025 ఆగస్ట్1వ తేదీ నాటికి 18 నుంచి 23 సంవత్సరాల వయస్సులో ఉండాలి. 2025 మార్చి 5వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాలు

1124 కానిస్టేబుల్/ డ్రైవర్

సీఐఎస్ఎఫ్‌లో 1124 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులతో నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో 845 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులు, కానిస్టేబుల్/ డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్ పోస్టులు 279 ఉన్నాయి. పదో తరగతితోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 4. దరఖాస్తు దాఖలు చివరి తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 21 నుంచి 27 మధ్యలో ఉండాలి. రెండు పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం https://cisfrectt.cisf.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

J N Tata Endowment Loan Scholarship

Description: The J N Tata Endowment (J N Tata Endowment Loan Scholarship for Fall 2025 to Spring 2026) invites loan scholarship applications from Indian students who wish to pursue higher studies overseas. Students who are selected for the loan scholarship may be recommended for a partial 'Travel Grant' and a 'Gift Award' which is linked to their academic performance in their overseas studies at the sole discretion of the Trustees of the concerned Trusts.

Eligibility: Open for Indian citizens who have completed at least one undergraduate degree OR students who are in the final year of any undergraduate programme at a recognised university/college/institution in India.

- Candidates must be interested in pursuing Post-graduate/Doctoral/Postdoctoral studies abroad.
- The course for which candidates are admitted must be recognized as a Graduate Program (post-graduate in Indian terminology).
- Candidates who did not get selected in the previous year/earlier for the J N Tata Endowment loan scholarship and candidates who could not avail of the loan scholarship when they were selected, are eligible to apply afresh.
- Candidates who are already pursuing post-graduate studies overseas may apply either at the end of their 1st st of studies or at the commencement of the 2 nd year, provided there is a minimum of one full academic year (12 months) remaining to be completed at the time of the loan scholarship award, typically in July of any calendar year.
- Candidates must have scored at least 60% marks on average in their undergraduate or post-graduate studies.
- Candidates must not be older than 45 years as on June 30, 2025.

Prizes & Rewards: Loan scholarship of upto Rs. 10 lakhs

Last Date: 07-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/JNT9

SCHOLARSHIP ALERT

NIT Rourkela Summer Internship

Description: The NIT Rourkela Summer Internship Programme 2025 is available for students pursuing undergraduation and master's degrees at the National Institute of Technology, Rourkela. It encourages students to undertake innovative research and development projects.

Eligibility: Applicants must be pursuing one of the following: B.E./B.Tech (4th semester exam completed), B.Arch/Integrated M.Sc./M.Tech/Dual degree (6th semester exam completed), or M.Sc./MA/MBA (2nd semester exam completed). A good academic record and marks/grade sheets of previous semesters shall be required. Applicants must remain available for internship from May 16 to July 15, 2025.

Prizes & Rewards: 7,500 per month and other benefits. ***Last Date:*** 10-03-2025

Application: Online only

Short Url: www.b4s.in/aj/NRSI1

buddy4study.com

చిత్రజ్యోతి
SINCE 1965

సినిమాలు తీయడం కంటే ఐఏఎస్ సాధించడం సులువు

\- సందీప్‌రెడ్డి వంగా



ప్రభాస్‌తో తెరకెక్కించనున్న 'స్పిరిట్' చిత్రం 'బాహుబలి' కలెక్షన్లను దాటి రూ.2000 కోట్ల వసూళ్లు సంపాదిస్తుందా లేదా అనేది నేను చెప్పలేను. కానీ ఓ వైవిధ్యమైన చిత్రాన్ని మాత్రం ప్రేక్షకులకు అందిస్తాను అని సందీప్ రెడ్డి వంగా అన్నారు. ఇటీవలె 'గేమ్ ఛేంజర్స్' అనే షోలో ఆయన పాల్గొన్నారు. ఇందులో పలు విషయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే, తన దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమాపై గతంలో మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి చేసిన విమర్శలను సందీప్ గుర్తుచేసుకున్నారు. "ఆ అధికారి చేసిన వ్యాఖ్యలు నాకింకా గుర్తున్నాయి. ఇలాంటి సినిమాలు తెరకెక్కించకూడదన్నది ఆయన ఉద్దేశం. 'యానిమల్' సమాజాన్ని పదేళ్లు వెనక్కితీసుకెళ్తుందని ఆయన విమర్శించారు. అవి నన్ను చాలా బాధించాయి. నేనేదో నేరం చేసినట్లు అనిపించింది. ఆయన అనవసరంగా నా సినిమాపై అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అనిపించింది. ఓ ఐఏఎస్ అధికారి కావాలంటే కోచింగ్ సెంటర్లకు వెళ్లి, కొన్నేళ్లపాటు శిక్షణ తీసుకుంటూ కష్టపడి చదివితే సరిపోతుంది. కానీ ఓ ఫిల్మ్‌మేకర్ లేదా రచయిత కావాలనుకుంటే సరైన మార్గదర్శకాలు ఇచ్చే టీచర్లు, కోర్సులు ఉండవు. ఓ ఫిల్మ్‌మేకర్ తనకు తానుగా అన్నీ నేర్చుకోవాలి. తన తపన, ఆసక్తి, అభిరుచి, కష్టంతోనే ముందుకు సాగాలి. ఈ విషయాన్ని కావాలంటే నేను పేపర్‌పై కూడా రాసి ఇస్తాను" అని పేర్కొన్నారు. కాగా, 'ట్వెల్త్ ఫెయిల్' సినిమాలో కీలక పాత్రలో నటించారు మాజీ ఐఏఎస్ అధికారి వికాస్ దివ్యకీర్తి. సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంలో 'ట్వెల్త్ ఫెయిల్' లాంటి సినిమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయనీ, 'యానిమల్' సినిమాలో సామాజిక విలువలు లోపించాయని విమర్శించారు.

కథ చెబితే బహుమానం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ హీరో, హీరోయిన్లుగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దిల్ రుబా'. సారెగమ సంస్థ, రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మాతలు. హోలీ పండుగ సందర్భంగా మార్చి 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఓ పోటీని ప్రకటించారు హీరో కిరణ్ అబ్బవరం.' దిల్ రూబా' చిత్రం కథను ముందుగానే ఊహించి చెప్పిన వాళ్లకు ఈ సినిమాలో హీరో నడిపిన ద్విచక్ర వాహనం బహుమతిగా అందజేస్తామన్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజేతకు ఈ బహుమతిని అందజేస్తారు.



స్మగ్లర్లలను హీరోలుగా చూపడం సరికాదు

\- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

'పాత సినిమాల్లో చివరకు హీరో చేతిలో విలన్ అంతమయ్యేవాడు. లేదంటే రాజమండ్రి సెంట్రల్ జైలుకెళ్లేవాడు. ఇప్పుడు నెగిటివ్ క్యారెక్టర్‌లను సైతం హీరోలుగా చూపిస్తున్నారు. స్మగ్లర్‌లు, దేశ ద్రోహులకు హీరోయిజాన్ని ఆపాదించడం సరికాదు. ఆ పాత్రల్లో హీరోలు గొప్పగా నటించినంత మాత్రాన వాటిని ఆదర్శంగా చూపించడం సమంజసం కాదు. ఈ తరం అర్థవంతమైన సినిమాలు తీయాలి. ప్రమాణాలు పాటించాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. సీనియర్ నటి కృష్ణవేణి సంస్మరణ సభను ఫిల్మ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. చలన చిత్ర నటిగా, నిర్మాతగా, నేపథ్య గాయనిగా, శోభనాచల స్టూడియో అధినేతగా కృష్ణవేణి తెలుగు సినిమా రంగంలో ఓ సువర్ణాధ్యాయం లిఖించారని ఆయన కొనియాడారు. 'మనదేశం' చిత్రంలో నందమూరి తారకరామారావును పరిచయం చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. అలాగే మీర్జాపురం రాజా, కృష్ణవేణి దంపతుల వల్లనే 'కీలుగుర్రం' చిత్రంతో అక్కినేని నాగేశ్వరరావుకి స్టార్ స్టేటస్ వచ్చిందని వెంకయ్య నాయుడు చెప్పారు. 'మా తండ్రిగారిని సినిమా రంగానికి పరిచయం చేసిన కృష్ణవేణమ్మ సంస్మరణ సభలో మేం కూడా భాగస్వాములైనందుకు గర్విస్తున్నాం' అని నందమూరి మోహన కృష్ణ, రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినేని రమేశ్ ప్రసాద్, మురళీ మోహన్, దావరుచూరి గోపాల కృష్ణ, నిర్మాతలు కె.ఎస్.రామారావు, కైకాల నాగేశ్వరరావు, తుమ్మల ప్రసన్న కుమార్, కాట్రగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మోగ్లీ పోరాటం



సందీప్ రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. అటవీ నేపథ్యంలో సాగే ఈ అందమైన ప్రేమకథలో సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రంపచోడవరం, మారేడుమిల్లి ఫారెస్ట్‌లో జరుగుతోంది. సినిమాకు ఆకర్షణగా నిలిచే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. 'మోగ్లీ 2025' ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాలభైరవ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ మారుతి ఎం.

ఇళయరాజా స్టూడియోలో సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదివారం భేటీ అయ్యారు. స్థానిక కోడంబాక్కంలోని ఇళయరాజా మ్యూజిక్ స్టూడియోకు వెళ్లిన స్టాలిన్.. ఆయనతో అరగంటపాటు సమావేశమయ్యారు. ఈ నెల 8వ తేదీన లండన్‌లో ఇళయరాజా సింఫనీ అరంగేట్రం జరుగనుండగా, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించేందుకు స్టాలిన్ వెళ్లినట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై సీఎం స్టాలిన్ కూడా తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ఆసియా ఖండంలోనే ఎవరూ చేయని ఘనతను ఈ నెల 8వ తేదీన లండన్‌లో సింఫనీ అరంగేంట్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు మన ప్రియమైన రాజా. తమిళనాడు గర్వించదగ్గ సంగీత విద్వాంసుణ్ణి అభినందించేందుకు స్వయంగా ఆయన స్టూడియోకు వెళ్లాను. ఆయన స్వయంగా చేతితో రాసిన 'వయలెంట్ సింఫనీ' సంగీత నోట్స్‌ను నాకు చూపించారు. ప్రపంచ తమిళ ప్రజల సంగీత శ్వాసగా మారిన ఇళయరాజా తలపెట్టిన ఈ సింఫనీ అరంగేట్రం విజయవంతంగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను' అని స్టాలిన్ ఆకాంక్షించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునే ప్రేమకథ



త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా మల్లి యేలూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జిగేల్'. డాక్టర్ వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సినిమాలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, ప్రేమకథ ఆకట్టుకుంటాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు, డీఓపీ: వాసు, సంగీతం: ఆనంద్ మంత్ర.



అవి డీప్‌ఫేక్ వీడియోలు

విద్యాబాలన్

నన్ను లక్ష్యంగా చేసుకొని రూపొందించిన పలు డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఉన్నది నేను కాదు, దయచేసి ఆ వీడియోలను వ్యాప్తి చేయవద్దు అని విద్యాబాలన్ నెటిజన్లను కోరారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ఓ వీడియో విడుదల చేశారు. "సోషల్‌మీడియాలో ఈ మధ్య నాకు సంబంధించిన పలు వీడియోలు ఎక్కువగా షేర్ అవుతున్నాయి. ఆ వీడియోలు నేను చేసినవి కావు. అవి డీప్ ఫేక్ ద్వారా సృష్టించినవి. దయచేసి వాటిలో చెప్పే విషయాలను నమ్మొద్దు. అవి మిమ్మల్ని తప్పుదోవ పట్టించే అవకాశముంది" అని పేర్కొన్నారు.



ముందుగానే మ్యాడ్‌స్క్వేర్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రల్లో కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. సూర్యదేవర నాగ వంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. 'మ్యాడ్' కి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఈనెల 29న విడుదల కావాల్సి ఉండగా, డిస్ట్రిబ్యూటర్ల కోరిక మేరకు ఒకరోజు ముందుగా మార్చి 28న రిలీజ్ చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. 'మార్చి 29న అమావాస్య కావడంతో మా పంపిణీదారులు చిత్రాన్ని ముందు రోజే విడుదల చేయాలని కోరారు. ఈ నిర్ణయం పట్ల మేము కూడా సంతోషంగా ఉన్నాం' అని నిర్మాత సూర్యదేవర నాగ వంశీ తెలిపారు.

మాస్‌ను మెప్పించే కథతో



మలయాళ హీరో ఆంటోనీ వర్గీస్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కట్టలన్'. 'మార్కో' చిత్రంతో నిర్మాతగా భారీ విజయాన్ని అందుకున్న షరీఫ్ నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌కు పాల్ జార్జ్ దర్శకుడు. ఆదివారం చిత్రబృందం ఆంటోనీ వర్గీస్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గంభీరమైన లుక్‌లో వర్గీస్ కనిపించారు. మాస్‌ను ఆకట్టుకునే అంశాలతో పాటు యాక్షన్ పార్ట్ ఈ సినిమాకు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని యూనిట్ తెలిపింది.

విభిన్నతరహా చిత్రం



ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య ద్వయం దర్శకత్వం వహిస్తుండగా, ఆర్.యు. రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. సంగీత దర్శకుడు ఆర్.పి పట్నాయక్ క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రసన్నకుమార్. టి, వంశీ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు వీరశంకర్, నిర్మాత నవీన్ యెర్నేని స్క్రిప్టును అందజేశారు. సినిమా విభిన్న తరహాలో ఉండబోతోందని మేకర్స్ తెలిపారు.

మజ్జిగతో ప్రయోజనాలెన్నో!

వేసవి కాలంలో తరచూ దాహంగా అనిపిస్తూ ఉంటుంది. ఇలాంటప్పుడు చల్లని మజ్జిగ తాగడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు.

- ఒక గ్లాసు పలుచని మజ్జిగలో చిటికెడు ఉప్పు వేసుకుని తాగితే శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. వడదెబ్బ తగలదు. జీర్ణాశయ సమస్యలు రావు.
- ఒక గ్లాసు మజ్జిగలో చిటికెడు జీలకర్ర పొడి కలుపుకుని తాగితే జీర్ణక్రియ వేగవంతమవుతుంది. పొట్టలో గ్యాస్ సమస్యలు రావు.
- ఒక కప్పు పెరుగులో ఒకటిన్నర కప్పుల నీళ్లు, అరచెంచా జీలకర్ర పొడి, అర చెంచా అల్లం తరుగు, చిటికెడు ఉప్పు, ఒక చెంచా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి పావుగంటసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ మసాలా మజ్జిగను మధ్యాహ్న సమయంలో తాగితే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎండ వేడి వల్ల వచ్చే తలనొప్పి తగ్గుతుంది. మలబద్దకం రాదు.



- ఒక గ్లాసు మజ్జిగలో పావు చెంచా మిరియాల పొడి, పావు చెంచా శొంఠి పొడి వేసుకుని తాగితే కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది.
- తరచూ మజ్జిగ తాగుతూ ఉంటే చర్మం తేమగా కనిపిస్తుంది. మజ్జిగలోని ప్రోబయోటిక్స్ చర్మ సంబంధిత సమస్యలు రాకుండా చేస్తాయి.
- మజ్జిగలో పొటాషియం, కాల్షియం, ప్రోటీన్, లాక్టిక్ యాసిడ్, ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలు అధికంగా ఉంటాయి. మజ్జిగను ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. ఆస్టియోపోరోసిస్ సమస్యలు రావు. తక్షణ శక్తి లభిస్తుంది.
- ప్రతిరోజూ భోజనం చేసిన గంట తరవాత ఒక గ్లాసు నీళ్ల మజ్జిగ తాగితే అజీర్ణ సమస్యలు రావు.

మెడ నలుపు వదలాలంటే...

కొంతమందికి ముఖమంతా మంచి ఛాయతో ఉన్నప్పటికీ మెడ భాగం మాత్రం నల్లగా మారి ఇబ్బంది పెడుతూ ఉంటుంది. దీనికి హార్మోన్ల అసమతౌల్యం, పిగ్మెంటేషన్ కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో దొరికే వస్తువులతోనే చిన్న చిట్కాలు పాటించి ఈ సమస్య నుంచి బయటపడవచ్చని సూచిస్తున్నారు.

- ఒక గిన్నెలో అయిదు చెంచాల పెరుగు, రెండు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుంటూ మెడ మీద రాయాలి. పది నిమిషాలు సున్నితంగా మర్దన చేయాలి. అయిదు నిమిషాలు ఆరాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తూ ఉంటే మెడ నలుపు క్రమంగా తగ్గుతుంది.
- రెండు చెంచాల నిమ్మరసంలో ఒక చెంచా గులాబీ నీళ్లు కలిపి ఈ మిశ్రమాన్ని దూది సహాయంతో మెడకి పట్టించాలి. పావుగంటసేపు ఆరనివ్వాలి. ఈ సమయంలో మెడకి ఎండ తగలకుండా చూసుకోవాలి. తరవాత రెండు నిమిషాలు మెడమీద సున్నితంగా రుద్ది నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. నిమ్మరసం... బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి మెడమీద పేరుకున్న మృతకణాలు, మురికిని తొలగించి నలుపుదనాన్ని పోగొడుతుంది.
- బాదం నూనె లేదా కొబ్బరి నూనెను కొద్దిగా వేడిచేసి మెడకి పట్టించాలి. వేళ్లతో పది నిమిషాలు మర్దన చేయాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే మెడ మీద రక్తప్రసరణ జరిగి నలుపుదనం తగ్గిపోతుంది. ఈ విధంగా ఆలివ్ నూనెతో చేసినా మంచి ప్రయోజనం కనిపిస్తుంది
- ఒక గిన్నెలో ఒక చెంచా శనగపిండి, పావు చెంచా పసుపు, మూడు చెంచాల గులాబీ నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ పేస్టుని మెడ మీద రాసి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో స్నానం చేస్తే మెడ నలుపుదనం తగ్గుతుంది.
- ఇలా ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించని పక్షంలో డెర్మటాలజిస్టును సంప్రతించాలి.





స్వస్థత అందిస్తూ...
సాంత్వన కలిగిస్తూ..!

డాక్టర్ సుజాత గుత్తాల... విశాఖ స్టీల్ ప్లాంటు జనరల్ ఆసుపత్రిలో గైనకాలజీ విభాగం ఇన్‌చార్జ్... చీఫ్ స్పెషలిస్టు డాక్టర్. కానీ ఆమె కేవలం ఒక వైద్యురాలిగా ఆసుపత్రికే పరిమితం కాలేదు. సామాజిక కార్యకర్తగా పరిసర గ్రామాలకు వెళ్లి... వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. యుక్తవయసు పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి... వారిలో మానసిక, భయాందోళనలు పోగొడుతున్నారు. ఉత్తమ వైద్యురాలిగా ఇటీవల 'ప్రభుత్వరంగ సంస్థల మహిళా ఉద్యోగుల వేదిక' (విప్స్) జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ సుజాతను 'నవ్య' పలుకరించింది.

"విశాఖ స్టీల్ జనరల్ ఆస్పత్రిలో రెండు దశాబ్దాలుగా నేను సేవలు అందిస్తున్నాను. ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రికి హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేకమంది వస్తుంటారు. వీరిలో ప్రముఖులూ ఉన్నారు. ముఖ్యంగా కాన్పుల కోసం వచ్చేవారు అధికం. ఆసుపత్రి గైనకాలజీ విభాగం ఇన్‌చార్జిగా, చీఫ్ స్పెషలిస్టు డాక్టర్‌గా నాపై విశ్వాసమే వారిని ఇక్కడవరకు రప్పిస్తోందని అనుకొంటున్నా. ఇక్కడ నామమాత్రపు ఫీజుతో బయటి రోగులకు వైద్య సేవలు అందిస్తాం. ఏడాదికి 350 నుంచి 400 మేజర్ ఆపరేషన్లు, మరో 450 వరకు మైనర్ ఆపరేషన్లు చేస్తున్నా. వీటివల్ల ఆసుపత్రి ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. గత ఏడాది ఒక్క గైనకాలజీ విభాగం నుంచే రూ.30 లక్షలు సమకూరింది. కుట్లు లేకుండా హిస్టరెక్టమీ ఆపరేషన్ చేయడం ఇక్కడి ప్రత్యేకత. అలాగే పెద్ద పెద్ద ఫైబ్రాయిడ్లు ఉన్నా కుట్లు వేయకుండా ఆపరేషన్ చేస్తాం. పిల్లలు లేని దంపతులకు కూడా చికిత్స అందిస్తున్నాను. చికిత్స ఫలించి, ఇప్పటికి యాభైకి పైగా జంటలకు సంతాన ప్రాప్తి కలిగింది. ఆసుపత్రిలో ఉన్న పరిమిత వనరులతోనే ఇవన్నీ చేయగలుగుతున్నాం.

సామాజిక సేవ...

ఆసుపత్రిలో వైద్యం ఒక్కటే కాదు... ఖాళీ ఉన్నా లేకపోయినా సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా కొంత సమయం కేటాయిస్తాను. స్టీల్‌ప్లాంటు పరిసర ప్రాంతాల్లో మహిళలు, యువతకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నాను. యుక్తవయసు పిల్లల్లో మానసిక ఒత్తిడి, భయాందోళనలు పోగొట్టేందుకు కౌన్సెలింగ్ ఇస్తున్నాను. వీలు చూసుకొని పరిసర గ్రామాలు, విద్యా సంస్థలకు వెళ్లి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, జీవన విధానం, పౌష్టికాహారం, భద్రత, సామాజిక బాధ్యతల గురించి వివరించి చెబుతున్నాను.

కొవిడ్ పాజిటివ్ గర్భిణికి సర్జరీ...

కరోనా సమయంలో రోగులకు సాధారణ వైద్యం అందించడానికి చాలామంది డాక్టర్లు భయపడేవారు. కాన్పులు చేయడానికి అంగీకరించేవారు కాదు. ఇది నన్ను కలవరపెట్టింది. ఆ సమయంలో నిండు గర్భిణి డెలివరీ కోసం నా వద్దకు వచ్చింది. ఆమెకు కొవిడ్ పాజిటివ్. కానీ నేను వెనకడుగు వేయలేదు. సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశాను. తరువాత తెలిసింది... తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్‌లో సిజేరియన్ చేసిన తొలి వైద్యురాలిని నేనేనని. వైద్య వృత్తితో పాటు పరిశోధనలు కూడా కొనసాగిస్తున్నాను. గైనకాలజీకి సంబంధించి అనేక సమస్యలపై పరిశోధనా పత్రాలు సమర్పించాను. ఈ క్రమంలో పలు అవార్డులు కూడా అందుకున్నాను.

సమస్యను తెలుసుకొని...

నన్ను నమ్మి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే నా లక్ష్యం. బాధతో వచ్చినవారిని తిరిగి చిరునవ్వుతో పంపించడానికి నా శక్తిమేరకు ప్రయత్నిస్తా. ఆస్పత్రికి వచ్చేవారితో నవ్వుతూ మాట్లాడటం, సమస్యను పూర్తిగా తెలుసుకొని సరైన చికిత్స అందించడం... ఇదే నాకు తెలిసిన వైద్యం. అందుకే నన్ను వెతుక్కొంటూ ఇంతమంది పేషెంట్లు వస్తున్నారని అనుకొంటున్నా. అంతేకాదు... సహోద్యోగులతో కలివిడిగా ఉంటూ, ఏ కార్యక్రమం నిర్వహించినా ఉత్సాహంగా పాల్గొంటాను. కార్యక్రమం విజయవంతం చేయడానికి నావంతు కృషి చేస్తాను. బహుశా అందుకేనేమో నన్ను అందరూ అభిమానిస్తారు. నా ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నాను. మరింతమందికి అత్యుత్తమ వైద్య సేవలు అందించి, అందరి ఆదరాభిమానాలకు పాత్రురాలిని కావాలని కోరుకొంటున్నాను."

సేవకు పురస్కారం...

'ప్రభుత్వ రంగ సంస్థల మహిళా ఉద్యోగుల వేదిక (విప్స్) ఇటీవల న్యూఢిల్లీలో జాతీయ సమ్మేళనం నిర్వహించింది. అందులో నాకు ఉత్తమ వైద్యురాలిగా ఎగ్జిక్యూటివ్ విభాగంలో జాతీయ అవార్డు లభించింది. నా సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.



• యర్రా శ్రీనివాసరావు, విశాఖపట్నం

ప్రకృతి రత్నం!

జలచరాలపై ఉన్న ఇష్టాన్ని వాటిని పరిరక్షించే బాధ్యతగా మార్చుకున్నారు అరుణిమ సింగ్. పధ్నాలుగేళ్లలో 35 వేలకు పైగా తాబేళ్లను, ఇతర సముద్ర జీవులను కాపాడారు, అక్రమ తరలింపును అడ్డుకున్నారు. వాటి సంరక్షణ ఆవశ్యకతపై 50 వేల మందికి పైగా పిల్లలకు అవగాహన కల్పించారు. తోటి ప్రాణుల పట్ల క్రూరత్వం, నిర్లక్ష్యం మనకే ముప్పు తెస్తాయంటున్న 39 ఏళ్ల అరుణిమ కృషి గురించి ఆమె మాటల్లోనే...

"మాది ఉత్తరప్రదేశ్‌లోని లఖనవూ. గోమతీ నది మా నగరంలోంచి పారుతూ ఉంటుంది. మా తాతయ్యకు రోజూ సాయంత్రం నదీ తీరానికి వెళ్లడం అలవాటు. నేను బడి నుంచి రాగానే... ఆయనతో కలిసి వెళ్లడానికి సిద్ధమైపోయేదాన్ని. నదుల గురించి, సముద్రాల గురించి, వాటిలో ఉండే వైవిధ్యమైన జీవుల గురించి ఆయన ఎన్నో సంగతులు చెప్పేవారు. జంతువులంటే నాకు చాలా ఇష్టం. జలచరాలంటే ప్రత్యేకమైన ఆసక్తి. అందుకే ఎమ్మెస్సీ లైఫ్ సైన్స్ చేశాను. ఒక ప్రాజెక్టులో భాగంగా.. 'టర్టిల్ సర్వైవల్ అలయన్స్' (టిఎస్ఎ) ఇండియా విభాగానికి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శైలేంద్ర సింగ్‌ను కలుసుకున్నాను. ప్రపంచవ్యాప్తంగా తాబేళ్లు అంతరించిపోయే ముప్పు ఎదుర్కొంటున్నాయనీ, వాటిని కాపాడుకోవాలనీ ఆయన చెబుతూ... ఆ దిశగా నన్ను ప్రోత్సహించారు. అంతరించే జీవ జాతుల కోసం పాటుపడుతున్న 'కుక్రైల్ ఘరియల్ పునరావాస కేంద్రా'న్ని సందర్శించాల్సిందిగా సూచించారు. ఆ కేంద్రంలో చేపడుతున్న కార్యక్రమాలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. అక్కడ కొన్నాళ్ళు స్వచ్ఛందంగా పని చేశాను. ఆ తరువాత 'టిఎస్ఎ'లో రిసెర్చ్ అసిస్టెంట్‌గా చేరాను. దాంతో తాబేళ్ల పరిరక్షణే నా జీవితంగా మారిపోయింది. ఆ తరువాత టర్టిల్ ఎకాలజీలో పిహెచ్‌డి కూడా చేశాను.



దాడులు, బెదిరింపులు

తాబేళ్లకు ముప్పులు అనేక రూపాల్లో ఉంటాయి. వాటిలో ప్రధానమైనది అక్రమ రవాణా. సముద్ర, నదీ తీరాల నుంచి వాటిని సేకరించి, అక్రమ రవాణా చేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ముఠాలకు అడ్డుకట్ట వేయడం కోసం బృందాలుగా ఏర్పడి, నిఘా వేసేవాళ్లం. తాబేళ్లను తరలించే ప్రయత్నాలను నిరోధించే ప్రయత్నంలో మామీద దాడులు కూడా జరిగాయి. కొందరు స్మగ్లర్లు బెదిరించారు కూడా. కానీ వేటికీ భయపడలేదు. 2017లో... అమేఠీ నుంచి తరలిస్తున్న 6,400 తాబేళ్లను పోలీసుల సాయంతో పట్టుకోగలిగాం. వాటి సంఖ్య చూసి మాకు మతిపోయినట్టయింది. హింసా ప్రవృత్తితో తాబేళ్లకు హాని చేసేవారు, గాయపడి తీరానికి చేరుకున్న తాబేళ్లను పట్టించుకోకపోగా వాటిని తరిమికొట్టేవారు ఉంటారు. ఇటువంటి సందర్భాల్లో ఆ తాబేళ్లకు ఎలా సాయం చెయ్యాలనే సంగతి చాలామందికి తెలీదు. ఈ పరిస్థితిని మార్చాలనే ఆలోచనతో... ఉత్తరప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అటవీ సిబ్బందికి, పోలీసులకు, స్థానికంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, మత్స్యకారులకు శిక్షణ ఇచ్చాం. దానివల్ల మంచి ఫలితాలు కనిపించాయి.

తాబేళ్ల కోసం కాలనీలు...

జలచరాలు అంతరించిపోవడానికి మరో ముఖ్య కారణం... వాటి ఆవాసాలను కోల్పోవడం. సముద్రాలు, నదుల్లో కాలుష్యం, మితిమీరిన వేట కారణంగా అవి నివసించే ప్రదేశాల పరిధి తగ్గిపోవడం లేదా ప్రమాదకరంగా మారడం జరుగుతోంది. వాటి సంఖ్య పెరగడానికి, ప్రమాదరహితంగా జీవించడానికి సురక్షితమైన ప్రదేశాలు అవసరం. ఈ నేపథ్యంలో అపురూపమైన 13 జాతుల తాబేళ్ల కోసం 'అస్యూరెన్స్ కాలనీ'లను, అంతరించే ముప్పులో ఉన్న ఎనిమిది జాతుల కోసం సంతానోత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశాం. తద్వారా ముప్పైకి పైగా కుటుంబాలకు ఉపాధి కూడా కల్పించాం. నా కార్యక్రమాలు కేవలం తాబేళ్లకే పరిమితం కాదు. మొసళ్ళు, గంగానదిలోని డాల్ఫిన్ల పరిరక్షణ కోసం కూడా కృషి చేస్తున్నాను. దీనికోసం ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నాను. ఒకసారి లఖనవూలోని భారీ వర్షాలు పడిన సమయంలో... ఒక ఇంట్లోకి మొసలి ప్రవేశించింది. ఈ సమాచారం తెలియగానే నేను అక్కడికి చేరుకున్నాను. దాదాపు ఏడు అడుగులున్న ఆ మొసలిని వరదనీటిలో నియంత్రించడం అంత సులభం కాదు. అయిదుగంటల సేపు ప్రయత్నించిన తరువాత... నేను, నా బృందం దాన్ని పట్టుకొని, అటవీ శాఖవారికి అప్పగించాం. ఈ సంఘటన మా ఇంట్లో చెబితే... "చిన్నప్పుడు బల్లి అంటే ఎంతో భయపడేదానివి. మొసలి కూడా చాలా రెట్లు పెద్దదైన బల్లిలాగానే ఉంటుంది కదా! ఇప్పుడు భయం పోయిందా?" అన్నారు. "నేను పర్యావరణంతో మమేకమై, జంతువులతో పని చేస్తున్నాను. ఇప్పుడు వాటి పట్ల ప్రేమ తప్ప భయం లేదు" అని చెప్పాను. కొన్నిసార్లు జంతువులు దాడి చేయడం, కరవడం కూడా చేశాయి. కానీ బెదిరి పారిపోలేదు. ఎందుకంటే... అవి ఆత్మరక్షణ కోసమే అలా చేస్తాయి.



అది మన కర్తవ్యం

ఇప్పుడు 'టిఎస్ఎ ఇండియా'లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాను. నా నేతృత్వంలో ఇప్పటివరకూ 35 వేలకు పైగా తాబేళ్ళు, మొసళ్ళు, డాల్ఫిన్‌లను స్మగ్లర్ల నుంచి, హానికరమైన పరిస్థితుల నుంచి కాపాడి, చికిత్స, పునరావాసం కల్పించాం. ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు ఎన్ని ప్రయత్నాలు చేసినా... ప్రజల్లో చైతన్యంతోనే గొప్ప ఫలితాలు వస్తాయి. భవిష్యత్ తరాలకు కూడా ఇది తెలియాలి. అందుకే పాఠశాలల్లో, కళాశాలల్లో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకూ యాభై వేలమందికి పైగా పిల్లలకు అవగాహన కల్పించాం. అలాగే దేశంలో పలు ప్రాంతాల్లో వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. పలు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని చేపట్టిన ఈ కార్యక్రమాలకు గుర్తింపుగా 'నాట్ వెస్ట్‌గ్రూప్' నుంచి 'ఎర్త్ హీరోస్' (సేవ్ ది స్పెసెస్) అవార్డును, 'ప్రకృతి రత్న'తో సహా అనేక పురస్కారాలు, గౌరవాలు లభించాయి. నేను సమాజానికి చెప్పేది ఒక్కటే.. తోటి జీవజాతుల పట్ల నిర్లక్ష్యం, క్రూరత్వం, వాటిని అమ్ముకొని లాభం పొందాలనే స్వార్థం లాంటివి పర్యావరణ వ్యవస్థకు, అంతిమంగా మానవులమైన మనకు చేటు తెస్తాయి. కాబట్టి అటువంటి చర్యలను మానుకోవడం, అరుదైన జీవులు అంతరించిపోకుండా కాపాడుకోవడం మన కర్తవ్యం కావాలి. అందరిలో ఆ కర్తవ్య స్ఫూర్తి నింపడమే నా లక్ష్యం.".

ఈ కమ్మలు చిన్నారులకు ప్రత్యేకం!

చిన్నారి పాపల చెవులు చాలా సున్నితంగా ఉంటాయి. కాబట్టి కేవలం ఒకటి లేదా రెండు గ్రాముల బంగారంతో చేసిన కమ్మలను పెట్టడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. చిన్నారుల కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న ట్రెండీ బంగారు కమ్మలు ఇవే..

పూల కమ్మలు



ఇవి రకరకాల పూల ఆకారాల్లో లభ్యమవుతున్నాయి. మూడు, అయిదు, తొమ్మిది రెక్కలతోపాటు చిన్న కాండం ఉండేలా వీటిని రూపొందిస్తున్నారు. ఇవి రెండు జడలు వేసుకునే ఆడ పిల్లలకు ప్రత్యేకమైన శోభనిస్తాయి.



బంతి కమ్మలు

ఇవి గుండ్రంగా ఒక బంతి ఆకారంలో ఉంటాయి. మధ్యలో సీజెడ్, పచ్చ, కెంపు, వజ్రం, నీలం, పగడం, ముత్యంలలో ఒక దాన్ని అమరుస్తారు. పాపకి ఎలాంటి దుస్తులు వేసినా వాటిపై స్టయిలిష్‌గా కనిపిస్తాయి ఈ కమ్మలు.

హార్ట్ కమ్మలు



ఇవి హృదయాకారంలో కనిపిస్తుంటాయి. వీటి మీద సీజెడ్‌లు పొదిగి అందంగా రూపొందిస్తున్నారు. వీటిని చెవులకు పెడితే చిన్నారి సొగసు పెరుగుతుంది. బాబ్ కట్ చేయించుకుని చక్కని టాప్ లేదా అందమైన గౌన్ వేసుకుంటే ఈ కమ్మలు ప్రత్యేకంగా కనిపిస్తాయి.



బట్టర్‌ఫ్లై కమ్మలు

ఇవి పేరుకు తగ్గట్టు సీతాకోకచిలుక ఆకారంలో ఉంటాయి. వీటికి ముత్యాలు, రంగురంగుల రాళ్లు అమర్చి రకరకాల డిజైన్లలో రూపొందిస్తున్నారు. ఇవి సింపుల్‌గా, గ్రాండ్‌గా కూడా లభ్యమవుతున్నాయి.

గులాబీ కమ్మలు



ఇవి చిన్న సైజ్‌లో ఉండే బంగారు గులాబీల్లా కనిపిస్తాయి. వీటిని చెవులకు పెడితే చిన్నారి ముఖ వర్చస్సు అందంగా ప్రకాశిస్తుంది. ఎటువంటి డ్రెస్ మీదనైనా చక్కగా నప్పుతాయి.



డాల్ఫిన్ కమ్మలు

ఇవి ఒంపు తిరిగిన చిన్న డాల్ఫిన్ ఆకారంలో మెరుస్తూ ఉంటాయి. కన్ను దగ్గర నల్లని రాయిని అమరుస్తారు. వీటిని చిన్నారులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

ఇల్లు అందంగా కనిపించాలంటే...



ఇల్లు అందంగా కనిపించాలని అందరూ కోరుకుంటారు. చిన్న చిట్కాలు పాటిస్తూ ఇంటిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- ప్రస్తుతం హాల్, డ్రాయింగ్ రూమ్, లివింగ్ రూమ్ గోడల మీద కళాత్మక చిత్రాలను పెయింట్ చేయించుకోవడాన్ని అందరూ ఇష్టపడుతున్నారు. వీటివల్ల గదికి రిచ్ లుక్ వస్తుంది. సరసమైన ధరకే రంగురంగుల చిత్రాలు అందుబాటులో ఉంటున్నాయి. చక్కని ప్రకృతి, జంతువులు, పక్షుల చిత్రాలు ఉన్న ఫొటోఫ్రేమ్‌లను అక్కడక్కడ ఏర్పాటు చేసినా ఇల్లు కళగా కనిపిస్తుంది.
- వ్యక్తిగత ఫొటోలతో గోడలను నింపేయకూడదు. ఇంట్లో ఒక గోడను ఎంపిక చేసుకుని అక్కడ మాత్రమే కుటుంబ సభ్యుల ఫొటోలు పెడితే బాగుంటుంది.
- హాల్‌లో కిటికీలకు కాంట్రాస్ట్ కలర్ కర్టెన్లు వేస్తే క్లాసీ లుక్ వస్తుంది. కట్టుకోని చీరలు ఉంటే వాటితో కూడా అందమైన కర్టెన్లు రూపొందించవచ్చు. ఫ్లోరల్ ప్రింట్స్ ఉన్న చీరలు అయితే ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
- గది మూలల్లో మొక్కల కుండీలు పెడితే చూడడానికి బాగుంటుంది. కృత్రిమ మొక్కలు, తీగలు, పువ్వులతో కూడా ఇంటిని అలంకరించుకోవచ్చు.
- ఇంట్లో సోఫా లేని పక్షంలో నేలపై మందపాటి పరుపు వేసి అందమైన కుషన్‌లు అమరిస్తే హాల్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.
- డ్రాయింగ్ రూమ్, డైనింగ్ రూమ్‌లలో దీర్ఘచతురస్రాకారపు కార్పెట్ వేస్తే ఇంటికి గ్రాండ్ లుక్ వస్తుంది.
- హాల్‌లో ఉండే సింక్‌కు జతగా అద్దం, హ్యాండ్‌వాష్, చిన్న టవల్ లాంటివి పెట్టుకుంటే ఇంటికి డీసెంట్ లుక్ వస్తుంది.

కారంలో కల్తీని ఇలా గుర్తించండి..!

వంటకాల్లో కల్తీ చేసిన కారం పొడిని ఉపయోగిస్తే జీర్ణాశయ సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. కల్తీని గుర్తించే చిన్న చిట్కాలను ఇలా సూచిస్తున్నారు.

- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా కారం పొడి వేసి బాగా కలపాలి. స్వచ్ఛమైన కారం నీటిలో కరగదు. అది నీటిపై తేలుతూ ఉంటుంది. ఒక నిమిషం తరవాత గ్లాసు అడుగు భాగాన్ని పరిశీలించాలి. అక్కడ ఎర్రని పొడి చేరి ఉంటే దాన్ని వేళ్లతో తీసుకుని అర చేతిలో వేసుకుని గట్టి రుద్దాలి. గరుకుగా తగిలితే ఇటుక పొడి కలిపినట్లు గుర్తించవచ్చు. గ్లాసు అడుగున మెత్తని తెలుపు రంగు పదార్థం చేరితే సోప్ స్టోన్ పొడి కలిపినట్లు చెప్పవచ్చు. గ్లాసులోని నీళ్ల మరీ ఎర్రగా మారితే ఎరుపు రంగు కలిపినట్లు తెలుసుకోవచ్చు.



- వెడల్పాటి పళ్లెంలో ఒక చెంచా కారం పొడి వేయాలి. ఇందులో మూడు చుక్కల టింక్చర్ అయోడిన్ వేసి చెంచాతో కలపాలి. కారం పొడి నీలం రంగులోకి మారితే అందులో గంజి పొడి లేదా ఏదైనా పిండి కలిపినట్లు గుర్తించవచ్చు.

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 3 మార్చి 2025

డబ్ల్యూపీఎల్‌లో నేడు యూపీ x గుజరాత్ రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



చిలీ ఓపెన్ విజేత రిత్విక్ జోడీ

న్యూఢిల్లీ: తెలుగు ఆటగాడు రిత్విక్ చౌదరి బొల్లిపల్లి మరోసారి అంతర్జాతీయస్థాయిలో అదరగొట్టాడు. ఈ హైదరాబాద్ కుర్రాడు.. కొలంబియాకు చెందిన నికోలస్ బరింటోస్‌తో కలిసి చిలీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో డబుల్స్ విజేతగా నిలిచాడు. చిలీలోని శాంటియాగోలో ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో అన్‌సీడెడ్ ద్వయం రిత్విక్/నికోలస్ 6-3, 6-2తో టాప్‌సీడ్, అర్జెంటీనా జంట మాగ్జిమో గొంజాలెజ్/ఆండ్రెస్ మోల్టెనికి షాకిచ్చింది. రిత్విక్‌కు ఇది కెరీర్‌లో రెండో ఏటీపీ టైటిల్ కావడం విశేషం. ఈ ప్రదర్శనతో రిత్విక్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 66వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు.

యుకీకి దుబాయ్ టైటిల్

దుబాయ్: భారత స్టార్ యుకీ భాంబ్రీ దుబాయ్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పురుషుల డబుల్స్ విజేతగా నిలిచాడు. ఇక్కడ జరిగిన ఫైనల్లో యుకీ/అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) జోడీ 3-6, 7-6, 10-8తో ప్రపంచ 14వ ర్యాంకర్ హ్యారీ (ఫిన్లాండ్)/హెన్రీ (బ్రిటన్) జంటను ఓడించి టైటిల్ అందుకుంది. యుకీకిది కెరీర్‌లో తొలి ఏటీపీ 500 టైటిల్. ఈ విజయంతో యుకీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 40వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు.

అగ్రస్థానంలో ప్రజ్ఞానంద, అరవింద్

ప్రేగ్: ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్ మాస్టర్స్ విభాగం ఐదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఆర్. ప్రజ్ఞానంద, అరవింద్ చిదంబరం మధ్య జరిగిన గేమ్ డ్రా అయ్యింది. ఆదివారం జరిగిన ఈ గేమ్‌ను 59 ఎత్తుల అనంతరం డ్రాగా ముగించేందుకు ఇరువురు ఆటగాళ్లు అంగీకరించారు. ఐదో రౌండ్ అనంతరం ప్రజ్ఞానంద, అరవింద్ చెరో 3.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

కివీస్‌నూ పడగొట్టి.. అజేయంగా నిలిచి..

ఆసీస్‌తో నాకౌట్‌కు భారత్ సై

సెమీస్‌లో ఎవరితో ఎవరు?

మార్చి 4	భారత్ x ఆస్ట్రేలియా	దుబాయ్
మార్చి 5	న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	లాహోర్



వరుణ్ (5/42)

2 చాంపియన్స్ ట్రోఫీలో భారత్ నుంచి ఉత్తమ బౌలింగ్ (5/42) కనబర్చిన రెండో బౌలర్‌గా వరుణ్. జడేజా (5/36) ముందున్నాడు.

చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా గ్రూప్ దశను అజేయంగా ముగించింది. స్లో పిచ్‌పై న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి భారత్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైనా.. నలుగురితో కూడిన స్పిన్ దళం జట్టుకు ఆసరాగా నిలిచింది. కెరీర్‌లో రెండో వన్డే ఆడిన వరుణ్ చక్రవర్తి మ్యాజిక్ బంతులకు కేన్ విలియమ్సన్ మినహా కివీస్ బ్యాటింగ్ లైనప్ కకావికలమైంది. ఫలితంగా హ్యాట్రిక్ విజయంతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలిచిన భారత్.. ఆస్ట్రేలియాతో సెమీస్ పోరుకు సిద్ధమైంది.



శ్రేయాస్ (79)

1 చాంపియన్స్ ట్రోఫీ ఇన్నింగ్స్‌లో స్పిన్నర్లు 9 వికెట్లు తీయడం ఇదే తొలిసారి.

వన్డేల్లో అత్యధికంగా వరుస (13) టాస్‌లు కోల్పోయిన జట్టుగా భారత్. ఇందులో రోహిత్ కెప్టెన్సీలోనే పదిసార్లు ఈ ఫీట్ నమోదైంది.

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వేటలో భారత వన్డే జట్టు అదరగొడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణిస్తూ ప్రత్యర్థుల పనిబడుతున్న రోహిత్ సేన ఆదివారం న్యూజిలాండ్‌ను 44 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో గ్రూప్ 'ఎ'లో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారత్.. ఈనెల 4న జరిగే తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 249 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (79), హార్దిక్ పాండ్యా (45), అక్షర్ పటేల్ (42) రాణించారు. హెన్రీ 5 వికెట్లు తీశాడు. ఛేదనలో కివీస్ 45.3 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. కేన్ విలియమ్సన్ (81) ఒంటరి పోరాటం చేయగా, శాంట్నర్ (28) చివర్లో ఫర్వాలేదనిపించాడు. పేసర్ హర్షిత్ స్థానంలో జట్టులోకి వచ్చిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (5/42) ఐదు వికెట్లతో భేష్ అనిపించాడు. కుల్దీప్ (2/56)కు రెండు వికెట్లు దక్కాయి. వరుణ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.



విలియమ్సన్ (81)

కేన్ మినహా..: మందకొడిగా మారిన పిచ్‌పై 250 పరుగుల ఛేదన కివీస్‌కు సవాల్‌గా మారింది. కేన్ విలియమ్సన్ మాత్రమే భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. మిగతా బ్యాటర్ల నుంచి అతడికి పెద్దగా సహకారం అందలేదు. నాలుగో ఓవర్‌లోనే ఓపెనర్ రచిన్ (6)ను హార్దిక్ అవుట్ చేశాడు. ఆ తర్వాత కేన్ జాగ్రత్తగా ఆడుతూ ఓపెనర్ యంగ్‌తో రెండో వికెట్‌కు 32, మిచెల్ (17)తో మూడో వికెట్‌కు 44, లాథమ్ (14)తో కలిసి నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించాడు. ఈక్రమంలో తను అర్ధసెంచరీ కూడా పూర్తి చేశాడు. అయితే మధ్య ఓవర్లలో స్పిన్నర్లు ఆధిపత్యం చూపారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ వచ్చింది. దీనికితోడు 36వ ఓవర్‌లో హిట్టర్ ఫిలిప్స్ (12), బ్రేస్‌వెల్ (2)లను వరుణ్ అవుట్ చేయడంతో కివీస్ 159/6తో ఒత్తిడిలో పడింది. ఇక ఓపిగ్గా క్రీజులో నిలిచిన విలియమ్సన్ వికెట్‌ను అక్షర్ తీయడంతో ప్రత్యర్థి ఆశలు వదులుకుంది. వరుణ్ టెయిలెండర్ల పనిబట్టడంతో మరో 4.3 ఓవర్లుండగానే మ్యాచ్ ముగిసింది.

శ్రేయాస్-అక్షర్ జోడీ నిలకడ: టాస్ కోల్పోయిన భారత్ తొలిసారి బ్యాటింగ్‌కు దిగింది. అయితే పవర్‌ప్లేలోనే ఓపెనర్లు గిల్ (2), రోహిత్ (15), విరాట్ (11) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో శ్రేయాస్-అక్షర్ జోడీ ఆదుకోగా.. చివర్లో హార్దిక్ వేగం ఓ మాదిరి స్కోరుకు కారణమైంది. ఫామ్‌లో ఉన్న గిల్‌ను మూడో ఓవర్‌లోనే హెన్రీ ఎల్బీ చేశాడు. రోహిత్, విరాట్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేరడంతో భారత్ 30/3 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. కానీ శ్రేయాస్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తనకు మరో ఎండ్ నుంచి అక్షర్ అద్భుత సహకారం అందించాడు. పిచ్ నెమ్మదిగా మారడంతో వికెట్‌ను చేజారనీయకుండా ఈ జోడీ 8 ఓవర్లపాటు సింగిల్స్‌కే పరిమితమైంది. 17వ ఓవర్‌లో శ్రేయాస్ షార్ట్ పిచ్ బంతులను హ్యాట్రిక్ ఫోర్లుగా మలిచి స్కోరులో కదలిక తెచ్చాడు. ఆ వెంటనే స్పిన్నర్లు కట్టడి చేయడంతో ఆచితూచి ఆడాల్సి వచ్చింది. దీంతో శ్రేయాస్ 75 బంతుల్లో తన కెరీర్‌లో నెమ్మదైన హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. అయితే రచిన్ బౌలింగ్‌లో అక్షర్ అవుట్ కావడంతో నాలుగో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే ఓరౌర్కీ షార్ట్ పిచ్ బంతికి శ్రేయాస్ క్యాచ్ అవుటయ్యాడు. రాహుల్ (23), జడేజా (16) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగిన వేళ హార్దిక్ డెత్ ఓవర్లలో వేగం చూపాడు. 49వ ఓవర్‌లో వరుసగా 4,4,6తో 15 రన్స్ సమకూరాయి. ఆఖరి ఓవర్‌లో హార్దిక్, షమి (5)లను అవుట్ చేసిన హెన్రీ ఐదు వికెట్లను పూర్తి చేసుకున్నాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) యంగ్ (బి) జేమిసన్ 15; గిల్ (ఎల్బీ) హెన్రీ 2; విరాట్ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11; శ్రేయాస్ (సి) యంగ్ (బి) ఓరౌర్కీ 79; అక్షర్ (సి) విలియమ్సన్ (బి) రచిన్ 42; రాహుల్ (సి) లాథమ్ (బి) శాంట్నర్ 23; హార్దిక్ (సి) రచిన్ (బి) హెన్రీ 45; జడేజా (సి) విలియమ్సన్ (బి) హెన్రీ 16; షమి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 5; కుల్దీప్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 50 ఓవర్లలో 249/9. వికెట్ల పతనం:** 1-15, 2-22, 3-30, 4-128, 5-172, 6-182, 7-223, 8-246, 9-249. **బౌలింగ్:** హెన్రీ 8-0-42-5; జేమిసన్ 8-0-31-1; ఓరౌర్కీ 9-0-47-1; శాంట్నర్ 10-1-41-1; బ్రేస్‌వెల్ 9-0-56-0; రచిన్ 6-0-31-1.

న్యూజిలాండ్: యంగ్ (బి) వరుణ్ 22; రచిన్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 6; విలియమ్సన్ (స్టంప్) రాహుల్ (బి) అక్షర్ 81; మిచెల్ (ఎల్బీ) కుల్దీప్ 17; లాథమ్ (ఎల్బీ) జడేజా 14; ఫిలిప్స్ (ఎల్బీ) వరుణ్ 12; బ్రేస్‌వెల్ (ఎల్బీ) వరుణ్ 2; శాంట్నర్ (బి) వరుణ్ 28; హెన్రీ (సి) విరాట్ (బి) వరుణ్ 2; జేమిసన్ (నాటౌట్) 9; ఓరౌర్కీ (బి) కుల్దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 45.3 ఓవర్లలో 205 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-17, 2-49, 3-93, 4-133, 5-151, 6-159, 7-169, 8-195, 9-196, 10-205. **బౌలింగ్:** షమి 4-0-15-0; హార్దిక్ 4-0-22-1; అక్షర్ 10-0-32-1; వరుణ్ 10-0-42-5; కుల్దీప్ 9.3-0-56-2; జడేజా 8-0-36-1.



విదర్భ.. మూడోసారి

రంజీ ట్రోఫీ కైవసం ● కేరళపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్

నాగ్‌పూర్: సీజన్ ఆసాంతం అదరగొట్టిన విదర్భ ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీని దక్కించుకుంది. కేరళతో జరిగిన ఫైనల్ ఆదివారం డ్రాగా ముగియగా..మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విదర్భ జట్టు చాంపియన్‌గా నిలిచింది. మ్యాచ్ మూడోరోజున విదర్భకు 37 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ లభించడంతోనే..టైటిల్ ఎవరిదో దాదాపు ఖరారైంది. మొదటి ఇన్నింగ్స్‌లో 379 రన్స్ చేసిన విదర్భ..కేరళను తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌట్ చేసింది. ఇక..ఓవర్‌నైట్ స్కోరు 249/4తో ఐదో, చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ ఆట నిలిపివేసే సమయానికి 375/9 స్కోరు చేసింది. కిందటి రోజు 132 పరుగులతో ఆడుతున్న కరుణ్ నాయర్ తన స్కోరుకు మరో మూడు పరుగులే జోడించి అవుటయ్యాడు. దర్శన్ నల్కండే (51) అజేయ అర్ధ శతకం సాధించాడు. కేరళ స్పిన్నర్ ఆదిత్య సర్వాటే 4 వికెట్లు పడగొట్టాడు. విదర్భ బ్యాటర్ డానిష్ మలేవార్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, విదర్భకే చెందిన లెఫ్టామ్ స్పిన్నర్ హర్ష్ దూబే (69 వికెట్లు, 476 పరుగులు) 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. కాగా, విదర్భ జట్టు రంజీట్రోఫీని గెలవడం ఇది మూడోసారి. 2017-18, 2018-19లో వరుసగా రెండుసార్లు ఆ జట్టు విజేతగా నిలిచింది. గతేడాది ఫైనల్లో ముంబై చేతిలో ఓడిన విదర్భ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈసారి విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో విదర్భ రన్నరప్‌గా నిలవడం విశేషం.

రూ. 3 కోట్ల రివార్డు

విజేతగా నిలిచిన తమ జట్టుకు విదర్భ క్రికెట్ సంఘం రూ. 3 కోట్లు నజరానాగా ప్రకటించింది. టోర్నీలో 69 వికెట్లతో చరిత్ర సృష్టించిన స్పిన్నర్ హర్ష్ దూబేకు అదనంగా రూ. 25 లక్షలు అందజేయనుంది. అలాగే కరుణ్ నాయర్, యశ్ రాథోడ్‌లకు చెరో రూ. 10 లక్షలు ప్రకటించింది.

నాలాగే.. కోహ్లీ

వివ్ రిచర్డ్స్



ముంబై: విరాట్ కోహ్లీని చూస్తుంటే..తనను తాను చూసుకుంటున్నట్టుగా ఉందని వెస్టిండీస్ గ్రేట్ వివియన్ రిచర్డ్స్ (72) అన్నాడు. కోహ్లీ పోరాటపటిమ, తరగని ఉత్సాహం, ఆటపట్ల అభిరుచే.. అతడిని దిగ్గజాల సరసన నిలబెట్టాయన్నాడు. తన ఫామ్‌పై విమర్శలు వచ్చిన ప్రతీసారి బ్యాట్‌తో వారి నోళ్లు మూయించాడన్నాడు. తనలాగే విరాట్‌ది కూడా ఏ మాత్రం భయపడని, ఢీ అంటే ఢీ అనే మనస్తత్వమని, ఎప్పుడూ 120 శాతం ఆత్మవిశ్వాసంతో కనిపిస్తుంటాడని చెప్పాడు. ఒక నాయకుడికి కావాల్సిన లక్షణాలు కోహ్లీలో పుష్కలంగా ఉన్నాయని రిచర్డ్స్ ప్రశంసించాడు. మైదానంలో అతడి ప్రమేయం లేని సందర్భాలు చాలా తక్కువని, ఫిట్‌నెస్ పరంగా 50 ఏళ్ల వరకు ఆడే సత్తా విరాట్‌లో ఉందని చెప్పాడు. ఇక, కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న రోహిత్ శర్మకు రిచర్డ్స్ మద్దతుగా నిలిచాడు. అతడి విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఓర్పుగా ఉండాలని సూచించాడు. చాంపియన్స్ ట్రోఫీకి వెస్టిండీస్ అర్హత సాధించలేకపోవడంపై రిచర్డ్స్ తీవ్ర అసహనం, బాధను వ్యక్తం చేశాడు. అఫ్ఘానిస్థాన్ స్ఫూర్తితో క్రికెట్‌లో పునర్వైభవం కోసం శ్రమించాలని తమ జట్టుకు హితవు పలికాడు.

2034 నాటికి రూ.190 లక్షల కోట్లకు..

జోరుగా రిటైల్ మార్కెట్ వృద్ధి.. వినియోగదారుల అభిరుచులే కీలకం: బీసీజీ

న్యూఢిల్లీ: మన దేశంలో రిటైల్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2014లో రూ.35 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ గత ఏడాది (2024) రూ.82 లక్షల కోట్లకు చేరింది. గత పదేళ్లలో ఏటా సగటున 8.9 శాతం చొప్పున వృద్ధి రేటు సాధించింది. వృద్ధి రేటు ఇలానే కొనసాగితే 2034 నాటికి భారత రిటైల్ మార్కెట్ రూ.190 లక్షల కోట్లకు చేరుతుందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ)తో కలిసి రూపొందించిన ఒక నివేదికలో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) తెలిపింది.

పెరుగుతున్న దేశ జీడీపీ, వినియోగదారుల భిన్న అభిరుచులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషించబోతున్నట్టు పేర్కొంది. ఒక్క కొవిడ్ సమయంలో తప్ప మిగతా అన్ని సమయాల్లో మన దేశ రిటైల్ మార్కెట్ సుస్థిర అభివృద్ధినే నమోదు చేసినట్టు తెలిపింది.

వ్యూహాలే కీలకం

కాకపోతే రిటైల్ కంపెనీలు ఇందుకోసం ఆయా వర్గాల వినియోగదారుల అభిరుచులు, ఆర్థిక స్థోమతుల ఆధారంగా తమ ఉత్పత్తులు, మార్కెటింగ్ వ్యూహాలు రూపొందించుకోవాలని బీసీజీ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా పట్టణ (ఇండియా), గ్రామీణ (భారత్) ప్రాంత వినియోగదారుల ప్రత్యేక అవసరాలను, ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకోవాలని కోరింది. వినియోగదారుల అభిరుచుల్లో ఉండే వ్యత్యాసాలను ఆకళింపు చేసుకునే రిటైల్ కంపెనీలు మాత్రమే మార్కెట్లో రాణిస్తాయని స్పష్టం చేసింది. ఒకే నగరంలోని వినియోగదారుల అభిరుచులన్నీ ఒకేవిధంగా ఉండవని కూడా తెలిపింది.



నివేదిక ఇతర ప్రధానాంశాలు

- కొనుగోలు నిర్ణయాల్లో 'వాల్యూ ఫర్ మనీ' కీలకం
- వినియోగదారుల అభిరుచులు-వస్తువుల అందుబాటు ధరల మధ్య సమతూకం ఉండాలి
- మన దేశ వినియోగదారుల్లోని భిన్నత్వాన్ని రిటైల్ కంపెనీలు అర్థం చేసుకోవాలి
- కొనుగోలు నిర్ణయాల్లో పెరుగుతున్న మహిళల పాత్ర
- రిటైల్ రంగంలో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి
- ఇంకా ఆఫ్‌లైన్ ద్వారానే 58 శాతం కొనుగోళ్లు
- గ్లోబల్ ట్రెండ్స్ బ్రాండ్లపై వినియోగదారుల ఆసక్తి
- స్థానిక ఉత్పత్తులకీ మంచి డిమాండ్

బిజినెస్

22,400పైన బుల్లిష్

(ఫిబ్రవరి 3-7 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,628-22,105 పాయింట్ల మధ్యన కదలాడి 673 పాయింట్ల నష్టంతో 22,125 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,435, 22,650, 22,859, 23,085 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 22,400 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,800

నిరోధ స్థాయిలు: 22,325, 22,425, 22,525 (22,225 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21,925, 21,825, 21,725 (22,025 దిగువన బేరిష్)

టెక్ వ్యూ

యాక్సిస్ ఎంఎఫ్ 2028 ఇండెక్స్ ఫండ్


యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ నిఫ్టీ ఏఏఏ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్-మార్చి 2028 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్ మెచ్యూరిటీ తేదీ 2028 మార్చి 31. ఆర్థిక సేవల రంగంలోని నాణ్యమైన, ఏఏఏ- రేటెడ్ పోర్టు ఫోలియోలో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ ఈ నెల 4.

బంధన్ ఎంఎఫ్ గిల్ట్, ఎస్‌డీఎల్ ఇండెక్స్ ఫండ్ : బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ క్రిసిల్-ఐబీఎక్స్ 10:90 గిల్ట్ ప్లస్ ఎస్‌డీఎల్ ఇండెక్స్-డిసెంబరు 2029 ఫండ్‌ను ప్రారంభించింది. ఈ ఫండ్ 90 శాతం రాష్ట్ర ప్రభుత్వ రుణాలు (ఎస్‌డీఎల్), 10 శాతం ప్రభుత్వ సెక్యూరిటీ (జీ-సెక్)ల్లో పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ మెచ్యూరిటీ తేదీ 2029 డిసెంబరు. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 5. కనీస పెట్టుబడి రూ.1,000.

- ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా.. దేశంలో అతిపెద్ద పశు సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. పశు వికాస్ దినోత్సవం సందర్భంగా 16 రాష్ట్రాల్లోని 500 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి ఈ ఘనతను సాధించింది.

ఉద్యోగాల వృద్ధి బారెడు.. జీతాల వృద్ధి చారెడు

నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ వీర్‌మణి



న్యూఢిల్లీ: దేశంలో నిజ జీతాల వృద్ధి రేటుపై నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ వీర్‌మణి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడేళ్లలో దేశంలో ఉద్యోగ అవకాశాలు పెరిగినా, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా నిజ జీతాల్లో మాత్రం ఎదుగూ బొదుగూ లేదన్నారు. ఈ కాలంలో ఉద్యోగాల కల్పన జనాభా వృద్ధికి మించి జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2023 జూలై నుంచి 2024 జూన్ మధ్య జరిగిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం 2023-24లో అన్ని వయసుల జనాబాలో పని చేసే జనాభా 43.7 శాతం ఉందన్నారు. 2017-18తో పోలిస్తే ఇది 9 శాతం ఎక్కువన్నారు. ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే అధిక జనాభా మన దేశానికి ఒక గొప్ప అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలని వీర్‌మణి స్పష్టం చేశారు. ఇందుకోసం మన విద్యా విధానంలో బోధన, శిక్షణను మెరగు పరుచుకోవడం అత్యంత ముఖ్యమన్నారు.

నైపుణ్యాల కొరతే కారణం: రెగ్యులర్ ఉద్యోగులతో పోలిస్తే గత ఏడేళ్లలో తాత్కాలిక ఉద్యోగుల జీతాల పెరుగుదలే బాగుందని వీర్‌మణి స్పష్టం చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల్లో సరైన విద్య, నైపుణ్యాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఇందుకు మన విద్యా వ్యవస్థ కూడా కారణమన్నారు. ప్రత్యేక నైపుణ్యాల అవసరం ఉన్న కొన్ని రెగ్యులర్ ఉద్యోగాలకు ప్రస్తుతం అభ్యర్థులే దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు రాష్ట్ర ప్రభుత్వాలూ కలిసి రావాలని ఆయన కోరారు. ఇందుకోసం జిల్లా స్థాయి నుంచే పని ప్రారంభం కావాలన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు పెరిగితే ఉత్పాదకత, ఉత్పాదకత పెరిగితే ఉద్యోగుల నిజ జీతాలూ పెరుగుతాయని వీర్‌మణి అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	450
వరంగల్	412	గోదావరి	450
చిత్తూరు	463	విశాఖపట్నం	482
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	101
వరంగల్	100	గుంటూరు	101
కరీంనగర్	100	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	92
కర్నూలు	100	నెల్లూరు	97
విశాఖపట్నం	100	అనంతపురం	97
గోదావరి	101		

కీలక మద్దతు 22000 చేరువలో...

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మొత్తం మీద 670 పాయింట్లు, నెల మొత్తం మీద 1,400 పాయింట్లు నష్టంతో 22,125 వద్ద ముగిసింది. గత అక్టోబరు నుంచి వరుసగా ఐదు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లోనే ఉంది. నెల మొత్తం మీద మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 5,800 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 2,200 పాయింట్లు నష్టపోయాయి. గత కొద్ది వారాలుగా నిఫ్టీ నిట్టనిలువుగా దిగజారినందు వల్ల ఈ వారంలో పుల్‌బ్యాక్ రికవరీకి ఆస్కారం ఉంది. అలాగే శుక్రవారం నాటి ప్రపంచ మార్కెట్ ధోరణులను బట్టి చూసినా రికవరీ అవకాశాలున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: ధోరణిలో స్పష్టత రావాలంటే మార్కెట్ మొదట నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం ప్రధాన మద్దతు స్థాయి 22,000 కన్నా స్వల్పంగా పైన ఉంది. సానుకూలత కోసం ఈ స్థాయిలో కన్సాలిడేట్ కావాలి. ప్రధాన నిరోధం 22,350. స్వల్పకాలిక అవరోధం 22,500.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా ప్రధాన మద్దతు స్థాయి 22,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. అప్పుడే మరింత డౌన్‌ట్రెండ్ నివారించుకోగలుగుతుంది. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 48,000 కన్నా పైన కన్సాలిడేట్ అవుతున్నట్టు కనిపిస్తోంది. ప్రధాన నిరోధం 49,000. సానుకూలత కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 47,800. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత కొనసాగుతున్నట్టు భావించి అప్రమత్తం కావాలి.

పాటర్న్: సానుకూలత కోసం నిఫ్టీ 22,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ ప్రస్తుతం ఓవర్‌సోల్డ్ స్థితికి చేరుకున్నందు వల్ల రికవరీకి ఆస్కారం ఉంది. షార్ట్ టర్మ్ ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	22,280, 22,350
మద్దతు	22,090, 22,000

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. మెక్సికో, కెనడా, చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్స్ మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. మరోవైపు శాంతి చర్చల కోసం వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఏకంగా ట్రంప్‌తో వాగ్వాదానికి దిగటం కొత్త ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. పరిస్థితులు అనుకూలిస్తే మాత్రం బెంచ్‌మార్క్ సూచీల్లో కౌంటర్ ర్యాలీకి అవకాశం ఉంటుంది.

స్టాక్ రికమండేషన్స్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: డిసెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేర్లలో 15 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కీలకమైన రూ.1,660 స్థాయిలో మద్దతు తీసుకుని మళ్లీ పుంజుకున్నాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తుండటం శుభ పరిణామం. చివరి మూడు సెషన్లలో ఈ షేరు 5 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.1,732 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,700 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,825 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్ ఇండియా: ఈ కౌంటర్‌లో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అమ్మకాల ఒత్తిడికి ప్రస్తుతం బ్రేక్ పడినట్టుగా కనిపిస్తోంది. ఓవర్‌సోల్డ్ కండీషన్‌కు రావటం, ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో మళ్లీ పెట్టుబడులు పెరిగాయి. గత వారం మార్కెట్లు నష్టపోయినప్పటికీ ఈ షేరు రాణించింది. గత శుక్రవారం రూ.369 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.350 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.390/425 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.335 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యాక్సిస్ బ్యాంక్: జనవరి చివరి వారం నుంచి ఈ షేరు మెరుగ్గా రాణిస్తూ వస్తోంది. నష్టాల మార్కెట్లోనూ బలం ప్రదర్శిస్తోంది. ఒడుదొడుకులు తక్కువగా ఉన్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. ప్రైస్ యాక్షన్ కూడా బాగుంది. గత శుక్రవారం రూ.1,015 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,000 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,125/1,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.975 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


ట్రెంట్: అక్టోబరు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. దాదాపు 45 శాతం మేర పతనమైంది. డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండటంతో వాల్యూ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం రూ.4,851 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,800 వద్ద పొజిషన్ తీసుకుని రూ.5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,750 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ఇతర రంగాలతో పోలిస్తే మెటల్ సూచీ రికవరీ జోన్‌లో కనిపిస్తోంది. ఈ షేరు హయ్యర్ లోస్ నమోదు చేస్తుండటం శుభపరిణామం. ప్రైస్ యాక్షన్ కూడా టైట్‌గా ఉంది. గత శుక్రవారం రూ.634 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.625 వద్ద పొజిషన్ తీసుకుని రూ.690/725 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.600 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com




నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



గొట్టా బ్యారేజీ వద్ద కనిష్ఠ స్థాయికి చేరుకున్న వంశధార

అట్టడుక్కు వంశధార

శ్రీకాకుళం జిల్లాలోని కీలకమైన గొట్టా బ్యారేజీ పూర్తిస్థాయి నీటి మట్టం 38.10 మీటర్లు కాగా.. ప్రస్తుతం 35.45 మీటర్లు ఉంది. ఒడిశా కొండల నుంచి(క్యాచ్‌మెంట్ ఏరియా) 30 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది. గత ఐదు నెలలుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవలేదు. దీంతో గొట్టా బ్యారేజీలో నీటి నిల్వ తగ్గుతోంది. హిరమండలం వద్ద వంశధార రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. స్థానికంగా కురిసిన వర్షాలకు 4 టీఎంసీలు రిజర్వాయర్‌లోకి చేరింది. అయితే గొట్టా బ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా కొంతనీటిని సాగుకు విడిచిపెట్టారు. మరికొంత నీటిని ఉద్దానం తాగునీటి ప్రాజెక్టుకు పంపిస్తున్నారు. దీంతో వంశధార రిజర్వాయర్‌లో నీరు అడుగంటుతోంది.



నాగార్జున సాగర్ జలాశయంలో తగ్గిన నీటి నిల్వ

సాగర్‌లో 'వారబందీ'

నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో 'వారబందీ' విధానం అమల్లోకి రానుంది. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో జలవనరుల శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. 9 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. తదుపరి 6 రోజులు నీటి సరఫరాను నిలిపివేస్తారు. జోన్-1 పరిధిలో ఆరు రోజులు నీటి సరఫరా నిలిపివేస్తారు. జోన్-2 పరిధిలో నీటి సరఫరాను కొనసాగిస్తారు. వారబందీ అమలుపై వరి రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆయకట్టు పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. మిరపకు మార్చి నెలాఖరు వరకు నీటి అవసరం ఉంటుందని రైతులు తెలిపారు. వరికి ఏప్రిల్‌లో రెండు వారాల పాటు నీరు కావాలని చెబుతున్నారు.

జలాశయాలకు వేసవి గండం!

ఏలేరుకు ఇబ్బందే?

కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం రెండో పంటకు నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో తాజాగా 80.32 మీటర్ల స్థాయిలో 13.82 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం అవసరాలకు ఇబ్బంది లేకపోయినా ఇదే తరహాలో వినియోగిస్తే వేసవిలో నీరు మరింత తగ్గే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వ్యవసాయ అవసరాలకు 1200 క్యూసెక్కులు, విశాఖకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

తోటపల్లితో కష్టమే!

పార్వతీపురం మన్యం జిల్లాలో తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు నుంచి రబీ పంటలకు పూర్తి స్థాయిలో నీరందించలేని పరిస్థితి. ప్రస్తుతం జలాశయంలో 2.534 టీఎంసీలకు గాను 1.676 టీఎంసీల నీరు ఉంది. తాగునీటికి ఇబ్బందులు లేకపోయినా రబీకి మాత్రం నీరందించలేని పరిస్థితి ఉంది.

ఇరు రాష్ట్రాలకు 29 టీఎంసీలు!

నాగార్జున సాగర్ జలాశయంలోని నీటిలో 29 టీఎంసీలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల తాగు, సాగు అవసరాలకు కేఆర్ఎంబీ కేటాయించింది. వేసవిలో తాగునీటి అవసరాలకు 14 టీఎంసీలు వినియోగించుకోవాల్సి ఉంది. ఇరు రాష్ట్రాల్లో పంటలు చేతికి వచ్చే వరకు 15 టీఎంసీల నీటిని పొదుపుగా వాడుకోవాలి. 3 రోజుల క్రితం వరకు 10 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని కుడి కాల్వకు సరఫరా చేశారు. నీటి కేటాయింపులు జరగడంతో కుడి కాల్వకు సాగర్ నుంచి నీటి సరఫరాను 5 వేల క్యూసెక్కులకు తగ్గించారు.

జీడీపీలో ఆశాజనకంగా


కర్నూలు జిల్లాలో ఏకైక అతిపెద్ద జలాశయం గాజుల దిన్నె ప్రాజెక్టు (జీడీపీ) గరిష్ఠ నీటి మట్టం 377 మీటర్లు. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 4.5 టీఎంసీలకు 2.62 టీఎంసీల నిల్వ ఉంది. సాగుకు పోను మరో 1 టీఎంసీ వేసవి అవసరాలకు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. కర్నూలు నగరంతో పాటు కోడుమూరు, డోన్, క్రిష్ణగిరి, బండకట్టు సమగ్ర నీటి పథకాలకు ఇబ్బంది ఉండదని ఇంజనీర్లు అంటున్నారు. కాగా, తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలకుగాను ప్రస్తుతం 32.49 టీఎంసీలు నీటి నిల్వ ఉంది.



నీళ్లు లేక అడుగంటిన పంపా రిజర్వాయర్

మైదానంలా పంపా రిజర్వాయర్

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గమైన మెట్టప్రాంతం అన్నవరంలో పంపా రిజర్వాయర్ నీటిమట్టం తక్కువగా ఉంది. ఎన్నికల కోడ్ కారణంగా టెండర్లు నిలుపుదల చేశారు. దీనివల్ల నీటి ఎద్దడి ప్రారంభమైంది. 105 అడుగుల గరిష్ఠ నీటిమట్టం కలిగిన రిజర్వాయర్‌లో ప్రస్తుతం 86 అడుగులు మాత్రమే ఉంది. దీంతో సాగునీరు ఎలా ఉన్నా భూగర్భ జలాలు అడుగంటిపోయి అన్నవరం పరిసర ప్రాంత వాసులకు నీటికష్టాలు తప్పేలా లేవు.



సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరు

నెల్లూరు జిల్లాలో ఇలా..

నెల్లూరు జిల్లాలోని ప్రధాన జలాశయాల్లో నీటిలభ్యత పుష్కలంగా ఉంది. సోమశిల డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58.946 టీఎంసీలు ఉంది. గతేడాది ఆశించిన రీతిలో కృష్ణా జలాలు రావడం, ఆ తర్వాత కడప, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాలతోపాటు పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో సమృద్ధిగా వర్షాలు కురడంతో సోమశిలకు వరద చేరింది. చెరువులు, వంకలు, బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో నీటి ఇబ్బందులు లేకుండా మొదటి పంట సాగవుతోంది. తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా 5టీఎంసీలు కేటాయించారు. కండలేరు కూడా నిండుకుండలా ఉంది. స్థానికంగా తాగు, సాగు నీటితోపాటు తమిళనాడులోని చెన్నైకు కూడా నీటిని విడుదల చేసినా కొరత రాదని కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల్లో నీటి లెక్కలివీ


- రాష్ట్రంలోని మేజర్ జలాశయాల్లో 865.64 టీఎంసీల గరిష్ఠ నిల్వకుగాను.. 476,14(55%) టీఎంసీల జలాలు నిల్వ ఉన్నాయి. అంటే, 389.5 టీఎంసీల లోటు కనిపిస్తోంది.
- మీడియం జలాశయాల్లో 716.27 టీఎంసీలకుగాను 466(56.8%) టీఎంసీలు నిల్వ ఉంది. 250.23 టీఎంసీల లోటు నమోదయింది.
- శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీటి నిల్వలు బాగా తగ్గాయి. శ్రీశైలం జలాశయం గరిష్ఠ సామర్థ్యం 215.81 టీఎంసీలకుగాను కేవలం 35 శాతం మేర 76.49 టీఎంసీలు నిల్వ మాత్రమే ఉంది. 139.32 టీఎంసీల లోటుంది.
- నాగార్జున సాగర్‌లో 312 టీఎంసీలకుగాను 54.45 శాతం మేర 169.91 టీఎంసీల నిల్వ ఉంటే.. 142.14 టీఎంసీల లోటు ఉంది.
- పులిచింతలలో 45.77 టీఎంసీల గరిష్ఠ సామార్థ్యానికిగాను 75 శాతం మేర 34.54 టీఎంసీల నిల్వ ఉంది. లోటు 11.23 టీఎంసీలు ఉంది.
- ప్రకాశం బ్యారేజీలో 3.07 టీఎంసీలకు గాను 96 శాతం మేర 2.96 టీఎంసీల నిల్వ ఉంది.

ప్రకాశం పరిస్థితి ఇదీ..

పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 33 టీఎంసీల నిల్వ ఉంది. దీనికి దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజ్ పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 3.07 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.09 టీఎంసీల నీరు ఉంది. బ్యారేజ్ పూర్తి స్థాయి నీటిమట్టం 12 అడుగులు కాగా ఇక్కడ 11.07 అడుగుల నీటిమట్టం ఉంది. బ్యారేజ్ వద్ద నిల్వలు తగ్గుతుండడంతో పులిచింతల నుంచి విడుదల చేస్తున్నారు. పులిచింతలకు మాత్రం ఇన్‌ఫ్లో లేదు. ప్రకాశం బ్యారేజ్ కింద కృష్ణా డెల్టాలో 13.8 లక్షల ఎకరాలు సాగవుతోంది. కృష్ణా జిల్లాలో 6.79 లక్షలు, గుంటూరు జిల్లాలో 4.99 లక్షలు, ప్రకాశం జిల్లాలో 0.72 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 0.58 లక్షల ఎకరాలు సాగవుతోంది. వేసవి మూడు నెలలకు సాగు, తాగునీటి అవసరాలకు మొత్తం 14 టీఎంసీల నీరు అవసరమవుతుంది.

కర్నూలుకు కష్టం లేనట్టే!

ఉమ్మడి కర్నూలు జిల్లా జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. పక్కా ప్రణాళిక, పొదుపుగా నీటిని వినియోగించుకుంటే రబీ ఆయకట్టుతో పాటు వేసవి తాగునీటి అవసరాలకు ఢోకా ఉండదని ఇంజనీర్లు చెబుతున్నారు. శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టులతో కలిపితే 131.264 టీఎంసీల మేర నీరు అందుబాటులో ఉంది. ప్రస్తుతం కేసీ కెనాల్ పరిధిలో 92,200 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. హంద్రీనీవా పరిధిలో దాదాపు 25వేల ఎకరాలు సాగులో ఉంది. ఈ నెలాఖరు వరకు నీటిని ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాలువకు 674 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 1,350 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు.



నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయంలో తాజా పరిస్థితి

నంద్యాల జిల్లాలో..

రానున్న వేసవి నేపథ్యంలో నంద్యాల జిల్లాలో సాగు, తాగు నీటికి ఇబ్బందులు రాకుండా ఆయా రిజర్వాయర్లలో అధికారులు నీటి నిలువలను సిద్ధం చేశారు. జిల్లాలో గోరుకల్లు, వెలుగోడు, అవుకు ప్రధాన రిజర్వాయర్లు కాగా తెలుగు గంగ పరిధిలోని వెలుగోడు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 9.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్సార్బీసీ పరిధిలో ఉన్న గోరుకల్లు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 9.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో గోరుకల్లు, వెలుగోడు, అవుకు రిజర్వాయర్ల పరిధిలో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేవు.

కడప చెరువులు కళకళ!

కడప జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల్లో 48 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గండికోటలో 22 టీఎంసీలు నిల్వ ఉండగా, బ్రహ్మంసాగర్‌లో 8.6 టీఎంసీలు, సీబీఆర్‌లో 7.5, పైడిపాలెంలో 4.2, మైలవరంలో 2.5, ఎస్ఆర్-1లో 1.2, ఎస్ఆర్-2లో 1.2, వామికొండలో 1.2, సర్వారాయసాగర్‌లో 2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బద్వేలు నియోజకవర్గంలో 75 చెరువులను కృష్ణాజలాలతో నింపారు. పులివెందుల 38, మైదుకూరు 20, జమ్మలమడుగు 10, ప్రొద్దుటూరులో 2 చెరువులకు నీళ్లు నింపారు. పండ్లతోటల కోసం 5 టీఎంసీలు, పరిశ్రమలు, సాగునీటి కోసం 4 టీఎంసీల నీరు సరిపోతుంది.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్

కార్పొరేట్ 'టాలెంట్' టెస్టులు

- కొన్ని పాఠశాలల్లో ఇష్టారాజ్యం.. టాలెంట్ టెస్టులపై రాష్ట్రంలో నిషేధం
- నిబంధనలు తుంగలో తొక్కి నిర్వహణ

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అడ్మిషన్ల కోసం విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆకర్షించకూడదంటూ.. అమల్లోకి తెచ్చిన నిబంధనలను తుంగలో తొక్కి 'టాలెంట్' టెస్టులు నిర్వహిస్తున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కార్పొరేట్ మేనేజ్‌మెంట్లు టాలెంట్ టెస్టులు నిర్వహించాయి. వీటిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు టెస్టులను అడ్డుకున్నారు. కానీ, అనేక చోట్ల అధికారులకు సమాచారం చేరేలోగా టెస్టుల నిర్వహణ పూర్తిచేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం టాలెంట్ టెస్టుల పేరుతో కార్పొరేట్ మేనేజ్‌మెంట్లు ఈ విధంగా అడ్డదారులు తొక్కుతున్నాయి. అడ్మిషన్ల కోసం టాలెంట్ టెస్టులు నిర్వహించడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉమ్మడి రాష్ట్రంలో 1994లో వాటిని నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచీ పలు మార్పులతో ఆ నిషేధం కొనసాగుతోంది. టాలెంట్ టెస్టులకు అనుమతివ్వాలని 2011లో ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించగా కోర్టు కూడా నిషేధం కొనసాగించాలని స్పష్టం చేసింది. కానీ మధ్యలో కొన్ని ప్రైవేటు మేనేజ్‌మెంట్లు అనధికారికంగా టాలెంట్ టెస్టులు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయి. విద్యాశాఖ వర్గాలు మాత్రం దీనిపై గట్టి చర్యలు తీసుకోవట్లేదనే వాదన వినిపిస్తోంది.

ఇంటింటికీ వెళ్లి ఆహ్వానం

అనధికారికంగా నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టులకు ప్రచారం చేస్తే ఇబ్బంది అవుతుందనే ఆలోచనతో ఆయా మేనేజ్‌మెంట్లు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. టెస్టులు నిర్వహించే ప్రాంతాల్లో పాఠశాలల టీచర్లు, సిబ్బందిని ఇంటింటికీ పంపి టాలెంట్ టెస్టులకు వచ్చేలా ప్రలోభపెడుతున్నారు. టెస్టుల నిర్వహణలోనూ మ్యాజిక్‌లు ప్రదర్శిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేసి, ఫీజులో డిస్కౌంట్ ఇస్తామని అక్కడే ప్రలోభాలకు దిగుతున్నారు. టెస్టులో అంతంతమాత్రంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా ఎంతో కొంత ఫీజులు తగ్గిస్తామని, తమ స్కూల్లో చేరితే అద్భుతంగా తీర్చిదిద్దుతామని నమ్మబలుకుతున్నారు. ఈ మార్కులు, ఫీజుల రాయితీలు చూసి కొందరు తల్లిదండ్రులు ఆకర్షితులై అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అలాగే చిన్నపాటి ప్రైవేటు పాఠశాలల అవకాశాలు కూడా దెబ్బతింటున్నాయి.

ఈసారి భగభగలే

మే వరకూ ఎండల తీవ్రత

(విశాఖపట్నం/అమరావతి-ఆంధ్రజ్యోతి)

చలికాలం పోయి వేసవి మొదలైంది. ఈ వేసవి సీజన్‌లో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో అనేక ప్రాంతాలు నిప్పుల కొలిమిలా మారనున్నాయి. గత కొన్నేళ్లుగా వేసవిలో ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. ఈ ఏడాది కూడా తీవ్రత మరింత పెరగనుంది. అనేక ప్రాంతాల్లో ఫిబ్రవరిలోనే ఎండ మండిపోయింది. దక్షిణాదిలో పలుచోట్ల వడగాడ్పులు కొనసాగాయి. మూడు నెలలు అంటే... మార్చి నుంచి మే వరకూ ఎండ తీవ్రత క్రమేపీ పెరగనుంది. దేశంలో ఐదింట నాలుగొంతుల ప్రాంతం వడగాడ్పుల ప్రభావానికి గురికానుంది. దక్షిణాదిలో కొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతం, ఉత్తరాదిలో కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. మార్చి నుంచి మే వరకు మూడు నెలలకు సంబంధించి భారత వాతావరణ శాఖ అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది.

రాష్ట్రంలో అప్పుడే ఎండలు

రాష్ట్రంలో అప్పుడే ఎండలు పెరిగాయి. మార్చిలోనే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. గత నెల 24న నంద్యాల జిల్లా బండిఆత్మకూరులో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.6 డిగ్రీలు నమోదైంది. ఈ నెల నుంచే వేసవి ప్రభావం చూపుతూ, సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో భానుడు భగ్గుమనే అవకాశం ఉందని హెచ్చరించింది. గత వారం నుంచి రోజురోజుకీ 2-4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, రానున్న రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఫిబ్రవరి నెలలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ఈ నెలలో సగటున గరిష్ఠ ఉష్ణోగ్రత 27.58 డిగ్రీలు కాగా.. 29.07 డిగ్రీలు (1.49 డిగ్రీలు ఎక్కువ) నమోదైంది. ఫిబ్రవరిలో వర్షపాతం సాధారణం కంటే 50 శాతం తగ్గింది. దీంతో భూమిలో, గాలిలో తేమశాతం తగ్గడం దేశంలో వేడి పెరగడానికి ఒక కారణంగా నిపుణులు చెబుతున్నారు.



ఆదివారం విజయవాడలో నిర్మానుష్యంగా మారిన దర్శిపేట కూడలి

ఎక్కువ రోజులు వడగాడ్పులు..

వేసవి సీజన్‌లో ప్రధానంగా మార్చి నుంచి మే వరకూ అనేక ప్రాంతాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. అయితే దక్షిణాదిలో తమిళనాడు, దానికి ఆనుకుని కోస్తా, రాయలసీమల్లోని కొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతం, ఉత్తరాదిలో హిమాలయాలకు ఆనుకుని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సగటు కంటే తక్కువ నమోదవుతాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఎండలు ఎక్కువగానే ఉంటాయని, వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ముందస్తు సమాచారం

విపత్తు నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులను పర్యవేక్షించి ప్రజల ఫోన్లకు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తామని సంస్థ ఎండీ కూర్మనాథ్ చెప్పారు. ఎండలపై సమాచారానికి టోల్‌ఫ్రీ నంబర్లు 112,1070, 18004250101 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏపీ, తెలంగాణాల్లోనూ గాలులు

మార్చి వరకూ చూస్తే దేశంలో ఎండలు పెరగడంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. దీంతో వాయవ్య, మధ్య భారతం దానికి ఆనుకుని దక్షిణాదిలో ఏపీ, తెలంగాణల్లోని అనేక ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. గతేడాది కంటే మరింత తీవ్రంగా ఎండలు, వడగాడ్పులు ఉండే అవకాశం ఉందని తెలిపింది. అయితే మార్చిలో దక్షిణ, మధ్య భారతంలో అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువగా, ఉత్తరాదిలో కొన్నిచోట్ల సాధారణంగా, మిగిలిన చోట్ల తక్కువగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది.

రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు

- పట్టణాభివృద్ధికి సంస్కరణలను స్వాగతిస్తున్నాం
- బిల్డింగ్ నిబంధనల్లో మార్పులు హర్షణీయం
- కూటమి ప్రభుత్వానికి ఏపీ 'నరెడ్కో' ధన్యవాదాలు

అమరావతి/విజయవాడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణాభివృద్ధి, రెవెన్యూ ప్రక్రియలను సులభతరం చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలను నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) ఏపీ విభాగం స్వాగతించింది. వేగవంతమైన అనుమతులు, పారదర్శకతకు ఇవి దోహదపడతాయని పేర్కొంది. విజయవాడలోని మాలక్ష్మి చాంబర్స్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్కరణల ప్రభావంపై నరెడ్కో ప్రతినిధులు మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ బిల్డింగ్ నిబంధనల్లో మార్పుల ద్వారా ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగానికి జవసత్వాలు ఇచ్చిందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణకు ధన్యవాదాలు చెప్పారు. గతంలో ఇసుక పాలసీతో ఎంతో నష్టపోయిన నిర్మాణ రంగం కొత్త ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ వల్ల తిరిగి పుంజుకుందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ నిర్ణయాలను ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు ముందుకురావడం సంతోషకరమన్నారు. రోడ్డు కనీస వెడల్పును 40 నుంచి 30 అడుగులకు తగ్గించడం వల్ల అనధికార లేఅవుట్ల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్రత్యేక పార్కింగ్‌ను అనుమతించడం వలన ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.

రాష్ట్రంలో ఊపందుకున్న నిర్మాణ రంగం

కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుందని నరెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సందీప్ చెప్పారు. అమరావతికి మూడు వంతెనల ప్రతిపాదనలు, ఇన్నర్ రింగ్ రోడ్డు, బైపాస్ రోడ్డు పూర్తి చేయడం వల్ల ఇప్పుడు అందరూ రాజధాని వైపు చూస్తున్నారని అన్నారు.

రేడియో కాలర్‌తో.. జంతువుల నుంచి భక్తులకు రక్షణ

- యానిమల్ రేడియో కాలర్ సిస్టంపై టీటీడీ దృష్టి
- అమలు కోసం వైల్డ్‌లైఫ్ అనుమతి కోరిన అధికారులు


రేడియో కాలర్‌తో ఉన్న చిరుతలు (ఫైల్)

తిరుమల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు అడవి జంతువుల నుంచి రక్షణ కల్పించే దిశగా టీటీడీ ప్రయత్నాలు చేస్తోంది. కాలినడక మార్గాలతో పాటు ఘాట్‌రోడ్లలో ప్రయాణించే వాహనదారులకు చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్ల నుంచి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా యానిమల్ రేడియో కాలర్ సిస్టంను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దీనికోసం వైల్డ్‌లైఫ్ అధికారుల అనుమతి కోరింది. 2023 ఆగస్టు 12న అలిపిరి కాలిబాటలో నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన లక్షిత అనే చిన్నారిపై చిరుత దాడి చేసి దారుణంగా చంపింది. అదే ఏడాది జూన్ 22న ఆదోనికి చెందిన కౌశిక్ అనే నాలుగేళ్ల బాలుడిపైనా చిరుత దాడి చేసింది. ఇలా గత పదిహేనేళ్లుగా అలిపిరి, శ్రీవారిమెట్టు కాలిబాటలతో పాటు తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్, తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్ రోడ్డులో చిరుతలు కనిపిస్తూనే ఉన్నాయి. పైగా, మొదటి ఘాట్‌లోని ఏడో మైలు వద్ద, పార్వేటమండపం, శ్రీవారిపాదాల మార్గంలో ఏనుగుల గుంపు కూడా సంచరిస్తున్న క్రమంలో భక్తులు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అడవి జంతువుల నుంచి భక్తులకు ఎలాంటి రక్షణ కల్పించాలనే అంశంపై ఇప్పటికే టీటీడీ... వైల్డ్‌లైఫ్ అధికారులను సంప్రదించింది. ఈ క్రమంలో టీటీడీ 'రేడియో కాలర్ సిస్టం' అనే ఆలోచనను వైల్డ్‌లైఫ్ అధికారుల ముందుంచింది. ఘాట్‌రోడ్లు, కాలిబాట మార్గాలు, తిరుమల పరిసర ప్రాంతాల్లో నిత్యం సంచరించే చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లతో పాటు జింకలకు కూడా 'రేడియో కాలర్ సిస్టం'ను ఏర్పాటు చేయాలని కోరింది. వీటి ద్వారా ఆయా జంతువులు జనసంచారం సమీపానికి వస్తే వెంటనే అలర్ట్ కావడానికి సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయాన్ని టీటీడీ ఫారెస్ట్ అధికారులు వ్యక్తపరిచారు. దేశంలోని పలు ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఈ విధానాన్ని తిరుమలలోనూ అమలు చేసేందుకు వైల్డ్‌లైఫ్ అధికారులు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

సిమ్‌తో కూడిన రేడియో కాలర్ పరికరం

వైల్డ్‌లైఫ్ అధికారుల నుంచి అనుమతి వస్తే తొలుత జంతువులను ట్రాప్ చేసి పట్టుకుంటారు. ఆ తర్వాత సిమ్‌తో కూడిన రేడియో కాలర్ పరికరాన్ని ఆయా జంతువులకు అమర్చుతారు. తిరుమలలో ప్రత్యేకంగా ఓ విభాగాన్ని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు శాటిలైట్ ద్వారా వచ్చే సిగ్నల్స్ ఆధారంగా జంతువుల కదలికలను పర్యవేక్షిస్తారు. ఒకవేళ అవి భక్తులకు సమీపానికి వస్తే వెంటనే అప్రమత్తం చేయడంతో పాటు వాటిని అడవిలోకి తరిమేలా చర్యలు తీసుకుంటారు.

5, 6 తేదీల్లో సీఎం ఢిల్లీ టూర్.. 7న క్యాబినెట్ భేటీ

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఈనెల 5, 6 తేదీల్లో ఢిల్లీకి వెళ్లనున్నారు. 5న ఉదయం ఢిల్లీకి వెళ్లనున్న ఆయన.. అదే రోజు రాత్రి తిరిగి విశాఖపట్నం చేరుకుని, అక్కడే బస చేస్తారు. 6వ తేదీ చంద్రబాబు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి నేరుగా ఢిల్లీ చేరుకుంటారు. 6వ తేదీన ఓ ఆంగ్ల చానల్‌కు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటారు. కాగా, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ నెల 7న జరగనుంది. సచివాలయం మొదటి బ్లాక్‌లోని క్యాబినెట్ హాల్‌లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఈ భేటీ జరగనుంది.

రాజధానికి రయ్.. రయ్!

- రూ.2,605.3 కోట్ల అంచనాలతో పనులకు ఆమోదం
- భూసేకరణకు మూడు జిల్లాల్లో జేసీల నియామకం

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతిని రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలతో అనుసంధానించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఔటర్ రింగురోడ్డు, జాతీయ రహదారుల సమాహారంతో అమరావతి మరింత శోభాయమానం కానుంది. రూ.16,310 కోట్ల అంచనాలతో నిర్మించ తలపెట్టిన అమరావతి ఔటర్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌కు కేంద్రం ఇప్పటికే పచ్చజెండా ఊపింది. ఈక్రమంలోనే వినుకొండ- గుంటూరు హైవే విస్తరణ, నిజాంపట్నం- గుంటూరు హైవే నిర్మాణ పనులు తెరపైకి వచ్చాయి. ఇప్పటికే వినుకొండ- గుంటూరు రహదారి అలైన్‌మెంట్‌కు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలపగా, నిజాంపట్నం -గుంటూరు రహదారికి సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా వినుకొండ-గుంటూరు మధ్య విస్తరించ తలపెట్టిన రహదారి పనులు ఊపందుకున్నాయి.

వినుకొండ-గుంటూరు ఎన్‌హెచ్ విస్తరణ వేగవంతం

రూ.2,605.3కోట్ల అంచనాలతో నాలుగు వరసలుగా ఈ జాతీయ రహదారిని విస్తరించనున్నారు. గుంటూరుకు సమీపంలోని బుడంపాడు వద్ద ఈ రహదారి ఓఆర్ఆర్‌లో కలుస్తుంది. అక్కడినుంచి రింగురోడ్డు మీదుగా అమరావతికి చేరుకోవచ్చు. 44.8 కి.మీ. మేర బ్రౌన్‌ఫీల్డ్‌గా, మరో 40 కి.మీ. మేర గ్రీన్‌ఫీల్డ్‌గానూ విస్తరించనున్నారు. వినుకొండ, శావల్యాపురం, సంతమాగులూరు, పెట్లూరువారిపాలెం, సాతులూరు, ఫిరంగిపురం వద్ద ఆరు బైపాస్‌లు వస్తాయని, వాటికి సంబంధించి కూడా భూ సేకరణ చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రహదారి విస్తరణకు మొత్తం 291.88 హెక్టార్ల భూమి కావాలని, అందుకోసం రూ.385 కోట్లు అవసరమని పేర్కొంటున్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు కావడంతో నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు. భూసేకరణ ప్రక్రియకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ముగ్గురు జాయింట్ కలెక్టర్లను కేంద్రం నియమించింది. ఆరు నెలల్లో భూసేకరణను పూర్తి చేసి, పనులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే నిజాంపట్నం-గుంటూరు రోడ్డుకు, నిజాంపట్నం హార్బర్ నుంచి గుంటూరుకు నిర్మించ తలపెట్టిన మరో రహదారి పనులకు కూడా అధికారులు సిద్ధమయ్యారు.



తాడేపల్లిలో పునుగుపిల్లి ప్రత్యక్షం

తాడేపల్లి టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎక్కువగా తిరుమల శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే పునుగుపిల్లి ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణంలో ప్రత్యక్షమైంది. ఈ అరుదైన పునుగుపిల్లి స్థానిక ముగ్గు రోడ్డు కొండ ప్రాంతంలోని ఓ ఇంటి వద్ద ఉదయం ప్రత్యక్షమవడంతో తొలుత ఏ జంతువో అర్థం కాక స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి.. దానిని పట్టుకున్నారు. దానిని పునుగుపిల్లిగా నిర్ధారించారు. స్థానిక వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించిన అనంతరం, తిరిగి అడవిలో విడిచిపెట్టనున్నట్లు తెలిపారు.

'వైపీఎస్' సునీల్‌కుమార్‌పై వేటు!

సీఐడీ మాజీ చీఫ్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో సీఐడీ అధిపతిగా, నిఘా విభాగం చీఫ్‌గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాల్లో పర్యటించడం.. ఒక దేశానికి వెళ్తానని చెప్పి.. మరో దేశంలో తిరగడం అఖిల భారత సర్వీసు నిబంధనలకు విరుద్ధమని తెలిసినా.. గీత దాటారని తేలడంతో ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అనధికారికంగా ఆయన చేపట్టిన విదేశీ పర్యటనలు జాతీయ భద్రతకు ముప్పు తెచ్చేలా ఉన్నాయని తెలిపారు. కీలక స్థానాల్లో పనిచేసే ఐపీఎస్ అధికారుల వద్ద చాలా సున్నితమైన సమాచారం ఉంటుందని, పర్యటనల్లో ఉల్లంఘనలు గమనిస్తే ఆ రహస్య సమాచారం బయటకు పొక్కి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. రూ.వేల కోట్ల ఆర్థికపరమైన కేసుల దర్యాప్తు, విదేశాల్లో దాక్కున్న నిందితులపై విచారణలు సీఐడీ పరిధిలోనే ఉంటాయని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో గుర్తుచేసింది. తనకన్నా పైస్థాయి అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా వెళ్లడం తీవ్రమైన తప్పుగా పరిగణించింది. 2019-24 నడుమ ఐదేళ్లలో ఆరు సార్లు సునీల్‌కుమార్ జరిపిన విదేశీ రహస్య పర్యటనల లోగుట్టు వెలికి తీయాల్సి ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో విచారణ పూర్తయ్యేవరకు విజయవాడ వదిలివెళ్లొద్దని ఆయన్ను ఆదేశించింది. క్రమశిక్షణ కలిగిన యూనిఫామ్ సర్వీసుల్లో 30 ఏళ్లుగా పనిచేస్తున్న సునీల్‌కుమార్‌కు.. విదేశీ పర్యటనకు వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తెలియదా.. ఒక దేశానికి వెళ్తున్నట్లు చెప్పి మరో దేశంలో పర్యటించడం అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలియదా..? అన్నీ తెలిసినా చేశారు. ఎందుకంటే ఆయన వెనకున్నది అప్పటి జగన్ ప్రభుత్వం. ఆ ఐదేళ్లలో సీఐడీ, నిఘా, అగ్నిమాపక విభాగాల అధిపతిగా పనిచేసిన ఆయన.. ఐపీసీ చట్టాన్ని పక్కన బెట్టి వైసీపీ రాజ్యాంగాన్ని అమలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన తీరుపై విచారణకు గత నెలలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను ప్రభుత్వం నియమించింది. సునీల్‌కుమార్ ఆలిండియా సర్వీసెస్(కండక్ట్) రూల్స్ ఉల్లంఘించినట్లు విచారణలో తేలింది. ఐపీఎస్ అధికారులు ఎప్పుడు విదేశాలకు వెళ్లినా ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలన్న చైన్ ఆఫ్ కమాండ్ ప్రొటోకాల్‌ను ఆయన పాటించలేదని వెల్లడైంది. దీనిని క్రమశిక్షణరాహిత్యంగా పరిగణిస్తూ డిసిప్లిన్ అండ్ అప్పీల్ రూల్స్ కింద ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

ఆ ఐదేళ్లలో వైసీపీ రాజ్యాంగం..

జగన్‌రెడ్డి పాలనలో ఐపీసీని పక్కన బెట్టి వైసీపీ రాజ్యాంగాన్ని అమలు చేసిన అధికారుల్లో సునీల్‌కుమార్ అగ్రస్థానంలో ఉంటారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందడమే ఆలస్యం.. సామాన్యులైనా, వృద్ధ మహిళలైనా.. పార్లమెంటు సభ్యుడైనా.. ఎవరినీ వదల్లేదు. సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ శ్రేణులను, జగన్ అభిమానులను హైకోర్టే ఆదేశించినా అరెస్టు చేయలేదు. యూనిఫామ్ సర్వీసులో ఉంటూ అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) పేరుతో ప్రైవేటు సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. దాని సమావేశాల్లో దేశాన్ని కించపరుస్తూ.. బ్రిటిషర్లను కీర్తిస్తూ ప్రసంగాలు చేశారని ఎప్పుడో ఫిర్యాదులు వచ్చాయి. సునీల్‌కుమార్ రాష్ట్రంలో ఏ ఐపీఎస్ అధికారి వెళ్లనన్ని సార్లు విదేశాల్లో పర్యటించారు. బినామీ పేర్లతో ఆయనకు విదేశాల్లో వ్యాపారాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందాయి. కొన్ని ఆధారాలు కూడా సంపాదించిన సర్కారు.. అనుమానిత వ్యవహారాల సమాచారాన్ని సేకరిస్తోంది. ఏ దేశ విమానం ఎప్పుడు ఎక్కారు.. అనుమతి తీసుకున్న దేశానికి కాకుండా మరో దేశానికి వెళ్లడంలో ఆంతర్యమేంటి.. ఇతర వ్యవహారాలు.. లావాదేవీలపై కూపీలాగుతోంది.

విదేశీ పర్యటనలు ఇలా..

2019 డిసెంబరు నుంచి సునీల్‌కుమార్ విదేశీ పర్యటనలు మొదలయ్యాయి. నాటి నుంచి గత ఏడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేవరకు పలు మార్లు అంతర్జాతీయ విమానాల్లో చేసిన ప్రయాణాల్లో అనుమతి తీసుకున్న దేశాలకు, ఆయన వెళ్లిన దేశాలకు పొంతన లేదు. 2019 డిసెంబరు 21 నుంచి 2020 జనవరి 4వరకూ అమెరికా వెళ్లేందుకు అనుమతి తీసుకుని.. ఇంగ్లండ్ వెళ్లినట్లు సిసోడియా నేతృత్వంలోని కమిటీ గుర్తించింది. 2021 అక్టోబరులో అనధికారికంగా యూఏఈ వెళ్లారు. 2022 డిసెంబరు 14న జార్జియా వెళ్లేందుకు అనుమతి తీసుకుని.. యూఏఈకి కూడా వెళ్లారు. 2023 ఫిబ్రవరి 1న ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండానే హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానం ఎక్కి వెళ్లి నెల రోజుల పాటు అమెరికాలో ఉన్నట్లు కమిటీ నిర్ధారించింది. 2023 సెప్టెంబరులో అనుమతి లేకుండా స్వీడన్ వెళ్లినట్లు తేలింది. 2024 మార్చిలో జార్జియా వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది.. అయితే యూఏఈ వెళ్లినట్లు సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా.. ఈ వ్యవహారంలో ఈడీ కూడా త్వరలో రంగంలోకి దిగే అవకాశాలున్నాయి. విదేశీ నిధులను మతమార్పిడి సంబంధ కార్యక్రమాలకు ఖర్చుచేశారన్న ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రాథమికంగా విచారణ జరిపింది. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిపారని గుర్తించింది.

రఘురామ టార్చర్ కేసులో.. ఐజీ సునీల్ నాయక్‌కు నోటీసులు

- నేడు విచారణకు ఒంగోలు రావాలని సూచన

ఒంగోలు క్రైం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో విచారణకు రావాలని ప్రస్తుతం బిహార్ ఫైర్ సర్వీసెస్ ఐజీగా పనిచేస్తున్న సునీల్ నాయక్‌కు ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేశారు. 4రోజుల క్రితం వాట్సాప్, ఫ్యాక్స్ ద్వారా వీటిని పంపారు. సోమవారం ఒంగోలులో జిల్లా ఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని కోరారు. బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన సునీల్ నాయక్ వైసీపీ హయాంలో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చారు. సీఐడీలో డీఐజీగా పనిచేశారు. అప్పట్లో రఘురామను సీఐడీ అధికారులు అరెస్టు చేసి గుంటూరులోని ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. ఆ సమయంలో సునీల్ నాయక్ అక్కడకు వచ్చారని ఈ కేసును ఎస్పీ దామోదర్ నిర్ధారణకు వచ్చారు. దీంతో విచారణకు పిలిచారు.

రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు రద్దు!

- నిర్వహణ అధ్వానంగా ఉందని ఎఫ్ఈఈకు ఫిర్యాదులు
- ఇది తాత్కాలికమేనంటున్న జిల్లా అధికారులు
- రేపు భద్రతా ఆడిట్.. తర్వాత పునరుద్ధరణ అవకాశం


రుషికొండ బీచ్‌లో బ్లూ ఫ్లాగ్ జెండా.. మధ్యలో (ఫైల్)

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండ బీచ్ ప్రతిష్ఠాత్మకమైన 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు కోల్పోయింది. బీచ్ నిర్వహణ అధ్వానంగా ఉందంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఈఈ) సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ సర్టిఫికెట్ ఉపసంహరణ తాత్కాలికమేనని, 4న భద్రతా ఆడిట్ తర్వాత బ్లూఫ్లాగ్‌ను పునరుద్ధరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. బీచ్ నిర్వహణను ప్రైవేటు సంస్థ గాలికొదిలేయడం, పర్యాటక శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే ఇది జరిగినట్లు తెలుస్తోంది. రుషికొండ బీచ్‌కు ఎఫ్ఈఈ సంస్థ 2020లో 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు ఇచ్చింది. రాష్ట్రంలో ఈ గుర్తింపు పొందిన ఏకైక బీచ్ ఇదే! బ్లూఫ్లాగ్ గుర్తింపు ఇచ్చే క్రమంలో ఎఫ్ఈఈ కొన్ని నిబంధనలు విధించింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా బీచ్‌ను నిర్వహించాలని సూచించింది. భద్రత, పర్యావరణ నిర్వహణ, నీటి నాణ్యతను పక్కాగా పాటించడంతో పాటు బీచ్‌ను శుభ్రంగా ఉంచుతూ, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించింది. 2024-25కు సంబంధించి బ్లూఫ్లాగ్ అవార్డు(గుర్తింపు) కోసం జిల్లా యంత్రాంగం గతేడాది దరఖాస్తు చేయగా ఎఫ్ఈఈ రెన్యువల్ చేసింది. అయితే బీచ్‌లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, కుక్కలు వస్తున్నాయని, సీసీ కెమెరాలు పనిచేయట్లేదని, వ్యర్థాలు పేరుకుపోయాయని, మూత్రశాలలు సరిగా లేవని, దుస్తులు మార్చుకునే గదులు అధ్వానంగా ఉన్నాయని కొద్దిరోజుల కిందట ఎఫ్ఈఈకి ఫొటోలతో సహా ఫిర్యాదులు అందాయి. దీంతో సదరు సంస్థ బ్లూ ఫ్లాగ్ గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేస్తూ గతనెల కలెక్టర్‌కు మెయిల్ ద్వారా సమాచారం పంపింది. బీచ్‌లో ఎగురవేసే జెండాలను (గుర్తింపు ఉన్నప్పుడు కొన్ని జెండాలను ఎగురవేస్తారు) దించేయాలని సూచించింది. ఈ విషయాన్ని నోటీసు బోర్డులో తెలియజేయాలని పేర్కొంది. జిల్లా అధికారులు విషయం బయటకు రాకుండా శనివారం వరకు జాగ్రత్త పడ్డారు. జెండాలను సైతం కిందకు దించలేదు. బ్లూఫ్లాగ్ గుర్తింపు రద్దువిషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. దీనికి కారణాలను తెలియజేయాలని సీఎస్ ఆదేశించడంతో కలెక్టర్ ఆ వివరాలు పంపినట్లు తెలిసింది. అధికారులు బీచ్ నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ నిర్వహణను గాలికి వదిలేయడం, సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో బీచ్ అధ్వానంగా తయారైంది. బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్‌ను తాత్కాలికంగా ఉపసంహరిస్తున్నట్లు ఎఫ్ఈఈ నుంచి గతనెల 13న సమాచారం రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు.

అదనపు ఫీచర్లతో 'ఉమెన్ సేఫ్టీ' యాప్

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8న 'ఉమెన్ సేఫ్టీ' యాప్‌ను అదనపు ఫీచర్లతో అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు పోలీసు శాఖ తెలిపింది. ప్రత్యేక మహిళా రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించింది. హెల్ప్‌లైన్ నంబర్లు 112, 181, 1098పై విస్తృత అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సాధికారిక వారోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీజీపీ కార్యాలయం ఆదివారం పేర్కొంది. మెడికల్ క్యాంపులు, స్వీయ రక్షణ, వ్యాసరచన పోటీలు, పోలీసు వ్యవస్థపై అవగాహన, చర్చా వేదికలు, మహిళల భద్రతపై వీడియో ప్రదర్శన, పెయింటింగ్స్, రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు వివరించింది.

'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు నేడే

- 2 గ్రాడ్యుయేట్, ఒక ఉపాధ్యాయ స్థానాలకు గత నెల 27న పోలింగ్


గుంటూరులో సిద్ధమైన లెక్కింపు కేంద్రం

ఏలూరు/గుంటూరు/విశాఖపట్నం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు గ్రాడ్యుయేట్, ఒక ఉపాధ్యాయ శాసన మండలి స్థానాలకు గత నెల 27న జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. రెండు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ నాయకులతోపాటు పదుల సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయస్థానంలో ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మకు కూటమి మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూడు స్థానాల్లోనూ ఎన్నికల పోరు సాధారణ ఎన్నికలను తలపించింది. సోమవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు ఆయా జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే, ఈ లెక్కింపు ప్రక్రియ రోజురోజంతా జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఓట్ల లెక్కింపు క్లిష్టం

పట్టభద్రుల ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు మాత్రమే వినియోగించారు. నిబంధనల ప్రకారం పోలైన ఓట్లలో చెల్లనివి పక్కన పెడతారు. మిగిలిన ఓట్లలో 50 శాతం పైబడి మొదటి ప్రాధాన్య ఓటు ఏ అభ్యర్థికి లభిస్తుందో.. వారినే విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ మొదటి ప్రాధాన్య ఓటు మార్కును చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. రెండో ప్రాధాన్య ఓటుని లెక్కిస్తారు. అప్పుడు కూడా సగం కంటే తక్కువగా ఉంటే తర్వాతి ప్రాధాన్య ఓటును పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు ఇతర ప్రాధాన్యతా ఓట్లు కూడా కీలకమవుతాయి. ప్రాధాన్యతా ఓట్లను బట్టి ఫలితం నిర్దేశించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియలో జాప్యం తప్పకపోవచ్చని భావించి ఆ మేరకు షిఫ్టుల వారీగా లెక్కింపు సిబ్బందిని సిద్ధం చేశారు. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ పక్షాన పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవుల మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్లుగా ఉంది. స్వతంత్ర అభ్యర్థులు కూడా బలమైన పోటీ ఇస్తున్నారు. 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ గుంటూరులోని ఏసీ కళాశాలలో జరగనుంది. 2,41,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సాయంత్రానికే ఉత్తరాంధ్ర ఫలితం!

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది(92.45 శాతం) ఓటు వేశారు. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలితే సాయంత్రం 6 గంటల తర్వాత విజేత పేరు ప్రకటిస్తారు.

బీసీ మహిళలకు స్వయం ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)


అందజేసి ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లబ్ధిదారులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కేంద్రాలు ప్రారంభం కానున్నాయి.

లక్ష మంది లబ్ధిదారుల ఎంపిక

రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజికవర్గానికి చెందిన 1.02 లక్షల మహిళా లబ్ధిదారులకు కుట్టువిషన్లు అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.255 కోట్లను ఖర్చు చేయనుంది. బీసీ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా 46,044 మందికి, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గాలకు చెందిన వారికి 45,772 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా కాపు సామాజికవర్గానికి 11,016 మందిని ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చివరి దశకు చేరుకుంది. మహిళల భవిష్యత్తుపై భరోసా లభించేలా టైలరింగ్‌లో నిష్ణాతులైన వారితో 90 రోజుల పాటు శిక్షణ అందించనున్నారు. శిక్షణ అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నారు. కేవలం టైలరింగ్ శిక్షణతోనే సరిపెట్టకుండా ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటులోను మహిళలకే ప్రాధాన్యమిస్తున్నారు. వాటితో పాటు బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా అమలు చేసే స్వయం ఉపాధి పథకాల అమల్లోను మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. డెయిరీ, గొర్రెల వంటి యూనిట్లతో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు ముందుకొచ్చిన మహిళలకూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

చంద్రబాబు పాలనలోమహిళా సంక్షేమం: సవిత

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్ముతారని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. చిల్లర దుకాణాలు, కుట్టుశిక్షణ, అగరుబత్తీ, పామాయిల్ తదితర చిన్నపాటి వ్యాపారాల వైపు నడిపిస్తూనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం చీరలు, పూతరేకులు, చెక్కబొమ్మలు, పిల్లల ఆటబొమ్మల తయారీలో భాగస్వాములను చేస్తోందన్నారు. దీనిలో భాగంగా 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్ష మందికి పైగా టైలరింగ్ శిక్షణ అందజేసి కుట్టుమిషన్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.


శతర కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కె. శ్రీనివాస్ తదితరులు

అడవి గాయాలకు అద్దంపట్టే కవిత్వం శతర

- సిరికి స్వామినాయుడు కవితా సంపుటి ఆవిష్కరణలో వక్తలు
- ఖనిజాల కోసం అడవుల్లో మారణహోమం బాధాకరం
- సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, మార్చి2(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతోన్న సిరికి స్వామినాయుడు రాసిన 'శతర' ఆదివాసీ కవితా సంపుటి అడవి గాయాలకు అద్దపడుతోందని వక్తలు అభిప్రాయపడ్డారు. సిరికి స్వామినాయుడు రాసిన కవితా సంపుటి శతర ఆవిష్కరణ హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలుగులో కథ, నవల, కవిత్వం, విమర్శ ఏదైనా ఉత్తరాంధ్ర సాహిత్యం తర్వాతేనన్నారు. ఖనిజ సంపదను బహుళ జాతి సంస్థలకు అప్పగించేందుకు పాలకులు ఆదివాసీలు, గిరిజనుల్లో విద్వేషాన్ని రగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని అడవుల్లో మారణహోమాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీనియర్ సంపాదకుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సైనిక దాడులు, వ్యాపార నాగరికత, ఆధునిక సంస్కృతి, వికృతమైన సాంస్కృతిక లక్షణాలు తదితర ప్రభావాల వల్ల ఆదివాసీల జీవితాల్లో వస్తున్న మార్పులు 'శతర' కవితల్లో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇక, 'శతర'ను అడవి గాయాలకు అద్దం పట్టిన కవిత్వమని సుప్రసిద్ధ రచయిత అట్టాడ అప్పలనాయుడు అభివర్ణించారు. అవధానం రఘుకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య జయధీర్ తిరుమలరావు, ధాతి కవయిత్రి దాసోజు లలిత, మూలధ్వని కన్వీనర్ ఆచార్య గూడూరు మనోజ తదితరులు మాట్లాడారు. శతర అంటే ఆదివాసీ భాషలో ఉత్సవమని తెలిపిన కవి సిరికి స్వామినాయుడు.. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఛాయా పబ్లికేషన్స్ ఎడిటర్ అరుణాంక్ లత అధ్యక్షతన ప్రత్యామ్నాయ సాహిత్య సదస్సు జరిగింది. 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంగీత, నృత్యాల అభ్యున్నతిలో కీలకపాత్ర పోషించిన దేవదాసీ మీద వ్యభిచార ముద్రవేయడం అమానుషమన్నారు. సదస్సులో ప్రజాగాయని విమలక్క, కవులు, రచయిత్రులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.